
ంధ్రసచిత్రవార
పత్రిక
9-9-66
AR
35 పైసలు


డి వి యస్. ప్రొడక్షన్స్ వారి
పిడుగు రాముడు
దర్శకత్వం: బి.విఠలాచార్య
నిర్మాత: డి.వి.యస్.రాజు
రచన: సముద్రాల జూనియర్
సంగీతం: టి.వి.రాజు
పూర్ణా రిలీజ్.

ఆంధ్రసచిత్రవారపత్రిక

1966 దీపావళి కథల పోటీ

ఎప్పటివలె ఈ సంవత్సరం కూడా 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలుపటానికి సంతోషిస్తున్నాము. కథకులందరూ ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చెయ్యగలరని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 1100

రెండవ బహుమతి రు. 750

మూడవ బహుమతి రు. 500

నిబంధనలు

1. కథలు స్వంత రచనలయి ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనేననీ, దేనికీ అనువాదంకాని, అనుసరణకాని కాదనీ హామీరాసి పంపాలి. ఈ హామీ వేరే కాగితంమీద కాక కథ వ్రాతప్రతిమీదనే రాసిఉండాలి.
2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.
3. వ్రాత ప్రతిమీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాత ప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్ బుక్ పేజికి రెండురెట్లు) పేజిలకు మించరాదు.
4. కవరుమీద ''దీపావళి కథల పోటీకి'' అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టివీధి, మద్రాసు—1' కి పంపాలి.
5. పోటీ గడువు తేదీ 30—9—1966. ఆ తేదీ తర్వాత మా కార్యాలయం చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.
6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచిక'గా 11—11—1966తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.
7. పోటీ తుది నిర్ణయం ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపటానికి వీలులేదు.
8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటానికి సాధ్యంకాదు. పోటీలో పాల్గొనే వారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంపనవసరంలేదు.
9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆవిషయం ప్రచురించేముందు తెలుపుతాము.

ఉత్తరాలు

కథలు

'తెల్లవారింది' కథ చదివిన తరువాత ఈ ఉత్తరం వ్రాయలేకుండా ఉండలేక పోయినాము. భారత్ జిందాబాద్, భారత్ కీ బహదూర్ జవాన్ జిందాబాద్, ఇండియన్ ఆర్మీ జీతేగా అటువంటి నినాదలతోనే, అదే పాకిస్తాన్ సమరమునకు తరలి వెళ్లే మా యూనిట్‌కు కూడా వీడ్కోలు ఇచ్చినారు. ఆ కథ చదువు చున్నంత సేపు మాకు మా పూర్వపు రోజులు గుర్తుకు వచ్చినాయి. అటువంటి కథలు ప్రత్యేకంగా సైనిక గాథలు వ్రాయుటలో డి. కామేశ్వరిగారి ప్రత్యేకత. ఇటువంటి కథలు ముందు కూడ అందజేయాలని ప్రార్థన. ఈ ప్రతిక ద్వారా రచయిత్రికి మా ధన్యవాదములు.

టి.కె. మూర్తి, కె. రాజేశ్వరరావు,
(జయపూరు)

* * *

శుక్రవారం 19—8—66 సంచికలో ప్రచురించిన ''వెలుగు బాట'', ''అసంకల్పం'' కథలు చాల బాగున్నవి. రచయితలకు నాయొక్క ధన్యవాదాలు.

బి.ఎస్. రాములు (సికింద్రాబాద్)


కార్టూన్

స్వాతంత్ర్యదినోత్సవ సంచికలో శ్రీ బాబుగారి కార్టూను మీద రాసిన విమర్శ చదివాను. ఆ విమర్శ అక్షరాల అబద్ధం. ఎందుచేతనంటే మన తెలుగు చిత్రాలు ఏడాదికి చాల పెద్ద సంఖ్యలో తయారవుతున్నా, ఒక్కటీ మంచిది రావడంలేదు. ఇది అందరికి తెలిసిన నిజం. ఇటువంటి నిజమైన విషయం మీద కార్టూను [illegible]

'శేషప్రభ'గారిని

వెంటనే మాకు ఉత్తరం రాయగోరుతాము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక





పెద్దల కలహాలకు
పిల్లల పరిష్కారం



ఏ.వి.ఎమ్ ప్రొడక్షన్సు

లేత మనసులు





డైరెక్షన్: కృష్ణన్ పంజు

సంగీతం : M.S.విశ్వనాథన్ • మాటలు : D.V.నరసరాజు
పాటలు : దాశరథి - ఆరుద్ర
నిర్మాతలు : వీరప్పన్ & కంపెనీ

డిస్ట్రిబ్యూటర్స్ :-
అనిల్ ప్రభాస్ ఎంటర్‌ప్రైజెస్



G.H.RAO

AVM ప్రొడక్షన్సు

ఉత్తరాలు

వేయడం ఎంతయినా సమంజసం.

గాలబ్ (విజయవాడ)

న్యూఢిల్లీ లేఖ

19—8—66 వ తేదీ ఆంధ్ర సచిత్ర వార పత్రిక స్వాతంత్ర్యదినోత్సవ సంచికలో "న్యూఢిల్లీ లేఖ" ప్రచురించ లేదు. "మనలోమాట" లో కూడా దీనిని ప్రచురింప కుండుటకు కారణం తెలుపలేదు. ప్రచురింపకుండుటకు కారణం తెలుప గలరని ఆశిస్తున్నా.

—షేక్ అన్వర్ బాష (అయిరాల)

* శ్రీ కృష్ణ దేశంలో లేరు. సం.

వనితాలోకం

"ఆధునిక దినాలలో అతిథులు" చాలా ప్రశంశనీయంగా వ్రాసేరు. ప్రస్తుత పరిస్థితులలో ఈ సమస్యను ఎదుర్కొన డము చాలా కష్టంగా ఉన్నది. వీరు ఉన్నది ఉన్నట్టుగ చాలా బాగుగా వ్రాసేరు. ఇటువంటి రచనల ద్వారానైనా మన సోదరులు కొంత మార్గము లోనికి వచ్చెదరని మా అభిప్రాయము.

డి. జగదాంబ (బరంపురం)

వ్యాసాలు

5—8—66 మీ సంచికలోని 'మద్రాసులో తెలుగు సినిమాలు' అన వ్యాసం చదివాను. మోహన్‌కుమార్ నిజాన్ని వ్రాసి కొందరు నిర్మాతలకైనా ఈ విషయం తెలిసేటట్టు చేశారు.

ఈ వ్యాసంవల్ల కొంత విజయం చేకూరిందని చెప్పొచ్చు. ఎందుకంటే క్రౌన్‌లో పరమానందయ్య శిష్యులు కథ వెళ్ళి భక్త పోతన ఆంధ్రాతో సమానంగా విడుదల అయింది. నిజంగా చాలామంది మద్రాసులోని తెలుగువాళ్ళు కొత్త తెలుగు సినిమాల కోసం ఆతృతగా చూస్తూ ఉంటారు. ఎప్పుడో ఆంధ్రకు వెడితేనేకాని వాళ్ళకి చూడ్డానికి వీలుపడదు.

మిగిలిన నిర్మాతలు ఈ విషయంలో సహకరించి ఈమధ్య విడుదల అయిన, అవబోతున్న సినిమాలు ఉదాహరణకు కన్నె మనసులు, సంగీతలక్ష్మి, శ్రీ కృష్ణ తులాభారం మొదలగునవి ఒక్క క్రౌన్‌లోనే కాకుండా మిగిలిన థియేటర్లలో అయినా సరే విడుదలచేసి తెలుగువారికి ఆనందం కలుగజేస్తారని ఆశిస్తున్నాను.

డి. ఎల్. ఎన్. శాస్త్రి (మద్రాసు.) ●

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 9—9—'66

పరాభవనామ సం॥ నిజ శ్రావణ మాసం బ॥ నవమి

సంపుటము : 58 సంచిక : 54

స్థాపితము :

1908

*

ముఖ్య సంపాదకుడు :

శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము

7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్రవారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వార రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతరదేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేనన్నీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలో మాట

గర్భంలోని శిశువుల ఛాయాచిత్రాలని గురించి వేసిన వ్యాసంలో రచయిత జాన్ స్టీవెన్సన్ చెప్పినట్లు త్వరలో శరీరంలోని వివిధ భాగాలని ఫొటోలుతీసే పద్ధతులు శాస్త్రజ్ఞులు కనిపెట్టవచ్చు. అటువంటి అభివృద్ధి వివరాలని కూడా ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురించగలమని ఆశిస్తున్నాము!

* * *

శాకాహారం అంటే ప్రత్యేకాభిమానం ఉన్నవారు ఈ సంచిక 48వ పేజీ చూడవచ్చు...

* * *

ఇంతకుముందే ఆంధ్రసచిత్రవారపత్రికలో ద్రావిడోద్యమాలని పరిశీలించే వ్యాసశీర్షిక నాలుగువారాలు వేశాము. ఈవారం హిందీభాషకి సంబంధించిన రాజకీయాలని కొన్నిటిని పరిశీలించే వ్యాసం ఒకటి వేస్తున్నాము. ఇదీ 'మెయిన్ స్ట్రీమ్' వారపత్రిక అనుమతితో వేసినదే...

* * *

వచ్చేవారమే వినాయకచవితి ప్రత్యేక సంచిక! ప్రత్యేక హాస్యసంచిక!!

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి ఎల్. విజయలక్ష్మి


మీరు ఇతని విషయం కాస్త చూడాలి
నా దగ్గర డబ్బులేదు
కేంద్రం
రాష్ట్రం
అగ్నికి ఆజ్యం.
పాకిస్తాన్ కు రక్షణ ప్రతిపాదన
భారత్ వ్యతిరేక జ్వాల
మీ ఆరోగ్యం సరిగా లేదు విశ్రాంతి తీసుకోండి
పదవీ విరమణ
సుకర్ణో అనారోగ్యంగా ఉన్నారట వార్త
మనం కలిసి ఉంటే ఇతని జబ్బు నయం చేయగలం
ప్రపంచం-లోని ఉద్రిక్తతలు

హిందీ రాజకీయాలు

26 జనవరి నాడు హిందీ 'అధికార భాష' అయినప్పుడు మద్రాసు రాష్ట్రంలో కొన్ని హిందీ బోర్డుల మీద తారుపూశారు. అల్లర్లు తగ్గిన తర్వాత ఉన్న కొద్ది హిందీ బోర్డులూ మాయమయ్యాయి. ఇదే అందరికీ కనిపించిన పెద్ద మార్పు. న్యూఢిల్లీలో పోలీసు అంగీకారంతో మరి కొందరు తమ తారు మరకలు పూయక పోలేదు.

ఇది ఒక విధంగా ఇరువైపుల వారికీ ఒకరిమీద ఒకరికి విశ్వాసం తగ్గటమే. కేంద్ర ప్రభుత్వం హిందీతోబాటు ఇంగ్లీషు కూడా— హిందీ మాతృ భాషలేనివారు కోరినంత కాలం— అధికార భాషగా ఉంటుందని హామీ ఇచ్చింది. ఇందులో హిందీ మాతృభాష కానివారికి చేసిన అపకారం అంటూ ఏమీలేదు. జవహర్ లాల్ నెహ్రూ పై హామీ ఎప్పుడో ఇచ్చారు. అయితే నెహ్రూ జీవించి ఉన్నప్పుడే హిందీ 'లాబీ' వర్గాలు ఆయన ఇచ్చిన హామీ అమలు జరగకుండా చూశారు. ఆయన మరణించిన తర్వాత ఈ అవకాశం మరింత తగ్గి పోయింది. హిందీలాబీని ఎదిరించే శక్తి కేంద్ర ప్రభుత్వానికి అసలే లేకపోయింది. అధికార భాష చట్టంలోనే కొంత అస్పష్టమయిన అర్థాలు వచ్చేట్లు చేశారు. మద్రాసులో జరిగిన అల్లర్ల తర్వాత హిందీ రక్షణ కోసమే మరికొన్ని ఏర్పాట్లు జరిపారు.

భారతదేశ రాజ్యాంగంలో ఫెడరల్ పద్ధతి ముఖ్యమయితే ఒకేఒక భాష అధికారభాషగా ఉండటం కొంచెం విచిత్రంగా ఉంటుంది. ఇటువంటి పద్ధతి ప్రపంచంలో ఎక్కడా లేదు. సోవియట్ రాజ్యాంగం కూడా ఫెడరల్ రాజ్యాంగమే కాని రష్యాలో ఏ ఒక్కటీ అధికారభాష కాదు. అమెరికాలో కూడా అంతే. అధికార భాష ప్రసక్తి అంటూ వస్తే అన్నిటికీ ఉంటుంది. ఈ పద్ధతి యుగోస్లోవియా స్విట్జర్లాండ్లలో ఉంది.

'భాషల అల్లర్ల'లో మరే మంత్రీ చెయ్యని పని శ్రీమతి ఇందిరా గాంధి చేశారు. మద్రాసుకి వెళ్లి దక్షిణాదివారికి హిందీ ఇష్టంలేకపోతే అధికార భాష చట్టాన్ని మార్చి వెయ్యటం జరుగుతుందని ప్రకటించారు. ఇది జరిగిన సంవత్సరం తర్వాత ఆమె కాంగ్రెసు పార్టీ నాయకురాలుగా ఎన్నిక అయింది. అయిన వెంటనే పత్రికా విలేఖరులతో జరిపిన గోష్ఠిలో తను మద్రాసులో చేసిన ప్రకటన విషయంలో మార్పు ఏదీ రాదన్నారు.

ఈ ప్రకటనలో వివరించిన విధానాన్ని అమలు పరచటంలో వచ్చిన కష్టం ఏమిటి? రాజ్యాంగాన్ని మార్చే బదులు అధికార భాషాచట్టంలో 'తీరాలి' అనే అర్థాన్ని 'చెయ్యవచ్చు' అనే విధంగా మార్చడానికి మాత్రం కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇప్పుడిప్పుడు స్పష్టం అవుతోంది. ఎన్నికల ముందు తగిన మార్పులు ప్రభుత్వం చేస్తుందా అనేదీ అనుమానాస్పదం. 'ద్రావిడమున్నేట్ర కజగం' మాత్రం దీనిని ఎన్నికలలో ప్రచారానికి వాడుకోక తప్పదు.

ఇప్పుడు అధికార భాషలో మార్పులు తీసుకువస్తే హిందీ రాష్ట్రాలలో కాంగ్రెసుకి దెబ్బ రావచ్చునని ప్రభుత్వం భయం. జనసంఘం, సమ్యుక్త సోషలిస్టు పార్టీలు ఎన్నికలలో హిందీ అభిమానులకి నచ్చే ప్రచారం చేస్తారని వారి భయం. కేరళ, తమిళనాడులలో కాంగ్రెసు వోడినా హిందీ రాష్ట్రాలలో వోడరాదని కాంగ్రెసు వారి ఉద్దేశం అని తోస్తుంది. లేకపోయినట్లయితే ఇచ్చిన మాట నిలబెట్టుకోడానికి వచ్చిన కష్టం ఏమిటి?

ఈ విషయంలో దక్షిణాది కాంగ్రెసు నాయకులు కొందరికీ అనుమానాలు కలుగు తున్నాయి.

ఇటీవల కేంద్ర చట్టశాఖ మంత్రి వర్గంవారు ఎవరో యు.పి. ఎస్.సి. పరీక్షలు భారతదేశంలో 14 భాషలలోను రాయటానికి వీలు లేదని ప్రకటన చేశారని పత్రికలలో పడినా, అధికారయుతంగా దీనిని ఎవరూ ఖండించలేదు. అంతేకాక ప్రజా శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని దీని విషయమయి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు వెలువరించడం సాధ్యం కాదన్నారు. మద్రాసు ముఖ్యమంత్రి, యు.పి.ఎస్.సి. పరీక్షలు పద్నాలుగు భాషలలోనూ జరిగే ఏర్పాటు జరిగిందన్నారు కాని కేంద్ర ఆంతరంగిక మంత్రి ఇది నిజంకాదని లోక్‌సభలో అన్నారు.

'మూడుభాషల పథకం' హిందీ రాష్ట్రాలలో చాలా ఆలస్యంగా ప్రవేశపెట్టారు. కాని దానిని ఎంత సవ్యంగా అమలు పరుస్తున్నారనేది ప్రశ్న. ఈ సంగతిని కేంద్ర ప్రభుత్వమే నిజమని అంగీకరించింది. ఇక ద్రావిడ మున్నేట్ర కజగం దీనిని వాడుకోకుండా ఉంటుందా? ఉత్తర దేశంలో హిందీ, ఇంగ్లీషులతో

హిందీ రాజకీయాలు

బాటు సంస్కృతం నేర్పి హిందీని బల పరుస్తున్నారు. దక్షిణ రాష్ట్రాలలో హిందీ బలం పెరుగుతోంది. దీని అర్థం ఏమిటి? తమ మోసపోయామని కొందరు దక్షిణ రాష్ట్రాల ముఖ్య మంత్రులు అనుకుంటే తప్పేముంది?

మహారాష్ట్ర, గుజరాత్, ఒరిస్సా వంటి రాష్ట్రాలు హిందీని స్వీకరించాయి కాని ఇటువంటి రాష్ట్రాలని హిందీ రాష్ట్రాలు తమతో సమానమయినవిగా అంగీకరిస్తాయా? హిందీ రావటానికీ, హిందీ మాతృ భాష అవటానికీ చాలా భేదం ఉంది. ఈ మధ్య బీహార్ ముఖ్య మంత్రి బొకారో ఉక్కు ప్రాజక్టులో ఉద్యోగాలన్నీ బీహార్ వారికే ఇవ్వాలన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ వారు కూడా హిందీ మాట్లాడుతారు కాని బీహారీలతో సమానులు కారన్న మాట. ఈ పద్ధతి మీద ఒరిస్సా, బెంగాల్ వారు 'మరింత తక్కువ వారని' ఫూహించ వలసి వస్తుంది. క్రమంగా హిందీరాష్ట్రాల వారికీ, హిందీని స్వీకరించిన రాష్ట్రాల వారికీ మధ్య విభేదాలు పెరుగుతాయి. క్రమంగా హిందీ ప్రజలు, హిందీమాట్లాడే ప్రజలు, హిందీని స్వీకరించని ప్రజలు అని మూడు రకాల ప్రజలు ఏర్పడుతారు.

డాక్టర్ లోహియా ఒకసారి ఒక చిత్రమయిన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 'తీరప్రజలు', 'ఆంతరంగిక ప్రదేశాల ప్రజలు' అని రెండు తెగల వారున్నారనీ, బెంగాలీ— తమిళ— మళయాళ ప్రజల వంటి తీర ప్రజలు బ్రిటిషు పరిపాలన వల్ల కలిగిన మంచినంతా వీరే తీసుకున్నారనీ, దేశంలోపల ఉండే వారిని అణగదొక్కుతున్నారనీ వివరించారు. ఇలా అణగదొక్కటానికి ఇంగ్లీషు ఒక సాధనంగా ఉందని డా. లోహియా అన్నారు. హిందీ ప్రాంతాలలో ఇంగ్లీషు ముందు పోవటమే దీనికి విరుగుడు అని లోహియా సూచన.

తర్వాత ఆయన హిందీ, హిందీ— ఇతర రాష్ట్రాల సిద్ధాంతాన్ని మరొకటి ప్రతిపాదించారు. కాని, హిందీ— ఇతర రాష్ట్రాలకి హిందీ రాష్ట్రాలంటే ద్వేషం లేకపోయినా హిందీ రాష్ట్రాల వారికి తక్కిన వారంటే ద్వేషం లేదనలేము.

హిందీ కేవలం భాషా సమస్య మాత్రమే కాదు. అదొక పెద్ద రాజకీయ సమస్యగా మారుతోంది. ఇది శ్రీ అన్నాదురయి కూడా గుర్తించిన విషయం. హిందీ దురభిమానంతో బాటు హైందవ దురభిమానం కూడా కొన్ని విధాలగా తల ఎత్తక మానదు. కొన్ని హిందీ రాష్ట్రాలలో ఉర్దూకి పట్టిన దుర్గతే దీనికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూకి ఉన్న ప్రత్యేక స్థానం మరే హిందీ రాష్ట్రంలోనూ లేదేమో. అందుకనే, ఇటీవల కేరళ పర్యటించి వచ్చిన తర్వాత శ్రీ ఫక్రుద్దీన్ అహమ్మద్ శ్రీ కామరాజుతో 'అల్ప సంఖ్యాక వర్గం' వారి సమస్యలని కొత్త దృక్పథంతో పరిశీలించాలన్నారు. వీరి అభ్యర్థనకి అధికారయుత మయిన 'స్థాయి' ఏదీ లేకపోయినా ఒక ధోరణిని ఇది తెలుపు తుంది.

ఉర్దూకే లేని గౌరవం ఇంగ్లీషుకి లభిస్తుందా అని దక్షిణాదివారు కొందరు భయపడుతున్నారు. మద్రాసులో 1965 లో జరిగిన అల్లర్ల తర్వాత శ్రీ నందా చేసిన రేడియో ప్రసంగంవల్ల హిందీ అభివృద్ధి— అంటే అధికారభాషగా— కనీసం 20 సంవత్సరాలు వెనకబడిందని ఎందరో అనుకున్నారు. నేటి పరిస్థితులు చూస్తే అధికార భాషగా హిందీ అభివృద్ధి మరింత వెనక్కి జరిగిందని అనుకోవలసి వస్తుంది. అధికార భాష చట్టాన్ని సవరించేబదులు 'అపసరణ వాదాన్ని' చట్ట విరుద్ధం చేశారు. ద్రా. ము. క. తమ అపసరణ ఉద్యమాన్ని వదులుకున్నట్లు కనిపించినా ఆ ఉద్యమాన్ని మరింత తీవ్రంగా కొనసాగిస్తోంది. ద్రావిడ కజగం నాయకుడు శ్రీ ఇ. వి. రామస్వామి నాయకర్ ఎన్నికల తర్వాత తమిళనాడు అపసరణాన్ని కోరుతామని ప్రకటించారు. పరిస్థితి క్రమంగా దిగజారుతూ ఉంది.

—'వైడ్ ఏంగిల్' ●

—['మెయిన్ స్ట్రీమ్' పత్రికనుంచి]



"అందరితో మాట్లాడాలని అనుకుంటాను. కలసి మెలసి వుండాలని అనుకుంటాను. కానీ అలా చెయ్యలేను— ఎందుకో తెలియదు. నలుగురితో కలసి వుండలేనని పిస్తుంది. కానీ యితరులు కలసి హాయిగా నవ్వుతూ కబుర్లాడుతుంటే సహించలేను— అదే నా [illegible] హీనత"

ఈ మాటలు వింటూ ఆ మాటలంటున్న అమ్మాయిని కళ్లప్పగించి చూస్తున్నాను. దీనికి జవాబేమి చెప్పాలి అన్న సందేహం వచ్చింది. యేమి అనలేక నవ్వి వూరుకున్నాను.

"అన్నట్లు నీకు పుస్తకాలు చదవడం అంటే యిష్టమేనా పార్వతీ" అని అడిగింది సరోజ. నేను జవాబు చెప్పేంతలోపల నాన్నగారు పిలిచారు "వస్తాను" అని చెప్పి మా యింటికేసి నడిచాను.

"ఎక్కడికి కెళ్లావమ్మా"

"మనింట్లో అద్దె కొచ్చారే వాళ్ల దగ్గరికి కెళ్లాను నాన్నా. యివ్వాళ యింత ఆలస్యం అయిందేం?"

"ఈరోజు కొంచెం పనెక్కువగా వుండీ ఆలస్యమయిందమ్మా. అన్నట్లు జనార్ధనంగారి అమ్మాయి పేరేంటి?

"సరోజ"

"స్నేహం కలిసిందా? నీ వయస్సే వున్నట్టుంది ఆ అమ్మాయికి"

"ఆ..." అంటూ లోపలి కెళ్లాను నాన్నగారికి టిఫిన్ యివ్వడానికి.

టిఫిన్ తీసుకున్న తరువాత కాస్సేపుండి నాన్నగారు షికారెళ్లారు. సరోజ గురించి ఆలోచిస్తూ కూర్చున్నా. సరోజ వాళ్లు అంటే సరోజ— సరోజ నాన్న గారు మా యింట్లోకి అద్దెకొచ్చి రెండు రోజులైంది. సరోజకు నా వయసే అనుకుంటా. నాకంటే అందంగా వుంటుంది. ఒట్టిగా కాదు చాలా అందంగా వుంటుంది. ఎలాటి వారినైనా యిట్టే అకర్షించగల వామె కళ్లు. ఈ రెండు రోజుల్లో చూస్తే ఆమెకు ఎక్కువగా మాట్లాడ్డం అలవాటు లేనట్టుంది— ఏదో ముభావంగా జవాబులు చెబుతుంది ఒక్కోసారి. కలుపుగోలుతనం లేదనిపించింది. లేకపోతే తన వయసు పిల్ల ఆయింట్లో వుందని తెలిసీ అలా ముభావంగా వున్న వాళ్లను తనిప్పుడే చూస్తోంది. నేనే మరింత నాగి తనను విసిగించానేమో ఈ రెండు రోజుల్లో......... యిలా ఆలోచిస్తూ వుంటే నిద్ర ముంచుకు వచ్చింది. మగతగా కన్ను మూశాను.

"పార్వతీ" నాన్న వసారాలో నుండి పెట్టిన కేక వినపడింది.

"వస్తున్నా" అంటూ బయటకు వచ్చాను. సరోజ వచ్చింది చేతిలో ఓ గిన్నెతో.

"రా సరోజా" అంటూ ఆహ్వానించాను.

"యివ్వాళ కొత్తరకం కూర చేశాను పార్వతీ" అంటూ తను తెచ్చిన గిన్నె టేబిల్ మీద పెట్టింది.

'చాలా థాంక్స్" అన్నాను.

'ఆ అందులో యేవుందీ' నవ్వింది సరోజ.

అబ్బ సరోజ నవ్వితే యెంత బావుందీ. ఇవ్వాళ ప్రొద్దుటనుంచి బాగా మాట్లాడినా ముభావంగా వుంటుందని యెలా అనుకున్నాను అనిపించిందా క్షణంలో.

"ఇక వస్తాను" అంటూ లేచింది గుమ్మందాకా వెళ్లాను కూడా.

కొత్తవారిని చూస్తూనే— మొట్ట మొదటి చూపులోనే వారి గురించి కొన్ని అభిప్రాయాలు ఏర్పరుచు కోవడం— కొన్ని సమయాల్లో వారి గురించి ఆలో చించడం— సహజం— కానీ వారంతా మన మనుకున్నట్లే వుంటారనీ అనుకోవడం పొరబాటని యిప్పుడు తెలిసొచ్చింది. లేకపోతే అంత బాగా మాట్లాడుతున్న సరోజను గురించి నేనెందుకలా ఆలో చించాను?

యేమిటో మంచి సరోజ దొరికింది తనకు. దినమంతా ఆలోచనలతో పరిపోతుంది.... అనుకుంటూ లోనికెళ్ళాను.

* * *

ఆరోజు లలిత మాయింటి కొచ్చింది. యిద్దరూ మాట్లాడుతూ కూర్చున్నాం. మాటల సందర్భంలో లలిత అడిగింది. "మీ యింట్లో కెవరో అద్దె కొచ్చారల్లే వుందే అని.

"అవును— సరోజ అని వో అమ్మా యుంది పరిచయం చెయ్యనా?" అన్నాను.

"అవస్యం" అంది లలిత నవ్వుతూ.

లలిత నేను కలిసి ఒకే కాలేజీలో బి. ఎ. చదివాము. లలితకి వాగుడుపిట్ట అని పేరు కాలేజీలో. క్షణంసేపు కూడా మాటాకుండా వూరికే కూర్చోదేమో నని అన్పిస్తుంది. లలిత అంటే నాకు చాలా యిష్టం. తను చాలా ఫ్రాంక్. యేమైనావుంటే ముఖాన్నే అంటుంది గానీ వెనుకొక మాటా ముందొక మాటా అనే రకం కాదు.

'సరోజా' సరోజను పిలిచాను.

"రా పార్వతీ" ఆహ్వానించింది.

"నా స్నేహితురా లొచ్చింది. మా యింటికి పోదాం సరోజా" అన్నాను.

"వస్తున్నా" నంటూ నిముషంలో వచ్చింది.

యిద్దరం యిల్లు చేరుకున్నాం.

"ఈమె లలిత, నాకు బి. ఎ. లో క్లాసుమేట్", "ఈమె సరోజ" అంటూ ఒకరి నొకరికి పరిచయం చేశాను వారిద్దరూ కబుర్లలో పడ్డారు. టిఫిన్ తీసుకున్న తరువాత కాస్సేపుండి లలిత వెళ్ళి పోయింది. సరోజ కూడా వెళ్ళి పోయింది.

ఒంటరి తనం మిగిలింది నాకు సరోజను గురించి ఆలోచించడాన్కి. యివ్వాళ లలితతో నాతో చక్కగా మాట్లా డింది సరోజ. మరి ఆరోజు "నలుగురితో కలవలేను. వారు ఆనందంగా వుంటే చూడలేను" అందేమిటి...... యేమిటి ఈ మనిషి తత్వం. అర్ధం గాకుండా వుంది. నాకెందుకో తన మనస్సుకు స్థిరత్వం లేదని పించింది. ఒక్కొక్కసారి ఒక్కొక్క లాగా వుంటుంది. మాటాడితే చక్కగా మాటాడుతుంది. లేకపోతే మూతి ముడు చుకు కూర్చోవడం...... యిలాగే వద్దను కున్నా సరోజ గురించే ఆలోచిస్తూ కూర్చుండి పోయాను.

* * *

సరోజా వాళ్ళు వచ్చి నెల రోజులైంది. ఆరోజు నేను తలంటి పోసుకుని జుట్టు ఆరబెట్టు కుంటున్నాను యెండలో. సరోజ వచ్చింది. రాగానే—

"పార్వతీ... నాకొక్క సహాయం చెయ్యాలి. యేమనుకోకపోతే అడుగుతా నంది"

"అనుకోవడమేమిటి చెప్పు సరోజా"

"మానాన్నగా రివ్వాళ వాళ్ళ ఆఫీసులో పనిచేసే 'మూర్తి' అన్న అబ్బాయిని భోజనానికి పిలిచారట, వంట చేయడం యెంతటికీ తెమలడం లేదు. కొంచెం సహాయం చేస్తావా?"

'తప్పకుండా'

యెలాగో వోలాగు మూర్తి గారు యింటికి వచ్చేసరికి అన్నీ సర్ది పెట్టేసి వంట పూర్తిచేసి కూర్చున్నాం.

జనార్దనం గారూ— మూర్తిగారూ భోజనానికి కూర్చున్నారు. వడ్డనలో కూడా సహాయ పడ్డాను. మా యిద్దరిని మూర్తిగారికి పరిచయం చేశారు. మూర్తి చాలా బాగా మాటాడే మనిషి— భలే నవ్విస్తుంటాడు తన ఛలోక్తులతో. ఆయన యేమైనా అనటం నేను నవ్వటం ఒకసారి మూర్తి యేదో జోక్ కట్‌చేస్తే గట్టిగా నవ్వాను నేను— సరోజ ఒకలా యిబ్బందిగా మొహం పెట్టి అక్కడ నుండి లేచిపోయింది. ఇక నవ్వడంమానేసి 'యిదేమిరా భగవంతుడా' అనుకొని వారి దగ్గర సెలవు పుచ్చుకొని యిల్లుచేరాను.

* * *

మరుసటి రోజు ప్రొద్దున లేచినప్పటి నుండి ఒళ్ళంతా నొప్పులుగా వుంది. కళ్ళు మంటలు. అందుకని అలాగే పడు కున్నాను. నాన్నగారు జ్వరం వస్తుందేమో నని గాబరా పడుతున్నారు.

"డాక్టర్ను తీసుకు వస్తాను పార్వతీ"

"ఒద్దు నాన్నా. ఒళ్ళు నొప్పులేగా అదే తగ్గిపోతుంది" అన్నాను.

కాదు కూడదు అని డాక్టర్ని తీసుకు వచ్చారు. జ్వరం లేదూ, పాడూలేదూ అంటే వింటేనా. డాక్టరు నాన్నగారి గాబరాను చూసి నవ్వుకుంటూ "యేమీ లేదండీ.... మంపు పంపుతాను" అని వెళ్ళి పోయాడు.

ఆఫీసుకు సెలవు పెడ్తానంటున్న నాన్నగారిని వద్దని బలవంతము జేసి పంపించాను. అసలు నాకేమైందని ఆయన అంత గాబరా పడ్తారు. నాన్న ఆఫీసు కెళ్ళాక బాగా నిద్రపట్టింది నాకు. చాలా మట్టుకు తగ్గాయి నొప్పులన్నీ కానీ నీరసంగా వుంది. లేచి ముఖం కడు క్కొని చీర మార్చుకొని వచ్చి పేపర్ చూస్తూ కూర్చున్నాను. టైము 2 గం. అయింది. ఎండ నిప్పులు చెరగు తోంది. సరోజ టక్కు టక్కుమని హైహీల్సు చప్పుడుతో వచ్చింది.

"పార్వతీ యివ్వాళ సాగర్‌లో మంచి పిక్చరు. పోదాం తొందరగా రెడీ అవు." అంది తనమాటకు తిరుగు లేదన్నట్లుగా.

"లేదు సరోజా. నేనిప్పుడు రాలేను తలనొప్పిగా వుంది" అన్నాను.

సరోజ ముఖం బాగా ఎర్రబడింది. "అవును నీకు మూర్తిలాగా నవ్విస్తూ వుంటే యెంతసేపైనా నవ్వుతూ కూర్చుం టావు గానీ నాతో పిక్చర్‌కు రావడానికి మాత్రం తలనొప్పి. నా పిచ్చిగాని మాలాంటి వాళ్ళతో ఎందుకొస్తావు. లలితలాంటి వాళ్ళను వెనకేసుకుని మీ బాయ్‌ఫ్రెండ్సు తో పోతావు గానీ........"

"సరోజా" గట్టిగా అరిచాను.

కోపంతో ఒళ్ళంతా వుడికిపోతోంది, నేను అసలే నీరసంగా చికాగ్గా వున్నా నేమో ఈ మాటలకు తట్టుకోలేక పోయాను.

"అవును నేను మూర్తిలాంటి వాళ్ళ తోనే మాటాడుతాను. లలితని వెన కేసుకొని బాయ్‌ఫ్రెండ్సుతో పిక్చర్లకి వెడతాను. చెప్పు యే రోజు చూశావు నన్ను అలాపోవటం. ఛీ... పో.. ముందిక్కడ నుండి....." ఇంకా యేమన్నానో యేమో గానీ ఒళ్ళుమీద తెలివిలేకుండా తిట్టేశాను.

సరోజ వెళ్ళిపోయింది గొణుగుతూ.

పడకమీదపడి భోరున యేడ్చాను

"చిన్నప్పుడే అమ్మను పోగొట్టుకున్న నన్ను......తల్లి ప్రేమ అంటే యేమిటో యెరుగని నన్ను..... యెందుకలా అన్నావు సరోజా. నాలో నేనే గొణుక్కున్నాను సరోజతో చెప్పలేక. అమ్మలేని లోటు గుర్తుకువచ్చి మనస్సంతా అల్లకల్లోల మైంది. యేడ్చి యేడ్చి నీరసంగా పడు కున్నాను.

సాయంకాలం _ నాన్న ఆఫీసునుండి

వస్తూనే "ఎలా ఉందమ్మా" అని అడిగారు.

"తగ్గిపోయింది నాన్నా" అన్నాను.

అమ్మ పోయినప్పటినుండి కంటికిరెప్పలా కాపాడిన నాన్న నన్ను గురించి యెంత బాధ పడ్డారో తల్చుకొంటే మధ్యాహ్నం సరోజ అన్నమాటలు గుర్తువచ్చాయి. అబ్బ, సరోజ యెందు కలా అంది? అంత నీచ భావం ఉందా ఆమెలో. మూర్తితో ఒక్క రోజు అందులో ఒక్క గంట మాటాడిన దానికే నాకూ మూర్తికి సంబంధం అంట గట్టిన సరోజను మ్రింగేద్దామన్నంత కోపం వచ్చింది. సాటి ఆడదాన్ని ఆమాత్రం అర్థం చేసుకోలేదా? లలితతోటి పిక్చర్‌కు వెడతానంది తనో రోజు. సరోజ అడిగితే యెవరెవరు వెడతారని తనే చెప్పినట్టు గుర్తు. లలిత, వాళ్ల బావ నేను వెళ్లామని. అవును అందులో తప్పేముంది. లలితా తన బావా రేపో, యెల్లుండో పెళ్లిచేసుకో బోయేవాళ్లు! అతన్ని నా బోయ్ ఫ్రెండ్ అనటానికి సరోజ కెంత ధైర్యం. యిదంతా చూస్తే సరోజ నిజంగా నలుగు రితో కలపలేదు....వాళ్లు హాయిగావుంటే చూడలేదు—ఇది నిజం అనిపించింది.

అలాగే నాలుగైదు రోజులైపోయాయి. నేను సరోజతో మాటాడలేదు. తను నాతో మాటాడలేదు.

ఒకరోజు లలితొచ్చింది. లలితతో అంతా చెప్పి భోరున యేడ్చాను. లలితమాత్రం "ఛ వూరుకో పార్వతీ.....యేదో అది నోటి కొచ్చిందల్లా వాగితే దానికే యింత బాధ పడాలా. తను అన్నంతమాత్రాన మా బావ నిన్ను పెళ్లి చేసుకోడులే. అసలు నేను వదుల్తానా! అంటే నాకు నవ్వొచ్చింది. లలిత మాటలు విన్నాక నాక్కూడా అని పించింది నే నెందుకంత బాధపడాలి. ఏమో యింతవరకు మా నాన్నగానీ మా అన్నయ్యా రఘుగానీ యెవ్వరూ నన్నొకమాట అన లేదు వారు అనగా లేంది సరోజ మాట ల్నేమిటి పట్టించుకోవడం. నే నింత వరకు యెవరితోనూ మాట లాడడం మాన లేదు నా జీవితంలో. అందుకనే బాధే సింది.

సాయంకాలం నాన్న ఆఫీసునుండి వస్తూనే రఘు అన్నయ్యా వస్తున్నాడనీ,కూడా యెవరో ఫ్రెండ్ కూడా వస్తున్నాడనీ కొన్ని రోజు లిక్కడే వుంటాడనీ అతనికి ముందు వరండాలోని గది ఖాళీచేసి పెట్ట మనీ రాశాడని చెప్పారు. నాకు చాలాఆనంద మైంది. యెల్లుండి వస్తారట. రేపు ఖాళీ చెయ్యొచ్చు అనుకున్నాను.

సరోజ

మరుసటి రోజు అన్నయ్య ఫ్రెండ్ కోసమని రూము ఖాళీ చేస్తుండగా సరోజ వచ్చింది. "యేమి చేస్తున్నావు పార్వతీ" అంటూ. ఆశ్చర్య పోయాను. ఆరోజుకు మేము మాటాడ్డం మానేసి సరిగ్గా వారం రోజులైంది. తనంతకు తానై యేమీ జరుగనట్టే ఎంత తీయగా మాటాడుతోంది... క్షమాపణ చెప్పుకోవ డానికి కాబోలు వచ్చింది అనుకున్నాను. కానీ నాభావాలేమీ బయట కనపడనీయ కుండా వో కుర్చీ ముందుకు లాగి, "కూర్చో సరోజా. మా అన్నయ్య రేపు వస్తున్నాడు. అందుకని రూం ఖాళీ చేస్తున్నా" అన్నాను.

"మీ అన్నయ్య పేరేమిటి?" ప్రశ్నిం చింది సరోజ.

'రఘు' అన్నాను.

కాస్సేపు కూర్చుంది. "యిక వస్తా, పనుంది" అంటూ వెళ్లి పోయింది. నాకు ఒళ్లు మండింది. క్షమాపణ చెప్పుకోవడానికి వచ్చింది అనుకున్నా. తనకేం చక్కగా అనే మాటలు నాలుగూ అంటించి వెళ్లిందారోజు. నేనెంత బాధ పడ్డానో తనకేం తెలుసు... అసలెందుకు వచ్చినట్టు యిప్పుడు? యేమిటో ఈ మనిషి తత్త్వం.... అనుకుంటూ పని చేసుకో సాగాను. ఆలోచనలు అన్నయ్య మీదికి మళ్లాయి. అన్నయ్య రఘు బి. యి. ఫైనల్ రాసి వస్తున్నాడు. అప్పుడే మూడు నెలలవుతూంది అన్నయ్యను చూసి. అబ్బ రేపు వచ్చేస్తున్నాడు. చక్కగా యెన్నో కథల పుస్తకాలు తెస్తాడు. అన్నయ్యకి నేనంటే యెంత యిష్టమనీ..... నా ఆలోచనలకి నాకే నవ్వు వచ్చింది. వున్నట్టుండి యింకొకటి తట్టింది. కథల్లో లాగా రఘు అన్నయ్య అమాంతంగా అందంగా వుందనుకొని సరోజను ప్రేమించెయ్యడు గదా....యేమో మగాళ్ల నిట్టే ఆకర్షించగల అందం వుంది సరోజలో.. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారు. అలాగే అయిపోదు గదా. ఎలా గైనా యిలాటి దేదీ జరుగనివ్వకూడదు తను. అమ్మలేని నన్ను ఆదరంగా చూచు కునే వదిన కావాలి. నాకు సరోజ వద్దు భగవాన్..... యేడుపొచ్చింది నాకు.

అన్నయ్య రానే వచ్చాడు... 'పారూ' అంటూ.

'అన్నయ్యా' పరుగెత్తాను దగ్గరికి

"అమ్మో ... పడతావు జాగ్రత్త" అన్నాడు అన్నయ్య నవ్వుతూ.

సామానంతా లోపల పెట్టించారు అన్నయ్య తన స్నేహితుడు మధుని పరిచయం చేశాడు నాకు. మధు యెక్కు వగా మాట్లాడడు. పరిచయం చేశాడు గగా యేమీ మాట్లాడకపోతే బాగుండ దన్నట్టు నాలుగు ముక్కలు మాటాడా డంతే.

ఆదినం సాయంత్రం నేను, అన్నయ్యా, మధు కూర్చుని టీ తీసుకుంటుంటే సరోజ వచ్చింది.

'రా సరోజా' అన్నయ్యా, మధూ ఒక్క సారే పైకెత్తి చూశారు నేనన్న మాటకి. లోపలికి తీసి కెళ్లాను. కానీ నాకు భయంగా వుంది. సరోజను చూసి అన్నయ్య యేమనుకున్నాడో యేమో.

"మీ అన్నయ్యకీ నీకూ చాలా పోలిక లున్నాయి. ఇంకొకతను యెవరూ"అందిసరోజ.

"అన్నయ్య ఫ్రెండ్ మధు" అన్నాను.

యివ్వాళ నేను షాపింగ్ వెళ్లాలను కుంటున్నాను. నీకు వీలుంటే వస్తా వేమోనని......" అంది నసుగుతూ.

నేను రానంటే మరలా రామాయణ మౌతుందేమో ననుకుని చటుక్కున ఒప్పుకున్నాను.

మేము షాపింగ్‌కి వెళ్లి తిరుగొచ్చేసరికి 8 గం. అయింది. నాన్న అన్నయ్య అందరూ నాకోసం కాచుక్కూర్చున్నారు.

భోజనాలు కాగానే కాస్సేపు మాటాడాం అందరూ. నిద్రవస్తోందని పక్కమీద చేరాను.

కాస్సే పటూయిటూ దొర్లేసరికి నాగది తలుపు త్రోసిన చప్పుడైంది. ఎవరా అని చూశాను.... అన్నయ్య.

"రా అన్నయ్యా" అన్నాను.

"యేమిటి పారూ నీకూ నిద్ర పట్టడం లేదా?" అని అడిగాడు.

నవ్వి వూరుకున్నాను.

అన్నయ్య వచ్చి నామంచం మీద కూర్చు న్నాడు. కాలేజీ విషయాలు చెప్తూ పోయాడు నాతో. అవి విన తరువాత "సాయంత్రం వచ్చిన అమ్మాయి ఎవరే పారూ" అన్నాడు....అడిగాడూ అనుకున్నా.


"మన యింట్లో అద్దె కొచ్చారన్నయ్యా పేరు సరోజ"

"వాళ్ల నాన్నగారి పేరేమిటి"

"జనార్ధనం" యివన్నీ యెందుకో.

"వాళ్లు మన కులం గాదు!" అడగక

(49 వ పేజీ చూడండి)


అందరూ తప్పు నాదే అన్నారు
కుటుంబములో అందరూ నా ఉద్యోగము పోవడానికి తప్పు నాదే అన్నారు. కాని అస్తమానమూ ఎంతో అలసటగా యాదురోమని ఉండే నేను మాత్రము ఏమి చేయగలను?
మా ఆవిడ నన్ను హార్లిక్స్ త్రాగమంది. హార్లిక్స్ నాకు పూర్వపు శక్తి ఉత్సాహములను తిరిగి కలిగిస్తుందని అంది.
Horlicks
ఆమె అన్నది నిజమే! హార్లిక్స్ త్రాగిన కొన్ని వారాల్లోనే నా అలసట పోయింది. నా కొత్త ఉద్యోగములో ఉత్సాహముతో పనిచేస్తాను!
Horlicks
పూర్తిగా పోషణలేని కారణముగా నిరుత్సాహముగా ఉంటే డాక్టర్లు హార్లిక్స్‌ను సిఫార్సు చేస్తారు. పూర్తి మీగడ గల పాలను కోరు గోధుమపిండి, మాల్టెడ్ బార్లీల పోషకవంతమైన సారముతో హార్లిక్స్ రుచిగా ఉంటుంది. తప్పకుండా పనిచేస్తుంది!
హార్లిక్స్
అదనపు శక్తిని కలిగించును!
WTHL 3494

సీరియల్

అర్ధాంగి



ఉన్నవ విజయలక్ష్మి

జ రి గి న క థ

సుదర్శనానికి వైద్యం చేయడానికి అయిష్టాన్ని ప్రదర్శించిన డాక్టర్ హరీష్‌ను ప్రేమిస్తుంది మంజుల. గోపాలం సుదర్శనం గురించి చెప్పిందంతా విన్నతర్వాత ఆయనపై అసహ్యం కల్గినా తన ధర్మాన్ని నిర్వర్తించడానికే నిశ్చయించుకుంటాడు హరీష్. శంకరం వేరొక యువతితో ప్రేమకలాపాలు జరుపుతూ ఆస్తికోసం మంజులను వివాహం చేసుకోడానికి వేసిన పథకాన్ని విన్న హరీష్, మంజులలు ఆశ్చర్యచకితులవుతారు. ప్రేమను వ్యక్తంచేసిన మంజులకు ఆశించిన సమాధానం హరీష్‌నుంచి రాకపోయేసరికి ఖిన్నురాలై వెళ్లిపోతుంది. హరీష్‌కు తన కథసంతా వివరిస్తాడు సుదర్శనం.

7

చివరికి అందరి బలవంతాన శాంత ఓ శుభ ముహూర్తాన సుదర్శనం భార్య అయింది. ఆమెకు చూస్తూంటే ఒక్కోసారి కాస్త అభిమానం కలగబోతున్నా, మాట కోసం, పంతానికి పోయి ముభావంగానే వుంటూండేవాడు.

నరసింహంగారు ఆయన భార్య మాత్రం కోడలిని అతి ముద్దుగా చూసుకునేవారు. ఇక సుశీల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఒక్కక్షణం అయినా వదినగారిని వదిలేది కాదు. తోబుట్టువుల అభిమానం అంటే ఏమిటో ఎరగని శాంత ఆడబిడ్డలో సహోదరిని, ప్రాణస్నేహితురాల్ని కూడ చూడగలిగింది.

పెళ్లి అయిన నాలుగునెలలకే సుదర్శనానికి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చింది. ఇంకేముంది "కోడలు వచ్చిన వేళ మంచిది· లక్ష్మిని వెంటబెట్టుకొచ్చింది. అబ్బాయి అదృష్టవంతుడు." అని కని పించిన వాళ్లందరికీ చెప్పుకుని మురిసిపోయారు నరసింహంగారూ భార్య. ఆ సంతోషంలో వెలరోజు లిట్టే గడిచిపోయాయి.

ఓ సాయంత్రం సుదర్శనం ఆఫీసు నించి వచ్చేసరికి శాంత దిగాలుపడిన మొహం వంచుకుని గుమ్మాని కానుకుని నిలబడి వుంది. ఎదురుగా నరసింహంగారు చేతిలో ఏదో వుత్తరం పట్టుకుని కాలరుద్రునిలా ప్రళయ తాండవం చేస్తున్నారు. సంగతి ఏమిటీ అని ఆయన్ని అడిగే ధైర్యం లేక పిల్లిలా తల్లి దగ్గరికి జారుకోబోయాడు. కాని సింహగర్జన లాంటి ఆయన పిలుపు సుదర్శనం కాళ్లకి బంధం వేసింది. ఉత్తరం కొడుకు మొహన్న విసిరేసి ఆయన గదిలోకి వెళ్లిపోయారు.

ఆయన్ని అంత రౌద్రమూర్తిగా మార్చగలిగిన విషయం ఏమై వుంటుందా అని ఆత్రంగా చదువుకున్నాడు. అందులోని వార్త సామాన్యమైన కాదు. తన వాళ్ల ఆశాసౌధాల్ని నేలమట్టం గావించే మారణాయుధం లాంటి వార్త. "మాణిక్యాంబ గారికి ఏడవమాసమనీ, నాలుగు రోజులలో జరుగబోయే శ్రీమంతోత్సవానికి శాంతనీ, సుశీలనీ వెంటబెట్టుకుని సుభద్రమ్మగారిని రమ్మనమని" కోరుతూ వ్రాశారు వెంకట్రావుగారు. ఉత్తరం తీసుకుని తల్లి దగ్గరికి వెళ్లాడు. ఆవిడ మొహం ముడుచుకుని బియ్యం బాగు చేసుకుంటూ కూర్చుంది. వెళ్లి ఆవిడ ప్రక్కనే పీట వాల్చుకు కూర్చున్నాడు సుశీల తెచ్చిన కాఫీ అందుకుని. సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియక మౌనంగా కాఫీ త్రాగుతూంటే, ఆవిడే అంది.

"చూశావా, మీ మామగారు వాళ్ళు ఎంత మోసం చేశారో." అని.

"మోసమా?" అన్నాడు తెల్లబోతూ, నిజానికి అందులో వున్న మోసం ఏమిటో అతని కాక్షణం దాకా అర్థంకాలేదు.

"మోసం కాదూమరి. నీ పెళ్లినాటికే వాళ్లకి చూచాయగా తెలుసునన్నమాట. మాట వరసకైనా మనతో అన్నారా? ఎందుకనుకున్నావు? అంత క్రితం దాకా ఆస్తి అంతా అమ్మాయికే అని మనకి ఆశ పెట్టి కొద్ది కట్నానికే సంబంధం ఖాయం చేసుకున్నారు.మళ్లీ ఇంకో అమ్మాయో అబ్బాయో పుడతాడని తెలిస్తే మనం కట్నం ఎక్కువ ఇమ్మంటామని భయపడ్డారు. వాళ్ల ఎత్తులు మనం గ్రహించ లేమనుకున్నారు కాబోలు.." ఆగకుండా పోతున్న ఆ వాక్ప్రవాహాన్ని శాంతే అడ్డుకుంది.

"మా వాళ్లకేం అంతంత ఆలోచనలు లేవు. పదిహేడు సంవత్సరాల తరువాత మళ్లీ సంతానం కలుగుతుందనే ఆశ వాళ్లకి లేకపోయింది. అందుకే నిశ్చయంగా తెలియక ముందే నలుగురికీ చెప్పుకోడం ఎందుకని మొహమ్మాట పడ్డారు. అయినా మీరు కేవలం ఆస్తి కోసమే నన్ను..." శాంత మాట పూర్తి కాకముందే చంప చెళ్లుమంది. అసలే చికాకుగా వున్న సుదర్శనం, భార్య తల్లిని ఎదిరించి మాట్లాడటం సహించలేకపోయాడు. ఆ కోపాన్ని చల్లార్చుకునే మార్గం అతనికి ఒక్కటే కనిపించింది.

ఆ శిక్ష చాలదన్నట్లు సుభద్రమ్మగారు అందుకుంది, "ఆస్తి కోసం కాకపోతే నీ కోతి మొహంచూసి మోజుపడి చేసుకున్నాం అనుకున్నావా. అబ్బాయి వద్దు వద్దు అంటున్నా వాడి మెడలు వంచి నిన్ను కట్టబెట్టింది ఎందుకనుకున్నావు."

శాంత సమాధానం చెప్పలేదు. కళ్లు వత్తుకుని చెంప తడుముకుంటూ గబగబా గదిలోకి వెళ్లిపోయింది.

అన్నిరోజులు భర్త ఎంత ముభావంగా వున్నా అత్తమామలు ఆదరంగా చూసుకో

టింతో శాంత కొంచెం కాకపోతే కొంచెం అయినా సుఖంగా వుండేది. ఆ నాటితో ఆమెకి ఆ సుఖం కూడ కరువయింది. అంతటి గాఢాంధకారంలోనూ, మినుకు మినుకుమనే ఆశాజ్యోతి సుశీల అభిమానం ఒక్కటే.

అంతకుముందే వచ్చిన ప్రమోషన్‌తో, జీతంలో కాస్త పెరుగుదలే కాకుండా అన్ని విధాల కల్పవృక్షం లాంటి సీటు దొరికింది సుదర్శనానికి. జీవితం అంటే ఒక నిర్దుష్టమైన అభిప్రాయం ఏర్పరుచుకోకుండా, అతి నిర్లక్ష్యంగా ఎలా వీలయితే అలా బ్రతికేస్తున్న అతను, చేతి నిండా పుష్కలంగా డబ్బు వచ్చి పడుతూంటే ఆ తాకిడికి మరో వేపు కొట్టుకుపోయాడు. అన్నిరకాల దుర్వ్యసనాలూ అలవాటయినాయి. కొత్తలో కాస్త జాగ్రత్తగా వున్నా, తరువాత తరువాత తూలుతూనే యింటికి వచ్చే కొడుకుని, చూసి, అతన్ని మందలించటం పోయి,

"ఇష్టంలేని భార్యతో సుఖపడలేకనే ఇలాంటి వ్యసనాలకి దాసుడయి పోతున్నాడు." అంటూ శాంత మీదే విరుచుకు పడేవాళ్ళు.

అలాగే మరో కొద్దిరోజులు గడిచేసరికి వెంకట్రావుగారి దగ్గరనుండి శుభవార్త—అదే వాళ్ళ పాలిట దుర్వార్త—అందింది. "ఓ శుభముహూర్తాన మాణిక్యాంబ గారు ప్రసవించింది. మగపిల్లవాడు. మాతాశిశువులు క్షేమంగా వున్నారు." ఇదీ ఆ వుత్తరం సారాంశం. అది చూస్తూనే నరసింహం గారు మరోసారి ఇల్లు ఎగిరిపోయేటట్లు కేక లేస్తూ చిందులు తొక్కారు. సుభద్రమ్మగారు మామూలు ధోరణిలో అందర్నీ కలిపి తిట్టి తన అక్కసు తీర్చుకోడానికి ప్రయత్నించింది.

ఎవరికీ ఎలాంటి సమాధానం ఇవ్వకుండా గదిలో కిటికీ వానుకుని నిలబడి శాంత కళ్ళు తుడుచుకుంటూ. సుదర్శనం గదిలోకి వెళ్ళగానే, "వాళ్ళనంత గొడవ చేయొద్దని చెప్పండి. మా నాన్నగారు నాకు బొత్తిగా ఏమీ ఇవ్వకుండా వుండరు. ఏమి స్త్రోనే కనుక్కుంటాను.. అంతేకాని వాళ్ళు అంత సంతోషంగా వున్న సమయంలో, ఏదో జరగకూడనిది జరిగినట్లు వీళ్ళ ఏడుపులు తిట్లు ఏమిటి చెప్పండి. అసలు ఇంత మంది నోళ్ళల్లో పడ్డ ఆ పసి వెధవ బ్రతికి బట్ట కట్టినప్పటి మాట కదా." అంది దుఃఖంతో పూడిపోయిన గొంతు పెగుల్చుకుని.

అవసరాన్ని మించి — ఒక్కమాటైనా — మాట్లాడని శాంత అన్నిమాటలు చెప్పటం, అందులోనూ తన వాళ్ళది తప్పు అనటం అతను సహించలేకపోయాడు. ఏదో చెప్పడానికి ముందుకి వస్తున్న శాంతని విసురుగా తోసేశాడు. అహంకారాన్నీ అపుకోలేక. ఒక్క ఉదుటున వెళ్ళి కిటికీ మీద పడింది. కిటికీ రెక్క వాదుటికి కొట్టుకుని బొప్పి కట్టింది. కిటికీ దగ్గిరే నిలబడి, దెబ్బ తగిలిన చోట చేత్తో తడుముకుంటూ కుళ్ళి కుళ్ళి ఏడవడం తప్ప మరేం చేయలేక పోయింది, శారీరకంగానూ మానసికంగానూ గాయపడిన శాంత. సుదర్శనం మొహం తిప్పుకుని బైటికి వెళ్ళిపోయాడు.



ఆ రోజు నుండి ఇంట్లో ఏవో గొడవలు, శాంత కళ్ళంట నీళ్ళు పెట్టుకోటం మామూలయిపోయింది. సుదర్శనం మాత్రం ఎందులోనూ కలగజేసుకునేవాడు కాదు.

పిల్లవాడికి మూడోనెల రాగానే బారసాల మహోత్సవానికి ఆహ్వానం వచ్చింది. అప్పటికి ఒక నిర్ణయానికి వచ్చిన నరసింహంగారు శాంతని ప్రయాణం చేస్తూ 'సరే నువ్వు వెళ్ళిరా. నువ్వు అక్కడ ఎన్ని

రోజులు వున్నా నా కభ్యంతరంలేదు కాని, వచ్చేటప్పుడు మీ నాన్న ఆస్తిలో సగం అయినా వ్రాయించుకుని, ఆ కాగితాలు తీసుకురా." అని ఆజ్ఞాపించారు.

మర్నాడు శాంత ప్రయాణం అవుతూంటే ఏమాలోచన వచ్చిందో సుభద్రమ్మ గారువెళ్ళి కోడలు వంటినున్న నగలన్నీ ఒలిపించేసింది.

అంతకు కొన్నినెలల ముందే, సిగ్గుతో వాలిపోతున్న కళ్ళు, కెంపు లీనుతున్న చెంపలు, చిరునవ్వుతో విచ్చుకుంటున్న పెదవులు, మొహానికో వింత కాంతిని అందాన్ని యిస్తూంటే, హృదయం నిండా కోటి కోరికలు నింపుకుని, సర్వాభరణాలతో, మహాలక్ష్మిలా అత్తవారి యింటి ముందు బండి దిగిన శాంత ఆనాడు మంగళసూత్రం తప్ప మరో ఆభరణం లేని అలంకారంతో, ఏడ్చి ఏడ్చి వాచిపోయిన కళ్ళు, పాలిపోయిన చెక్కిళ్ళు, సరి అయిన పోషణ లేక నలుపుకి తిరిగిపోయిన శరీరఛ్ఛాయ ఆమెని మరీ అంద విహీనంగా చూపిస్తూంటే గుండెల నిండా పేరుకుపోయిన ఆవేదనావమానాలతో బండి ఎక్కింది.

శాంత వెళ్ళిన కొద్దిరోజులకే ఓ సాయంత్రం సుశీల సంతోషంగా సుదర్శనం గదిలోకి వెళ్ళి, "అన్నయ్యా, నీకు అబ్బాయి కావాలా అమ్మాయా?" అంది అతని చేతులు వూగిస్తూ.

"ఏమిటా పిచ్చివాగుడు. నా కెవరూ అక్కర్లేదు." అన్నాడతను చికాగ్గా.

"అయ్యో రామ, మధ్య నా మీద విసురు లావేమిటి? వదిన నీకు వ్రాయలేదా? సిగ్గు పడిందేమోలే. మధ్యాహ్నం మీ మామగారి దగ్గర నుండి వుత్తరం వచ్చింది" అంటూ తుర్రున లోపలికి పరుగెత్తి వుత్తరం తీసుకొచ్చి అతని చేతిలో పెట్టింది గర్వంగా కళ్ళు తిప్పుతూ.

సుదర్శనానికి ఆ వార్త ఏమాత్రం సంతోషం కలిగించలేదు. అదేదో అతనికి బొత్తిగా సంబంధంలేని విషయం అయినట్లు నిర్లిప్తంగా వుండిపోయాడు. కారణం, అతను అప్పటికే ఇరుక్కున్న సుడిగుండంలోంచి బయటపడే మార్గం తెలియక కాళ్ళూ చేతులూ తపతప కొట్టుకుంటున్నాడు.

ఆ రాత్రి భోజనాల సమయంలో "ఎలాగయినా దేవాంతకుడు మీ మామగారు. అసలు విషయం తేల్చకుండా ఇవన్నీ వ్రాస్తున్నాడు. మనం అన్నివిధాల చెప్పి పంపించాం కదా, శాంత అడగకుండా వుంటుందా" అన్నారు నరసింహంగారు.

"నాకేం తెలుస్తుంది?" అని తప్పుకున్నాడతను. తల మునిగే అన్ని సమస్యలు అతని కాళ్ళకి అడ్డం పడుతుంటే, అదో సమస్యగా అందులోనూ తను జోక్యం కలిగించుకోవలసిన విషయంలా తోచలేదతనికి.

"రేపు నేనే ఓ కార్డు వ్రాసి పడేస్తాను. నాకేం భయమా ఏమిటి?" అన్నారాయన.

అన్నట్లుగానే ఆయన ఉత్తరం వ్రాయడం, రెండెకరాలు అమ్మాయి కిస్తాను కాని సగం ఆస్తి ఇవ్వనని వెంకటావుగారు సమాధానం వ్రాయటం, ఇలా వుత్తరప్రత్యుత్తరాలు జరుగుతూండగానే మరో నెల గడిచిపోయింది. ఆలోగా సుశీలకి సంబంధం కుదిరి ముహూర్తం కూడ పెట్టుకున్నారు.

"అన్నమాట తప్పిన గాడిద కొడుకు. వాడికి శుభలేఖ కూడ పంపను" అన్నారు నరసింహంగారు పళ్ళు నూరుకుంటూ. ఆయన మాట శిలాక్షరం అన్న సంగతి తెలిసిన సుశీల అన్నగారి దగ్గరికి వెళ్ళి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"నువ్వు వ్రాస్తే వదిన వచ్చేస్తుందన్నయ్యా. ఒక్క వుత్తరం వ్రాయి." అని బతిమాలుకుంది.

"పెద్దవాళ్ళు ఏదో వ్యవహారం నడుపుకుంటున్నప్పుడు మధ్యలో మనం కలగజేసుకొని దాన్నిపాడు చేయకూడదు. అయినా యిందులో మా మామగారి తప్పు కూడ వుంది. అలాంటప్పుడు మనం తొందరపడి లోకువై పోకూడదు."

"నీకు బుద్ధి లేదన్నయ్యా. వాళ్ళ నాన్నగారి తప్పుకి వదిన్ని శిక్షిస్తావా? ఆయనయినా ఎంతో కొంత యిస్తానంటున్నాడుగా. మీకు తృప్తి అనేది లేకపోతే ఆయనేం చేస్తాడు? వదిన రాగానే నీకు పెద్ద ఉద్యోగం వచ్చింది. రెండు చేతులా సంపాదిస్తున్నావు. వీటన్నింటి కంటె నీకా ఆస్తి ఎక్కువా?" అని నిలదీసింది అన్నగారిని.

"ఆ ప్రమోషన్ తను రాకపోయినా వచ్చేదిలే." అన్నాడతను నవ్వేస్తూ.

"సరే పోనీ. నీ అర్హతని బట్టే వచ్చిందనుకో. అయినా నీ కిప్పుడేం తక్కువ లేదుగా... పెద్దవాళ్ళ మాట పట్టింపుల కోసం తనని దుఃఖ పెట్టడం న్యాయం కాదు. అందులో ఇప్పుడు తన మనస్సుకి అసలే కష్టం కలిగించ కూడదు...ఏమంటావు? ఉత్తరం వ్రాస్తావు కదూ." అంటూ ఆశగా అన్నగారి కళ్ళల్లోకి చూసింది. అతను మూర్ఖంగా మొహం తిప్పేసుకున్నాడు.

"ఛ. అందరి కందరే.. అయినా మీరంతా ఎలా వున్నా వదినని నేను మొదటి నుండీ అభిమానిస్తున్నాను. తనకీ నేనంటే ప్రాణం. నేనే వ్రాస్తాను. తను తప్పకుండా వస్తుంది. ఏమయినా సరే ఇంక మళ్ళీ వాళ్ళవాళ్ళింటికి వెళ్ళవద్దని చెప్తా. తనిక్కడ వుంటే నువ్వేమయినా దార్లోకి వస్తావేమో." మనస్సులో వున్న అసహ్యాన్నంతా మాటలతోనూ చూపులతోనూ వెళ్ళగక్కి గదిలోంచి వెళ్ళిపోయింది సుశీల.

సుదర్శనం నిర్ఘాంతపోయాడు. "నాకళ్ళ ముందు గౌను వేసుకు తిరిగిన సుశీల ఇంతలోనే ఎదిగిపోయి నా ప్రవర్తనని నా మొహం మీదే నిరసించగలిగే ఆరిందా అయిపోయిందా?" అనుకున్నాడు.

ఆ మర్నాడే సుశీల శాంతకి వుత్తరం వ్రాస్తుంటే సుభద్రమ్మగారి కంటబడింది.

"చాల్లే విర్రాకం. ఆమాత్రం మర్యాద తెలియక వూరుకోలేదు... ఇలాంటి పిచ్చిపిచ్చి వేషాలేశావంటే నా మీద వట్టే." అని అది తీసుకుని చింపి పారేసిందావిడ.

సుశీ పెళ్ళి వర్తమానం శాంత వాళ్ళ దాకా వెళ్ళకుండానే పెళ్ళి జరిగిపోయింది. ఆ రోజంతా సుశీల దిగులుగానే వుంది. చమరుస్తున్న కళ్ళు ఎవరి కంటబడకుండా మాటిమాటికి వత్తుకుంటూనే వుంది. చెల్లెలు మనస్సులో బాధగాని, ఆ పెళ్ళి సందడిగాని సుదర్శనం అంతగా పట్టించుకోలేదనే చెప్పాలి. దానికి కారణం జానకి స్నేహం వల్ల ఏర్పడిన సమస్యలు. జానకి వాళ్ళ ఆఫీసులో టైపిస్టు. తన పని అంతా సుదర్శనం సీటుకి సంబంధించినదే కావడంతో సహజంగానే వాళ్ళిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. అది స్నేహంగా మారడానికి ఆట్టే కాలం పట్టలేదు. అది స్నేహం మాత్రమే కాదు మరేదో ఆకర్షణ కూడ వుంది అనుకున్నారు మరి కొద్దిరోజులకే.

ఉన్నట్లుండి ఒక రోజున, తనని పెళ్ళి చేసుకోమని అడిగింది జానకి.

"నీ కేం మతిపోలేదు కదా. నాకు భార్య వుంది." అన్నాడతను.

"నీకాని డంటే ఇష్టం లేదుగా. వదిలేశావని అందరూ అనుకుంటున్నారు.. కావ

లిస్తే మనతో పాటే తనూ వుంటుంది లేండి." అంది అతని సంసార రహస్యాలన్నీ తెలుసుకున్న జానకి.

"ఇప్పుడు నేను నీకేం తక్కువ చేయ లేదుగా. పెళ్ళి చేసుకోవద్దు. ఇలాగే, స్నేహంగా వుందాం." ఎలాగో అప్పటికి సర్ది చెప్పేశాడు.

మరి కొద్దిరోజులు గడచిపోయాయి. "మన స్నేహం గురించి వూరందరికీ తెలిసి పోయింది. అందుకే నాకే సంబంధమూ కుద రడం లేదు. ఇప్పుడేం చెయ్యమంటారు?" అని అడిగింది మళ్ళీ. అతను సమాధానం చెప్పలేదు. "మన పెళ్ళి విషయం మాట్లా డ్డానికి సాయంత్రం నాన్న వస్తాడు."అంది తనే.

సుదర్శనం గుండె ఆగిపోయినట్లయింది. ఇప్పుడేం చెయ్యటం. ఎలా వీళ్ళని వదిలించు కోటం. వెళ్ళి సీట్లో కూర్చున్నా చూస్తున్న విషయాల మీద మనస్సు లగ్నం కాలేదు. తను ఎందుకు ఈ వూబిలో ఇరుక్కున్నాడు. ఇందులోంచి బైటపడే మార్గమే లేదా? కనిపించిన ప్రతి అమ్మాయితో స్నేహం చేస్తూ, ఏ బాధ్యతలు మీద పడకుండా జల్సాగా తిరుగుతున్న వాళ్ళని లక్షమందిని చూస్తున్నాడే. మరి తన ఖర్మ కొద్దీ, మొదటిసారే ఇలాంటి సమస్య ఎదురయిం దేమిటి?.. ఆలోచిస్తూనే ఏ పనీ చేయ కుండా సాయంత్రం దాకా గడిపేశాడు... ఇంక లేవబోతూంటే, గుమ్మం దగ్గర ప్రత్యక్షమైన ఆకారాన్ని చూసి అతని గుండె దడదడ లాడాయి. అతనిని తన తండ్రిగా పరిచయం చేసింది జానకి. ముగ్గురూ వెళ్ళి కేంటీన్‌లో ఓ మూల కూర్చున్నారు.

"అమ్మాయి చెప్పే వుంటుంది. ముహూర్తం విషయం కనుక్కుందామనే వచ్చాను." అన్నాడతను సంభాషణ ప్రారంభిస్తూ.

సుదర్శనానికి ముచ్చెమటలు పోశాయి.

"ముహూర్తం దేనికి?" అన్నాడు పైకి బింకంగానే.

"మంచి సరసమే.. మీ పెళ్ళికి ముహూర్తం అయ్యా." అన్నాడతను కాస్త చికాగ్గా.

"నేను పెళ్ళి చేసుకుంటానని ఎప్పుడూ అనలేదు." ధైర్యంగానే చెప్పాననుకున్నాడు.

"మరి ఆ వుద్దేశ్యం లేనప్పుడు అమ్మాయితో స్నేహం ఎందుకు చెయ్యాలి. ఇప్పుడు దాని జీవితం ఏంకావాలి. మీ స్నేహం సంగతి తెలిసిన మరో మగవాడెవడైనా దాన్ని పెళ్ళి చేసుకోడానికి ఇష్టపడతాడా?" అంతకంతకు స్థాయి హెచ్చిస్తున్న ఆయన్ని మధ్యలోనే ఆపి,

"నా వల్ల పొరబాటే అయిపోయింది. మీకు కావలసినంత డబ్బిస్తాను. దాంతో ఏదైనా సంబంధం చూసి పెళ్ళి చేసే యండి.." అంటూంటే

"డబ్బు కోసం స్నేహం చేసిందనుకున్నావా మా అమ్మాయి. అది అలాంటిది కాదు. ఉత్త అమాయకురాలు. నువ్వు మోసం చేస్తావని అనుకోలేకపోయింది. పెళ్ళి చేసుకుంటావనే నమ్మి ఎన్నో ఆశలు పెట్టుకుంది. నిన్ను తప్ప ఎవర్నీ చేసుకోదుట.. ఇక ఇప్పుడిది జానకి చావుబ్రతుకుల సమస్య. దానిని ఒడ్డు చేర్చే భారం నీదే." అని చెప్పి లేచాడు.

అతని ధోరణి. ఒక బాధ్యత గల తండ్రి అమాయకురాలైన తన కూతురి జీవితం నాశనం కాకుండా చూడమని అర్థిస్తున్నట్లు లేదు. ఒక పచ్చికాడి కత్తి నూరుతూ "నా మాట వినకపోతే నిన్నేం చేస్తానో చూడు." అని బెదిరిస్తున్నట్లుంది.

ఆ విషవలయంలోంచి బయట పడే మార్గం తెలియక అహోరాత్రాలు అలమటించి పోయాడు సుదర్శనం. అతని బాధకి తోడు మధ్య మధ్య జానకీ ఆమె తండ్రీ, 'ఏం చేశావ్ సంగతి' అంటూ వేధిస్తూండే వారు.


ఉన్నట్లుండి, ఓ ఉదయం జానకి ఆఫీసు కొస్తూనే, "ఏమైనా సరే నువ్వు మీరు ఇవాళ పెళ్ళి చేసుకోవాలి. పెళ్ళికి వీలు కాకపోయినా మీ యింటికి వచ్చేస్తాను. అంతేకాని మా యింటికి మాత్రం తిరిగి వెళ్ళను. డబ్బుకి కక్కుర్తి పడి మానాన్న నా గొంతు కోయాలని చూస్తున్నాడు... మీ యింటికి రానివ్వక పోతే ఎందులోనైనా పడి చావనైనా చస్తానుకాని ఆ పెళ్ళి మాత్రం చేసుకోను." అని ఖచ్చితంగా చెప్పేసింది, మధ్య మధ్య కళ్ళూ ముక్కూ తుడుచుకుంటూ.

గత్యంతరం లేక ఒక చిన్నయిల్లు అద్దెకి తీసుకుని అందులో ఆమెని వుంచాడు సుదర్శనం. కొద్దిరోజులలోనే ఆ సంగతి వూరందరికీ తెలిసింది. అందరితోపాటు అతని తల్లితండ్రులకీ తెలిసింది. అయినా కొడుకుని ఏమీ అనే ధైర్యం వాళ్ళకి లేకపోయింది. అంతకు కొద్దిరోజుల నుండీ న్యాయంగానో అన్యాయంగానో రెండు చేతులా ఆర్జిస్తున్న కొడుకుని చూసి మురిసిపోతూ కాస్త చనువిచ్చారు నరసింహంగారు. ఆ అవకాశం ఉపయోగించుకుని అతను తండ్రిని లక్ష్యపెట్టడం మానేశాడు. క్రమంగా ఆయనే కొడుక్కి లొంగి వుండే స్థితిలోకి వచ్చింది.

జానకి సంగతి వెంకట్రావుగారికీ కూడ తెలిసి పరుగెత్తుకొచ్చాడు.

"నా ఇష్టం, మీరెవరు నన్నడగడానికి. ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలేశారంటే ఇంట్లోనే తెచ్చి పెట్టుకుంటాను." అని అప్పటికప్పుడు టాక్సీ తీసుకువెళ్ళి జానకిని, సామానుతో సహా తీసుకొచ్చేశాడు సుదర్శనం.

అది చూసి వెంకట్రావుగారు మరీ రెచ్చిపోయారు. అల్లుడిని ఎలాగో బ్రతిమాలుకుని కూతురు కాపరం నిలుపుదామనే ధోరణి లేకపోయింది. అంతవరకు ఆస్తిని గురించిన తగాదాలతోనూ ఉత్తర ప్రత్యుత్తరాలతోనూ



విసిగిపోయి వున్నాడేమో అవారికారా అనేది అణుచుకోలేక పోయారు.

"నా కూతురేం తప్పు చేసిందని నువ్వు ఇంత అన్యాయానికి ఒడిగట్టావు. అది అక్కడ అన్నం నీళ్లు ముట్టుకోకుండా అహోరాత్రాలు అలమటిస్తూంటే, ఇక్కడ నువ్వు ఇంత ఘోరం తలపెడతావా?... ఒక అమాయకురాల్ని ఏడిపించి నువ్వు సుఖపడ లేవు... అయినా నిన్ను ఇలా వదులుతా నను కోకు. పదిమంది పెద్దమనుష్యులనీ పిలిచి.."

"ఆ. పిలుచుకోండి. నాకేం భయంలేదు. అంతమందిలోనూ పోయేది మీ అమ్మాయి పరువే. తన కేరక్టర్ మంచిదికాదని, అందుకే వదిలేశానని చెప్తాను." ఎంతమాత్రం తడబడకుండా అతను చెప్పిన సమాధానం విని అందరూ కొయ్యబారి పోయారు. అందరిలో ముందు తేరుకున్నవారు వెంకట్రావు గారే. ఆయన కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

"ఛీ. అప్రాచ్యుడా. సీతాదేవి లాంటి మహాసాధ్వి, నా కూతుర్ని అంతమాట అనడానికి నీకు నోరెలా వచ్చింది. ఈ పాపానికి శిక్ష అనుభవిస్తావు. ఇంత ఘోరమైన అసత్యం చెప్పిన నీ నాలుక చీలికలైపోతుంది."

"ఎందుకు అనవసరంగా మాటలు పెంచుతారు. మర్యాదగా బయటికి నడవండి. మీ అమ్మాయి ఎప్పటికీ మీ దగ్గర వుండవలసిందే." సుదర్శనం పట్టిన పట్టు విడవలేదు.

దోసిట్లో మొహం దాచుకుని ఏడుస్తూ లోపలికి పారిపోయింది సుశీల. గది గుమ్మంలో నిలబడి మధ్య మధ్య తొంగి చూస్తూ అపరిమితమైన ఆనందాన్ని పొందుతోంది, జానకి.

"బావగారు. ఇది అన్యాయం అని మీరైనా చెప్పండి. నా కూతురు కాపరం నిలపండి. మాట్లాడరేం... అక్కగారు మీరైనా చెప్పండి ఏ పాపమూ ఎరుగని అమాయకురాలి నెత్తిన ఇంత ఘోరమైన అపవాదు వెయ్యటం ధర్మంకాదు అని చెప్పండి... తల్లిలా ఆదరించవలసిన మీరే ఇలా మౌనం వహిస్తే దాని జీవితం ఏమయిపోతుందో ఆలోచించండి.. మీరెవ్వరూ మాట్లాడరు కదూ... మీ అందరివీ రాతిగుండెలేనా? నా బాధ ఒక్కరూ అర్థం చేసుకోలేరా? మీకూ ఒక అమ్మాయి వుంది.. వద్దు వద్దు. ఆ అవసరం మీకు రాకూడదు. నా కూతురికి పట్టిన గతి లోకంలో ఏ ఆడపిల్లకీ పట్టకూడదు."

తీరని అవమానం క్షోభ హృదయాన్ని రంపపు కోత కోస్తూంటే ఉత్తరీయంతో

అర్ధాంగి

కళ్ళు వత్తుకుంటూ, ఇక అప్పట్లో ఏం మాట్లాడి ప్రయోజనం లేదని తిరిగి వెళ్ళిపోయారు.

"అమ్మాయిని అక్కడే దిగవిడిచి వస్తే అన్ని సమస్యలు వాటంతటవే సర్దుకుంటాయేమో. కావలిస్తే వాళ్ళ మొహాన్న మరింత డబ్బు పారేస్తాను." అని వెంకట్రావుగారు భార్యతో ఆలోచన సాగిస్తూంటే,

"మీరు అనవసరంగా శ్రమపడకండి... డబ్బుకోసం మనిషి అబద్దాలాడడమే నీచమైన పని. ఇక ఆ డబ్బు కోసం ఒక స్త్రీ శీలాన్నే పణంగా పెట్టడానికి, అందులోనూ ఆమెలో ఎలాంటి దోషమూ లేదని ఎరిగున్న భర్తే ప్రయత్నిస్తున్నాడంటే ఆయనలో ఎలాంటి నైచ్యం పేరుకుపోయిందో మీరాలోచించుకోవచ్చు. అలాంటి భర్త సంసారం నా కక్కర్లేదు. నేను వాళ్ళ మొహం, చూడను." అని శాంతే ఖచ్చితంగా చెప్పేసిందని ఎవరి ద్వారానో విని,

"మనవల్ల కూడ పొరపాటు జరిగిందేమో" అనుకున్నారు నరసింహం గారు, భార్యాను.

"పోనీ, అక్కడే వుండ నివ్వండి. తండ్రి ఆస్తి చూసుకుని అలా మిడిసి పడుతోంది. రేపు ఆ పిల్లవాడు పెద్దవాడై ఇంట్లోంచి బయటికి గెంటిన నాడు కాని, దానికి భర్త, సంసారం జ్ఞాపకం రావు. మొగవాడు కోపంలో ఒకమాట అంటే మాత్రం, పౌరుషానికి పోయి సంసారమే అక్కర్లేదని పుట్టింట్లో కూర్చుంటుందా? ఆడదానికి యింత అహంకారం పనికిరాదు." అన్న కొడుకు మాటలతో వాళ్ళల్లోనూ కొంచెం సేపు అణగారిపోయిన కోపం, పట్టుదల మళ్ళీ తలెత్తాయి.

తరువాత కొద్దిరోజులకే శాంత ప్రమాదంలో చిక్కుకుని చనిపోయిందనీ, ఆమె కనబడటం లేదు అనుకున్న మూడురోజుల తరువాత, వాళ్ళ వూరికి ఎనిమిది మైళ్ళ దిగువగా కాలవలో ఆమె శవం దొరికిందనీ, శరీరంలో కొంత కొంత భాగం జలచరాలకి ఆహారం అయిపోగా మిగిలినది నీటిలో నాని ఉబ్బిపోయి చూడ్డానికే భయంకరంగా వున్న ఆ శవాన్ని మావగారు గుర్తు పట్టారనీ వినగానే మాత్రం సుదర్శనం గుండె కలుక్కుమంది. "అది ప్రమాదవశాత్తు జరిగిందికాదు. కావాలని చేసుకున్న ఆత్మహత్య. నాకు తెలుసు. నేను వేసిన అపవాదు భరించలేక శాంత ఇంత అన్యాయం చేసింది. ఈ పాపం ఊరకే పోదు. నేను దోషిని హంతకుడిని" అనే భావం అతని మనిస్సుకి కుదురు లేకుండా చేయసాగింది. అయినా ఆ భావాన్ని అణచి వేయాలని, శాంత మరణానికి తనెంత మాత్రం బాధ్యుడు కాదని సరిపెట్టుకోవాలనీ అతను ఎంతగానో ప్రయత్నించాడు. కాని, వుండి వుండీ మేల్కొని గొణుగుతున్న అంతరాత్మని మభ్యపెట్టటం అతని శక్తికి మించిన పని అయిపోయింది. అంతేకాదు. ఆ ప్రయత్నంలో, మరిచిపోదామనుకున్న, శాంత మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం రాసాగింది. సజీవంగా అతని దగ్గరే వుండి, అతని హృదయంలో కాస్తయినా చోటు సంపాదించుకోలేని శాంత, చచ్చిపోయి అతని మనస్సునంతా ఆక్రమించేసుకుంది. అనుక్షణం వెంటాడుతున్న శాంత స్మృతినుండి తప్పించుకోటం అతనికి దుస్సాధ్యమని పించింది.. అందులోనూ జానకితో ఎంతో సంతోషంగా సరదాగా వున్న సమయంలో చటుక్కున వాళ్ళిద్దరి మధ్య శాంత ప్రత్యక్షమై, "ఒక్కనాడైనా నాకింత అదృష్టం కలిగించారా? మీ ఆప్యాయత కోసం, ఒక్క చిరునవ్వు కోసం ఎదురు చూసి చూసి నిరాశ చెందుతూనే మీ భార్యగా బ్రతికాను. నాలో లేనిది, ఈ జానకిలో ఏముందని మీరింతగా అభిమానిస్తున్నారు? చెప్పండి. నన్నెందుకు అన్యాయం చేశారు?" అని నిలదీస్తున్నట్లు అనిపించి ఉక్కిరి బిక్కిరి అయిపోయేవాడు. దాని నుండి తప్పించుకునే మార్గం అతనికి కనిపించలేదు. అయినా అంతర్గతంగా అతను అనుభవిస్తున్న నరకాన్ని కూడ లెక్కచేయకుండా మొండిగా తిరిగేలా చేశాయి బహిరంగంగా అతనిని చుట్టుముట్టిన సమస్యలు.

కొడుకు పై సంపాదన బాగా వుంటోందని గ్రహించిన నరసింహంగారు వెనకా ముందూ ఆలోచించకుండా అంతస్థుకి మించిన సంబంధం చేశారు కూతురికి... చెల్లెలు కలవారి కోడలు కావటం సుదర్శనానికి కూడ సంతోషదాయకమే. కాని, రోజు రోజుకి పెరుగుతున్న వడ్డీతో పదివేల రూపాయల అప్పు తనని కబళించడానికి వచ్చిన బ్రహ్మరాక్షసిలా నోరు తెరుచుకుని మీద మీదకి వస్తూ అనుక్షణం బెదిరించ సాగింది. "అది ఎప్పటికి తీర్చగలను. ఈలోగా దానికి వడ్డీ ఎంత పెరుగుతుంది. అది తీరటంకోసం నేను ఎంతమంది దగ్గర చేయి జాచాల్సి వస్తుంది." అనే ఆలోచన వచ్చినప్పుడల్లా భయంతో గజగజ వణికిపోయేవాడు సుదర్శనం.

అతి విచిత్రమైన పరిస్థితులల

ఆయింట్లో కాలుపెట్టిన జానకి తన స్థానాన్ని రోజురోజుకి పటిష్ఠం చేసుకోడానికి తగిన ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఆ ప్రయత్నాలలో మొదటిది సుభద్రమ్మ గారిని లక్ష్యపెట్టక పోవటం. అదేం చిత్రమో ఆవిడ జానకిని, మొదట శాంతని చూసినట్లు ఆదరంగానూ చూడలేకపోయేది, తరువాత తరువాత ఆమెని రాచి రంపాన పెట్టినట్లూ చేయలేకపోయేది. అభిమానమూ అసహ్యమూ కాని ఒకటన్నా భావం ఏదో ఆమెలో ప్రవేశించింది. అయినా సంసారం ప్రశాంతంగా గడవలేదు. రోజూ ఎందుకో అందుకు సుభద్రమ్మగారికి జానకికి పేచీ వస్తూనే వుండేది. చివరికి ఒకరోజు విసుగేసి,

"ఇది యింట్లో ఎందుకురా. పంపించేయకూడదూ?" అంది ఆవిడ కొడుకుతో.

"నన్ను నమ్మికు వచ్చిన మనిషి ఎక్కడికి పోతుందమ్మా. నాకు మళ్లీ పెళ్లి చెయ్యాలని చూస్తున్నావుగా. జానకి ఆ కొత్త కోడలే అనుకో." అన్నాడు అప్పటికే గృహకలహాలతో చిరచిర లాడుతున్న సుదర్శనం.

సుభద్రమ్మగారు మరి నోరెత్తలేదు అంతే. కాదు. అనాటి నుంచీ ఆవిడ జానకి విషయమై కొడుకుతో ఎప్పుడూ మాట్లాడలేదు.

(సశేషం)

కుర్చీలు

ఆదివిష్ణు



వెంకట్రావ్ నాతోపాటు చదువుకుని కొన్నేళ్ళ క్రితం చదువు మానేసి వ్యవసాయం లోకి దిగిపోయేడు. అతని కిప్పుడు పాతి కెకరాల భూమి వున్నదని నాకు తెలుసు. మంచి 'కామందని' పల్లెటూళ్లో మంచి పేరూ వున్నది.

ఈ కామందుకి ఓ మేనల్లుడున్నాడు. అతనీ మధ్యనే బి. ఏ. పాసైన వైనం నాకు మునుపోక సారి వెంకట్రావే చెప్పేడు.

ఒకానొక ఆదివారం సాయంత్రం నేనింటి దగ్గిర కాఫీ పుచ్చుకుంటోన్న వేళ నన్ను చూచేందు కొచ్చినతని పేరు సంగమేశ్వర రావు. బక్కగా, తెల్లగా వున్నాడు. పేరు చెప్పి నీళ్ళు నమలడం ప్రారంభించేడతను. అతను కూర్చునేందుకు ఒక పేముకుర్చీ చూపించేను. అతను దాన్లో బిక్కుబిక్కు మంటూ కూర్చున్నాడు. కూర్చుని అన్నాడు,

"మీ కథలు చదువుతాను సార్! చాలా బావుంటాయి!"

అందమైన మాటనే చెప్పేడతను. ఒక కాఫీ పట్టుకొచ్చి యిచ్చేను. అతనా కాఫీ తాగుతూండగా 'మీరేం చేస్తూంటారని' అడిగేను. నన్నభిమానించే పాఠకుల వివరాలు తెలుసుకోడం నా కనీస ధర్మం. మీదుమిక్కిలి సంభాషణాక్రమాన్నది అందంగానూ మలుస్తుంది.

అతను కుర్చీలో యిబ్బందిగా సర్దుక్కూర్చుని అన్నాడు—

"బి. ఏ. పాసైయాను సార్! ప్రస్తుతం ఖాళీ!"

"మీకూ కథలు రాసే అలవాటేమైనా వుందా?"

"లేద్సార్!"

"చదువుతారంతే. అవునా? ఆ మాత్రం చేస్తుంటే ఏదో ఓనాడు మీరూ రాసే గలరు." అన్నాను నా అభిమానిని సరదా పరిచే నిమిత్తం.

అతన్నీరసంగా నవ్వేసి నా ఉద్దేశాన్ని తంపేసి అన్నాడు.

"మీరీవూరు బదిలీ అయ్యేరని మావయ్య చెప్పేడు. కనిపించి పోదామని వచ్చేను."

కొంచెం ఆలోచించి అడిగేను.

"ఎవరండీ మీ మావయ్య?"

"వెంక్రటావ్‌గారు!"

"చెప్పేరు కాదే! వెంక్రటావ్ మేనల్లుడా మీరు. వాడు నాకు బెస్టు ఫ్రెండు. భేష్ బాగుంది వెరీగుడ్. ఊఁ. ఏమిటీ విషయాలు? మీ వాడు క్షేమమూ? నేనీ వూరొచ్చింత కాలమైనా యిప్పటికొచ్చి వాడు నాకు కనిపించనేలేదు."

"మీరు చాలా అదృష్టవంతులు సార్! సొంతవూళ్ళో చక్కటుద్యోగంతో ఎంచక్కా కాలక్షేపం చేసేస్తున్నారు."

"బలే! ఈ వూరొచ్చేందుకు నేను నాలుగేళ్ళు ప్రయత్నం చేశాను. దాని కేమంటారు మరి?"

"ఏమైనా మీరు అదృష్టవంతులనే అంటాను."

"సర్లెండి. అలాగే అనుకుందాం.చెప్పండి. ఏమిటి సంగతులు?"

"ఏముంటాయి సార్! ఎప్పటికప్పుడు మిమ్మల్ని చూచిపోదామని అనుకుంటూనే చాలా ఆలిస్యం చేసేను. మొన్నామధ్య మినర్వాలో మీ ఫ్రెండ్సుతో కనుపించేరు. అంతమందిలో మిమ్మల్ని డిస్టర్బ్ చేయడమెందుకని వూరుకున్నాను."

"అదేమిటండీ! మంచివారేనే! డిస్టర్బ్ చేయడమేమిటండీ బొత్తిగా .. నో .. అదేం బాగోలేదు."

సంగమేశ్వరరావు ఇక్కడ సిగ్గు నభినయించేడు. కాఫీ కప్పు కింద వుంచుతూ వాన్సుతూ అన్నాడు.

"ఈ మధ్య రెండుమూడు ఇంటర్వ్యూలు వొచ్చేయండి. అవుతే అవన్నీ పరాయి వూళ్ళలో. అందుచేత నేను వెళ్ళలేదు.. ఉద్యోగం చేస్తే మనూళ్ళోనే చేయాలని వుంది."

"అవునవును ఈ రకమైన ఆలోచనలు మనూరివాళ్ళకి చాలామంది కున్నాయి సుమాండి. బాగుంది."

"ఈ విషయం మావయ్యతో చెబితే నాకేం తెలీదు నీదారేదో నువ్వే చూచుకో మన్నాడు. అప్పుడిహ మీరు నాక్కనిపించేరు."

ఇదీ వరస. ఈ సంగమేశ్వరరావు నాకథల్ని మెచ్చుకోడానిగ్గానీ, లేదూ నేటి తెలుగు కథ రీతి గురించిగానీ మాటాడేందుకు రాలేదు. అది గమనించి నేను బాధపడ్డాను గానీ సంగమేశ్వరరావు కది తెలీనివ్వలేదు. ఇంకా అతనే మాటాడేడు—

"మీ ఎరికలో ఇక్కడేమైనా ఉద్యోగాలుంటే సాయం చేసి పెట్టండి."

"అదిసరే! బట్..నేనీ వూరొచ్చి ఆర్నెల్లైనా కాలేదింకా.."

"ఫర్లేదండి. నాలుగైదు నెలలాగమన్నా ఆగుతాను. ఉద్యోగరీత్యా మీరీవూరొచ్చి ఆర్నెల్లే అయినా మీకీ వూళ్ళో ఎవరెవరొ ఎంతెంత చనువుందో నాకు తెలుసార్!" అన్నాడతను తెలివిగా, తెగింపుగా, చొరవగా, కించిత్తు లౌక్యంగాను.

ఉద్యోగం కోసం వొచ్చినవాడికి తప్పనిసరిగా వినయ విధేయతలుండి తీరాలని, నేననుగానీ, బొత్తిగా నెత్తికెక్కి 'ఏం, వాయ్! నా విషయమేం చేస్తావని డబాయించి అడిగేస్తే మండదూ? అవుతే నేనేం మండిపడిపోలేదు. పైపెచ్చు నీకీ డబాయింపు ధోరణి నప్పదని గూడా చెప్పలేదు. నేను మొహమాటస్థుడిని. నేనేమంటే ఎదటివాడేమైపోతాడో నన్న దిగులున్న వాడిని. అందుచేత సంగమేశ్వరరావు బతికిపోయేడు. నేను మాత్రం తిరకాసుగానే మాటాడవలసి వొచ్చింది.

"నాకీ వూళ్ళో ఎంత పరపతి వున్నది చెప్పేరు. బాగుంది. మీకీ వూళ్ళో కావలసిన ఉద్యోగమెలాటిదీ? దానికోసం ఎవర్ని అడిగి చూడమంటారూ? ఈ మొదలైనవి గూడా చెప్పేసి వెళ్ళిపొండి." అన్నాను.

అప్పుడతను నిజంగా ఇబ్బందిలో మునిగిపోయినట్టు గమనించేను. మా యింటి వేపూ నావేపూ, నేను కూర్చున్న కుర్చీవేపూ గబగబా చూచిగాని చెప్పలేదు.

"మీకు పశుపతిగారు తెలుసుగా సార్?"

ఈ ఒక్కమాటా అనేసి అతనొచ్చిన కార్యం సిద్ధించినంతగా సంబరపడిపోయేడతను. అతను వెళ్ళిపోయినా పశుపతిగారి గురించి నా ఆలోచనలు మాత్రం దూరం కాలేదు.

పశుపతిగారికి మా వూళ్ళో మంచి పేరుంది. ఒక్కగానొక్క మేడుంది. రెండు కారులు కాబోలు—అవీ వున్నాయి. జ్యేష్ఠుడి పేరేమిటో తెలీదుగానీ అతనస్తమానూ క్లబ్బుల్లోనూ సినిమాల్లోనూ కనిపిస్తాట్ట. ఒక కుమార్తె గూడా వుంది. మావూరి కాలేజీలో బుద్ధిగా చదువుకుంటుందని నాకెవరో చెప్పేరు. ఇంత బలగం కలిగి వున్న పశుపతిగారికి మావూళ్ళో ఒక గొప్ప వ్యాపారము వున్నది.

ఎగుమతీ దిగుమతిలకు సంబంధించిన ఆ వ్యాపారము దినదినాభివృద్ధి చెందుతున్న విషయం ఆ సంస్థలో ఉద్యోగం చేస్తూన్న మావూరి వాళ్ళు చాలామంది చెప్పేరు. పశుపతిగారి వ్యాపారాభివృద్ధి గురించి అక్కడి ఉద్యోగస్థు లందరి మాటా ఒక్కటేగానిండీ, వాళ్ళ ఉద్యోగ నిర్వహణ వగైరా విషయాల్లో మాత్రం భేదాభిప్రాయాలున్నాయి. దీనిమూలంగా పశుపతిగార్ని చాలా రకాలుగా వూహించుకోవలసిన అవసరమెంతైనా వుంటుంది. క్లాస్ వన్ ధర్మరాజని కొద్దిమంది చెప్పేరు. వొట్టి దుర్మార్గపు మనిషని చాలా మంది అన్నారు. స్వార్థముందిగానీ, అది ఎదటి వాడిని ముంచేది కాదని కొందరి విశ్వాసం. ఏమైతేనేం పశుపతిగారు దైవ స్వరూపులు. ఒకే దేవుడు అనేకమంది కనేక రకాలుగా ఎలా కన్పిస్తాడో సాక్షాత్తు వీరూ అంతే!

పశుపతిగారితో నాకు పరిచయమున్న మాట వాస్తవమే! స్థానికంగా ఏర్పాటు చేయబడే సంఘ కార్యకలాపాల్లో ఆయన్నాకు తారసపడ్డారు. మొదటిది (గుర్తున్నది) పట్టణ యువజన సంఘ వార్షికోత్సవంలో నేను వక్తను. ఆనాడు పశుపతిగారు మొదటి వరసలో ఓ అందమైన కుర్చీలో కూర్చున్నారు. కార్యక్రమం పూర్తయింతర్వాత, శ్రీవారితో నాకు పరిచయ భాగ్యం కలిగింది. సంఘ నిర్వాహకులు పశుపతిగారికి నాగురించి 'అతి'గానే చెప్పేరు. అప్పుడాయన మందహాసం చేసి వీలు చిక్కినప్పుడు తనుని తప్పక కలుసుకోవలసిందిగా కోరేరు. రెండోతడవ కాబోలు వారికి నేను కావలసిన మనిషినయ్యేను! నేను రాసిన నాటకాన్ని పుర నటులు కొందరు మా వూళ్ళోనే ప్రదర్శించేరు. ఆ ప్రదర్శనకి సినీమా చిన్ననటులొకరు హాజరయ్యేరు. వారిదీ మావూరే! వారి పక్క కుర్చీలోనే పశుపతిగారు కూర్చున్నారు. ఆనాటి ప్రదర్శన నిజానికి రక్తి కట్టిందనే చెప్పాలి. రచయితగా ప్రేక్షక మహాశయులకు నన్నానాడు వేదిక మీద, పరిచయం చేశారు. తదనంతరం మా పూర్వం మాస్టారొకాయన నా గురించీ, నా నాటకంలోని నటుల గురించీ ఉద్ఘాటించేరు. ఆపైన పశుపతిగారు సినీమా చిన్ననటునితో నన్ను కలుసుకున్నారు. వారికి నన్ను పరిచయం చేసి ఆనక నన్నో మంచి నాటకం కొత్తది రాయమని అడిగేరు.

కుర్చీలం

కానీ, పశుపతి గారంత పట్టుదల గల మనిషని నాకానా డనిపించలేదు. సరిగ్గా వారంరోజులు గడవగానే ఓ సాయంత్రం నన్ను వారింటికి పిలిపించేరు. వెళ్ళేను.

వారిల్లు అందంగా వుంటుంది. పాలరాతి మేడలా నున్నగా వుంటుంది. చుట్టూతా ముచ్చటైన ప్రహరీ ఒకటుంది. ప్రహరీ అంచున మనోహరమైన క్రోటన్సు వున్నాయి. నేను వెళ్ళిన వేళకి పశుపతిగారొక్కరూ మల్లెపందిరి కింద ఓ కుర్చీలో (వాలుది ఖరీదైనది.) నడుంవాల్చి పుస్తకమేదో తీరుబడిగా చదువుతున్నారు. వారినా స్థితిలో చూచినప్పుడు నేనసూయ చెందేను. ఈ మనిషికింత దర్జాని, ఇంత ఆనందాన్ని విస్తారణంగా ఆ భగవంతుడేల అనుగ్రహించేడాని బాధపడిపోయేను.

తిన్నగా వెళ్ళి నేనాయన కొంచెం దూరంలో నించున్నాను. నేనొచ్చినట్టు పశుపతిగారు గమనించలేదు కాబోలు. కాని వారి కుక్క గమనించి మేడ మీంచి అరిచి గోల పెట్టేసింది. పశుపతిగారు పుస్తకాన్ని తొలిగించి నన్ను చూచిన మీదట చిన్న హాసరేఖ పెదాల మీదుగా వెలిగించి, వారి కుక్కని మందలించేరు.

కుక్క నోరు మూసుకున్నది!

ఆయన, నన్ను కూర్చోమన్నట్టు నటించేరు. అక్కడే ఖాళీగా వున్న మరో కుర్చీలో వినయంగా కూర్చోవాలనుకున్నానుగానీ, కుదరక చాలా మామూలుగానే కూర్చున్నాను.

వంటమనిషో, పనిమనిషో తెలీదుగాని ఒకతను కాఫీలు పట్టుకొచ్చి మా కందించేడు. ఇంక మరి తాగవలసిందిగా తలతో తెలిజేసి వారమ్మాయిని పిలిపించేరు. ఎందుకలా అనవసరంగా ఆ పిల్లని పిలుస్తున్నారో అర్థమైందికాదు. వారమ్మాయి దాదాపు నాట్యం చేస్తున్నట్టు వొస్తూ, దార్లోనే ఓనమస్కారం పారేసి, వొచ్చి మరో కుర్చీలో కూర్చుంది.

ఈ అమ్మాయినింత కంటె చిన్నతనంలో వేనవేసార్లు చూసేను. ఆడపిల్లలు సైకిలు తొక్కడమనే విద్యని హర్షించలేని వూరు మాదికాదుగానీ, విడ్డూరంగా చూచే మానవులు నాతో పాటు చాలామంది మా వూళ్ళో వున్నారు. పశుపతి గారమ్మాయి సైకిల్మీద సాయం సమయాల్లో అలా ఆ తాం్రోడ్డు వెంట షికారు కొచ్చేది. వెనగ్గా ఓ బంట్రోతు నురుగలు కక్కుతూ, రొప్పుతూ వొచ్చేవాడు. అప్పుడు వాకా అవస్థంతా చిత్రంగా కనుపిస్తూండేది. అందుచేత పశుపతి గారమ్మాయిని నేనీ జన్మలో మరిచిపోలేను గదా!

"శకుంతల. మా అమ్మాయి. బియస్సీ చదువుతోంది. వీళ్లమ్మ చదువింక కట్టేయమంటుంది. నేనేమొ మెడిసన్ చదివిద్దామంటాను. శకుంత లేమొ సినిమాల్లో చేరతానంటుంది. ఇదండీ మా కథ!" అన్నారు పశుపతి.

నేను చాలా కథలు రాసేను. కొన్ని నిజమైన కథలూ రాసేను. కానీ పశుపతిగారు చెప్పిన కథ నాకు నచ్చలేదు. నన్నడుగుతే దానికి కథనే పేరూ తగదని చెప్తాను.

పశుపతిగారి మాటలకు శకుంతల సిగ్గుపడినట్లే కనిపించింది మరి. తనకున్న రెండు జడల్లో ఓ జడని ముందుకు లాక్కుని రెండుచేతుల్తో ఆ జడని అల్లుతూంది.

కాసేపలా జరిగింతర్వాత పశుపతిగారు వారి అసలు ఉద్దేశాన్ని బహిరంగం చేసేరు.

"మీరు మంచి నాటకాలు రాస్తారని నాకు తెలుసు. మరేం లేదు. మా శకుంతల సినీమాల్లో చేరాలనే ఉబలాటాన్ని తండ్రిగా నేను కొట్టిపారేయలేక పోతున్నాను. మీరు ఓ బ్రహ్మాండమైన నాటకం రాయండి. దాన్లో శకుంతలకి మంచి పోర్షను ఎంచండి. అయ్యిందా ఈ నాటకాన్ని నా సొంత ఖర్చుల మీద అటు మదరాసూ, ఇటు హైదరాబాదూ రెండూర్లలోనూ ప్రదర్శించే ఏర్పాటు చేస్తాను. నాటకం మాత్రం చాలా బాగుండాలి. పెద్దపెద్ద సినీమా డైరెక్టర్లు, నటులు వగైరాలను ప్రదర్శనకి పిలిపించే బాధ్యత నాదే. అదృష్టం బాగుంటే అమ్మాయికి సినీమాల్లో ఛాన్సు దొరకొచ్చు. అంతే కాకుండా నాటక రచయితగా మీక్కూడా ఏదైనా ప్రయోజనమూ వుండొచ్చు. ఆలోచించండి."

నేనాయిన పథకాన్ని విని తెల్లబోయేను. ఇంతకు మునుపు నాతో ఎవరూ ఈ ప్లానుని చెప్పలేదు. పశుపతిగారి తెలివి అమోఘం. మధ్యలో నాగ్గూడా ఇంత 'ఆశ' మేత పెట్టేరు. కానీ, చాలా బాగా నచ్చే కొత్త నాటకాన్ని నేనెంత కాలంలో రాయగల ననేది మొదటి సమస్య. ఆ రాసిన నాటకం ఈయన గారి కెంత నచ్చుతుందనేది ముఖ్యమైన రెండో సమస్య. అందుచేత నే నప్పుడాయనకి ఏవిధమైన హామీ యివ్వలేకపోయేను.

నేను వారింటి నుంచి తిరిగొచ్చిన నాటి నుంచీ నేటివరకూ నేను నాటకం రాయనూ లేదు. ఇప్పటికొచ్చి నేనాయన కృనిపించనూ లేదు. అలాంటప్పుడీ సమయంలో సంగమేశ్వరరావు ఉద్యోగం నిమిత్తం మళ్ళీ నేనాయన్ని చూడవలసి వస్తే నా గొంతుకి ఉరి పడేమాట ఖాయం! పోనీ, నేనేదైనా నాటకం రాసివుంటే ఆసందర్భంగా ఆయన్ను కలుసుకోవచ్చు. నేనీ మధ్య అస్సలేమీ రాయడంలేదు. గనక ఇక వార్ని కలుసుకోడమనే మాట తీసిపారేశాను.

కానీ, ఇటు సంగమేశ్వరరావు నన్ను బ్రతకనిచ్చేలా లేడు. బొత్తిగా నన్ను తినేస్తున్నాడు. తరచూ మా యింటికొచ్చి అత నుద్యోగ విషయ మెంతవరకు వచ్చిందో కనుక్కెడుతున్నాడు. మధ్యనుధ్య పశుపతిగారి ప్రయాణాలూ, వారి తీరుబడి వైనాలూ, యివన్నీ హెచ్చరించడం గూడా చేస్తున్నాడు.

ఒకనాడు, పార్కులో వెంకట్రావే కనిపించేడు. కనిపించిన వాడు క్షేమసమాచారములు మాని 'నిందలు' వేయడం ప్రారంభించేడు.

"అవున్లేవోయ్. మేం నీకిప్పుడు ఏం కనిపిస్తాం? పెద్దవాడివి. అదికాదు గురూ! నీ అదృష్టం పండి నువ్వు పెద్దవాడివయ్యావంటే మేమంతా సంతోషిస్తున్నాం. బాగుంది. కాని అంతమాత్రం చేత మన స్నేహితాన్ని మరిచిపోతే ఏంబాగుంటుంది చెప్పు?" అన్నాడు వెంకట్రావు.

అపరాధిలా తలెత్తకుండానే అన్నాను.

"నన్నేం చేయమంటావో చెప్పు వెంకట్రావూ?"

"కుర్రముండా వాడు కాలికి బలపం కట్టుకుని రోజూ మీ యింటికి వొస్తూ పోడం తప్పించి నువ్వొక్కనాడైనా ఆ పశుపతి గార్ని కలుసుకున్నావా? ఉద్యోగం యివ్వడం, మానడం తర్వాత విషయం. ఇప్పటికొచ్చి నువ్వాయన్ని కలుసుకోలేదంటే నాతల కొట్టేసినంత పనవుతోంది. మా వాడేమొ నామీదా, మన స్నేహం మీద కొండంత ఆశ పెట్టుకున్నాడాయిరి. అబ్బే ఇదేం బాగోలేదు గురూ! నువ్వేమైనా అనుకో. అంతే!" అన్నాడు బాధగా.

నేనెందుచేత ఆ పశుపతి గార్ని కలుసుకోలేకపోతున్నానో కారణం వెంకట్రావుకి చెబ్దామనిపించింది. అది చెప్పి అతన్ని వొప్పించే దానికంటే, అభిమానం చంపుకుని

పశుపతిగార్నే కలుసుకొందామని నిర్ణయించు కొచ్చేను.

నాటినుంచి నాలుగురోజులు నిద్ర మానుకుని రచనలో కూచున్నాను. అయిదో నాటి సాయింత్రం నాటకాన్ని తయారుచేసి స్క్రిప్ట్ చేతపట్టుకుని పశుపతిగారింటికి వెళ్లేను.

పశుపతిగారి జ్యేష్ఠుడు బజారు వేపు వెడుతున్నాడు కాబోలు కారు తాళంచెవిని (ఇగ్నిషన్ కీ) సరదాగా వూపుకుంటో ఎదురయ్యేడు. అతను భారీఎత్తు మనిషి. రెపటలా గాలి కెగిరిపోయే అవతారం! నెత్తి మీద అరంగుళం మేర వెంట్రుకలు కత్తిరింపబడి వుంటాయి. ఎల్లప్పుడూ బాగా బిరుకైన పంట్లాములు ధరిస్తాడు. చొక్కా అనబడని ఏదో వొస్తు విశేషాన్ని చొక్కాగా వేసుకుంటాడు. అంతెత్తు మనిషి గాల్లో ఎగిరిపోతున్నట్టు నడుస్తూంటే నాక్కొంచెం కంటగింపుగా వుంటుంది.

అప్పుడతని నెత్తి మీద ఒక ఊలుటోపీ గూడా వున్నది. ఈ రకమైన టోపీలకీ రోజుల్లో పరపతి పెరిగిపోతోంది. ఆ టోపీతో, ఆ నడకతో అతన్నాకు ఎదురైనప్పుడు ఒక 'కొంగ' నేల మీద నడుస్తున్న భ్రాంతి కలిగింది.

ఆ కొంగ నన్ను విష్ చేసి చేయికలిపి ఇంగ్లీషులో నా క్షేమాన్నడిగింది. వాళ్ల డాడీ కోసవొచ్చేనని ఇంగ్లీషులోనే చాలా డాబుసరిగా చెప్ప ప్రయత్నించేనుగానీ, కుదిరి చావలేదు. లోపలున్నారని చెప్పి కారు దగ్గిరికి ఎగిరెళ్లిపోయిందా కొంగ.

లోపలికి వెళ్లేను పశుపతి గారింకా నిద్రలేవని కారణంగా కాసేపు వరండాలోనే కూర్చోవలసి వచ్చింది. కూర్చుని నా రచనలోని సొగసుని అక్కడక్కడా గమనించడం ప్రారంభించేను. డాబా మీద గదుల్లో ముందేదో శబ్దమయ్యింది. వెనువెంటలే 'ధా. ధిక్..ధై ధిక్..ధక్ ధక'లు మగ గొంతు నుంచి వినవచ్చేయి. ఆ పదాల కనుగుణంగా పాదతాకిడీ వినిపించింది. ఈ తతంగం యావత్తూ నానెత్తి మీదనే జరుగుతున్నది. కాసేపట్లోనే నాకు చిరాకు వేసింది.

నాట్యమనేది లలితకళల్లో ఒకటని వేనొప్పుకుంటాను. ఎందుచేతనోగాని నేనెంత ప్రయత్నం చేసినా శాస్త్రీయ నాట్యంలోని ఔన్నత్యాన్ని వెతుక్కోలేకపోతున్నాను. ఇది కేవలం నాతప్పన్నా వే వొప్పుకునేందుకు సిద్ధమే!

నా పేర్తో ఏది రాద్దాం కొరోగా వినా తూన్న వేళకి పశుపతిగా రావడం జరిగింది. లేచి నించున్నాను. ఆయన కూర్చున్న తర్వాత నేనూ కూర్చున్నాను. ఆయనొక్కడే సిగ రెట్టు ముట్టించి అన్నాడు.

"మీర్నాకు కనిపించి రెండువేలలు దాటిం దనుకుంటాను."

"అవునండి. ఈ మధ్యన ఆరోగ్యం బాగో లేక బయటకి రాలేకపోయేను."

"ఈ సంవత్సరం ధరల్కాగా ఎండలెంత మండిపోయేయో గమనించేరా?"

"అవునండి. చాలా మండిపడిపోయేయి వర్షాలూ అంతేను. అతివృష్టి."

"అగ్నిప్రమాదాలు అవిగూడా ఈ సంవత్సరం ఎక్కువే."

"అవునండి. బాగా ఎక్కువే."

"ఏమిటో కలికాలం యావత్తూ యిలా తగలబడిపోతోంది."

"అవునండి.."

ఈ తడవ వంత పాడటమిష్టం లేక పోయింది. ఆయన వరస చూస్తుంటే నా నాటకం విషయం మరిచిపోయినట్టనిపి స్తోంది. లేకపోతే వారింతన్యాయంగా మాటాడేవారు కానేకాదు. అందుచేత నాకై నేనే నాటకోదంతాన్ని ప్రారంభించేను.

"మీరు చెప్పినట్టు నాటకం రాసేను. కానైతే వెలరోజుల కాలాన్ని రెండునెలల వరకూ పొడిగించేను. క్షమించాలి. పోతే ఈ నాటకాన్ని బాగా రాయగలిగేనన్న ధైర్య ముంది. ఓమాటు మీరు గూడా చదువుతే.."

"ఐతే, నాటకం పూర్తయిందన్నమాట. ఏమిటోనండి ఈమధ్య తీరుబడి చిక్కక చాలా వరదాలు చంపేసుకుంటున్నాను. చూద్దాం. నాటకమిచ్చి వెళ్ళండి" అన్నా రాయన చప్పగా, చేదుగా.

పుస్తకమిచ్చి చేతులు నలుపుకున్నాను. మెల్లిగా అసలు విషయంలోకి సంభాషణ మార్చేను.

"నాకో ఫ్రెండున్నాడు. చాలా మంచి వాడు."

"పేరేమిటన్నారు?"

"వెంకటావని మమూరివాడే! అతని కో మేనల్లుడున్నాడు."

"పేరేమిటన్నారు?"

"సంగమేశ్వరరావని చెప్పి బి. ఏ. పాసై య్యాడు."

"ఏం చేస్తున్నాడన్నారు?"

"ఆ విషయం మాటాడేందుకే వచ్చేను.

కుర్చీలు

అతను ప్రస్తుతం నిరుద్యోగి. మంచివాడూ, తెలివైన వాడూను."

"ఐసీ."

"మీ కంపెనీలో ఏదైనా ఖాళీ వుంటే అతనికో ఛాన్స్ యిస్తారేమోనని ఎప్పటి కప్పుడు అడుగుదా మనుకుంటూనే వాయిదా వేస్తూ వచ్చేను."

"చెప్పారు కాదే! బలేవారే మీరు మీకంత మొహమాటం పనికిరాదు సుమండీ."

నాక్కొంచెం సరదాగా వున్నది. కుర్చీలో ముందుకి జరిక్కూర్చున్నాను.

"కానీ, ప్రస్తుతం మా కంపెనీలో, ఖాళీలేమీ లేవు. ఉంటే గనక మీకు తప్పని సరిగా ఖబురంపుతాను సరేనా? పోతే. ఈ పుస్తకం మీ దగ్గిరే వుంచుకోండి. కావలిసి వొస్తే నేనే అడిగి పుచ్చుకుంటాను. ఓ.కె.?' అన్నారు.

"ఓ. కె." అనేశాను.

ఆయన లేచి నించున్నారు. నేను లేచి వచ్చేశాను.

*   *   *

నెల రోజులు గడిచింతర్వాత కోరోజున సంగమేశ్వరరావు అర్జంటుగా మా యింటి కొచ్చేడు. ఒచ్చీరావడంతోటే గబ గబా రాలుగూ అనేశాడు నిప్పుతొక్కినకోతిలా -

"రామనాథంగాడికి ఉద్యోగం వచ్చింది. నాకంటే వాడు జూనియర్. పైగా ఫూల్. అయినాసరేవాడికే ఉద్యోగం ఇచ్చేరు పశుపతి గారు. అప్పుడే వారం రోజులైపోయింది గూడాను."

"నే నడిగితే ఖాళీ ల్లేవని చెప్పేడే మరి."

"లేపోతే, ఉన్నాయని చెబ్తారేమిటండీ! మీరు మరీను."

"అసలింతకీ రామనాథం ఎవడోయ్?"

"డాన్స్‌మాస్టరు సోమయాజుల్లేరండీ," వాళ్ళ తమ్ముడు. సోమయాజులు పశుపతిగా రమ్మాయికి డాన్స్ నేర్పుతున్నాడుగదా! ఆ పరి చయంలో ఆయనగారేమో ఈ ఫూల్‌గాడికి ఉద్యోగం వేయించేశాడు" అన్నాడు కసిగా.

నేనున్నాను. నేను నాటకాలవీ రాస్తాను. నా నాటక మొకటి ఆమధ్య పశుపతిగారికి కావలసి ఒచ్చింది. ఆరకంగా నాకూ ఆయ న్తో పరిచయమున్నట్టైగా. కానీ, నాకున్న పరిచయంతో ఈ సుబుద్దికి నేను ఉద్యోగం వేయించలేకపోయేను. అంటే, ఈ మొత్తా నికి అర్థమేమిటి? ఆ డాన్స్‌మాస్టరు సోమ

యాజులు ముందు ఈ నాటకాల రచ యిత తీసికట్టన్నమాట. ఇదీ, టూకీగా సంగమేశ్వరరావు గుండెల్లోని అభిప్రాయం.

దీనికి నేనేం బాధ పళ్ళేదు. సంగమేశ్వర రావు వెళ్ళిపోయింతర్వాత నిట్టూర్చేను. అంత పరపతీ, అంత హోదాగల పశుపతి గారి చిన్న విషయంలో అబద్ధమెందుకు చెప్పాలని మాత్రం బాధపడిపోయేను. పశు పతిగారికి నేను సోమయాజులుకంటే ముందు నుంచీ తెలుసు ఆయన్కా నాట్యాలు నేర్ప లేకపోయినా నేనూ ఆయన్కా ఒక కళా కారుడ్నే! పశుపతిగారి విలువన్ని గ్రహించే ముందొచ్చిన నన్ను కొట్టి పారేసి వెనకొచ్చిన ఆ సోమయాజుల్ని గౌరవించడమనే విష యంలో చింతించేను. ఆనాటినుంచీ పశు పతిగారిమీద విరోధం పెట్టుకోవలసి వచ్చింది.

ఈ కథ ముఖ్యంగా పశుపతిగారూ, సంగ మేశ్వరరావూ, నేనూల మధ్యింతవరకూ జరి గింది. నాకు మావూళ్ళో ప్రాణం సైతం ధారపోసే మిత్రుడు మూర్తివున్నాడు. అత న్నింతవరకూ ఈ కథలో పరిచయం చేయ లేదు. మూర్తి గూడా కథలు రాసే కుర్రాడు. మే మెల్లప్పుడూ కలిసే తిరుగు తూంటాం

పోనా డతనింటికి వెళ్ళేను. అతనప్పుడు చాలా తొందరగా ఉన్నాడు నన్నుచూస్తూనే

"రా గురూ! రా! నీ కోసమే చూస్తు న్నాను. లేపోతే ఈవేళకి బస్టాండులో వుండవలసిన పని" అన్నాడు.

"ఏమిటో విశేషం?"

"మా విశ్వమన్నయ్య వస్తున్నాడు. ఉత్తరం రాసేడు. రేపు సాయంత్రం టవున్ హాల్లో మీటింగేదో ఉన్నదట. అదవ్వ గానే రాత్రికి మా పల్లెటూరు వెళ్ళిపో వాలి. ఈ వార్త మా వాళ్ళకి చెప్పేందుకు వెడుతున్నాను."

మూర్తి మా వూరివాడే అని చెప్పాలి చదువూ, ఉద్యోగం రెండూ ఈవూళ్ళోనే. వాళ్ళ సొంతవూరు మా వూరుకి పది మైళ్ళలోవున్న పల్లెటూరు అక్కడే ఇల్లూ, పొలం గట్రా వున్నాయి. వారానికో తడవ అక్కడికి వెళ్ళివస్తూంటా డతను.

మూర్తిని బస్సెక్కించి ఇంటిమొహం పట్టేను. దాన్లో మూర్తి వాళ్ళన్నయ్య జ్ఞాపకాని కొచ్చేడు.

ఈ భూమ్మీద నుంచి 'టేలెంట్' వున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళప్రతిభా

విశ్వం కొన్నాళ్ళకిగాని గమనింపుకిరాడు.

మూర్తి వాళ్ల దొడ్డమ్మగారబ్బాయి ఈ విశ్వం. ఆనర్సు పూర్తయింతర్వాత మదరాసు వెళ్ళిపోయి సినిమాల్లో చేరేడు. నాలుగైదేళ్ళు ప్రముఖ దర్శకుల దగ్గిర పన్జేసి మొన్నీ మధ్యనే విడుదలైన వో తెలుగు సినిమాకి డైరక్టరయ్యేడు. దాన్లో చాలామంది కొత్తవాళ్లు నటించేరు. ఆ సినిమాలో ఆకర్షణలు చాలా ఉన్నాయి. పత్రికలు ఆ సినిమాని ఆకాశాని కెత్తేశాయి.

అందుచేత విశ్వం ప్రఖ్యాతి నలుదిశలా ఈనాడు వ్యాపించింది. ఈ సినిమా నాలుగో వారం ఆడుతూండగానే మరో రెండు సినిమాలకి దర్శకుడుగా నియమింపబడినట్లు పత్రికల్లో వార్తలొచ్చేయి. కాబట్టి ప్రతిభ గల మనిషెప్పటికైనా రాణిస్తాడనే ధర్మ సూత్రం ఈ విశ్వం ద్వారా నిజమైంది.

ఆ సాయంత్రం నాకేం తోచలేదు. మూర్తి యింట్లోలేడు. పురమందిరానికి వెళ్ళేడని చెప్పేరు. హోటల్లో యింత కాఫీ తాగి నేనూ టవున్ హాలు వేపు వెళ్లేను.

మా వూళ్లోవున్న 'పట్టణ యువజన సంఘం' చాలా చక్కగా పన్జేస్తోంది. తగ్నవాళ్ళకి సన్మానాలూ, అప్పుడప్పుడు సాంస్కృతిక కార్యకలాపాలు నెలకో తడనైనా ఏర్పాటు చేయడంతో మావూరి జనాభా రిలాక్సవు తోంటుంది.

నేనొస్తున్న రోడ్డుమీద, రోడ్డుకి అడ్డంగా పెద్ద పెద్ద అట్టలు కట్టి వుంచేరు. వాటిపైన 'విశ్వానికి స్వాగత మని' ఇంతింతక్షరాల్తో రాసేరు. కొన్ని అట్టల పైన అభివందనలూ వున్నాయి.

టౌన్ హాలు దగ్గిర జనం గుంపుల గుంపులుగా వున్నారు. గ్రామఫోన్ రికార్డులు మార్మోగు తున్నాయి. ఆ పాటలన్నీ విశ్వం సినిమాలోనివే కావడం ఒక ప్రత్యేకత! మధ్య మధ్య రికార్డులు ఆపి టౌన్ హాల్లో చేరిన ప్రేక్షక సమూహాన్ని నిశ్శబ్దంగా వుండాలని ఎవరో కీచు గొంతులో హెచ్చరిస్తున్నారు.

నేనక్కడ కాసేపు నించుని తిరిగి వెళ్ళబోయేను. అప్పుడు మూర్తి కనిపించేడు.

"బలేవాడివి గురూ! ఇంత లేటా?" అన్నాడు.

"నేనిక్కడికి రావాలని రాలేదు. ఏం తోచక వొచ్చేను."

"తగ్గవోయ్! నీ ఆఫీసుకి ఖబురం పేను. చేరలేదూ?"

"లేదే?"

"ఫర్లేదు. ఆఁ నీకోసం సీటుంచేను."

నే నతన్తోపాటు లోపలి కెళ్లేను. రెండో వరసలో మధ్యగా రెండు కుర్చీలు ఖాళీగా వున్నాయి. తిన్నగా అక్కడికే వెళ్లి కూర్చున్నాము. మే మెళ్లి కూర్చున్న క్షణనే, విశ్వ మొచ్చినట్లు మైకులో ఎవరో చెప్పేరు.

విశ్వంతో పాటు చాలా మంది ఖరీదైన మనుషులు లోపలి కొచ్చేరు. విశ్వం వేదిక మీదికి వెళ్లగా మిగతా వాళ్లందరూ మా ముందున్న మొదటి వరస కుర్చీల్లో కూర్చున్నారు. సరిగ్గా నా ముందు పశుపతిగారే కూర్చున్నారు. ఆయన నా మొహం చూచి గూడా పలుకరించ లేదు. నేనూ తల దించేశాను.

సరిగ్గా ఆయన కుడి వేపున మూడు కుర్చీలు ఖాళీగా వున్నాయి!

సభ ప్రార్థనతో ప్రారంభ మయ్యింది. 'వందే మాతరం' పాడినమ్మాయి పాట పూర్తయిం తర్వాత (ఫర్లేదు. బాగానే పాడింది.) వినయంగా చేతులు జోడించి విశ్వానికి నమస్కరించింది.

సంఘ కార్యదర్శి విశ్వాన్ని సభికులకు పరిచయం చేశాడు. అదైన తర్వాత విశ్వం కాసేపు మాట్లాడేడు. ఈ సినిమా ప్రపంచంలో తానెన్ని కష్టా లెదుర్కొని యీ స్థితి కొచ్చేడో చెప్పేడు. (వొంటికి మల్లెపూవులు తగలడం కూడా గొప్ప కష్టమేనా అనిపించింది నాకప్పుడు.) ఆంధ్ర ప్రేక్షకులు తన పట్ల చూపుతూన్న ఆదరాభిమానాలు శ్లాఘనీయ మన్నాడు. కళలకు ఆట పట్టైన మా వూళ్లో తనకీ రకమైన అభినందన సభ ఏర్పాటు చేయడం ముదావహమనీ అన్నాడు. (అప్పుడు సభలో కరతాళ ధ్వనులు మిన్ను ముట్టేయి) తదనంతరం ఉపన్యాసం ముగించి కూర్చున్నాడు.

సంఘాధ్యక్షుల విన్నపాలూ ముగిసేయి. అవి జరుగు తూండగా విశ్వం తనకిచ్చిన పూల దండని ముక్కు దగ్గిరిగా వుంచుకుని ఏదో ఆలోచిస్తున్నట్టు కన్పించేడు.

ఉపన్యాసాలు పూర్తయిం తర్వాత విశ్వంతో పాటు వక్తలూ వేదిక దిగి కింది కొచ్చేశారు.

తర్వాత వినోద కార్యక్రమాలు. — అవి ప్రారంభించే ముందు నా ముందు వరసలో వున్న కుర్చీల్లో జరిగిన కొన్ని తమాషాలు రాస్తాను.

విశ్వం వేదిక దిగొచ్చి పశుపతిగారి కవతలగా వున్న మూడో కుర్చీలో కూర్చున్నాడు. రెండో దాన్లో సంఘాధ్యక్షులు. పశుపతిగారి పక్కనే కార్యదర్శిను. ఇదీ సీను. కానీ, పశుపతిగారికీ వరస వచ్చినట్లు లేదు. సంఘ కార్యదర్శితో ఏదో మెల్లిగా చాలాసేపు మాటాడేరు. ఆ మీదట కొన్ని వొడంబడిక లేవో జరిగి వుంటాయి. అందుచేత కార్యదర్శి పశుపతిగారి కుర్చీలోకి వచ్చేడు. దరిమిలా అధ్యక్షుడూ కదిలి ఇవతల (కార్యదర్శిది) కుర్చీలోకి వొచ్చేడు. అప్పుడు విశ్వం ఎడంపక్క కుర్చీ ఖాళీ అయ్యింది. దాన్లో కెళ్ళి కూర్చున్నాడు పశుపతి. అతని ఆరాటం నాకు చిరాకనిపించింది.

పశుపతి విశ్వానికి ఎడంపక్క కుర్చీలో కూర్చున్నాడన్న మాటేగానీ, విశ్వాని కవతల కుడిపక్కన కూర్చున్న మరో మనిషి మీద కోపమొచ్చి వుండాలి. ఎంచాతంటే ఆమనిషి విశ్వాన్ని జలగలా పట్టుకుని విడిచి పెట్టడం లేదు. తెగమాటాడేస్తున్నాడు. మొహమాటం కొద్దీ విశ్వం తలూపుతున్నాడు.

పశుపతి ఓ తడవ అవతల మనిషి వేపు మిర్రున చూసేడు. అది గమనించలేదా మానవుడు. తరవాత కార్యదర్శిని కళ్లతో ఏదో హెచ్చరించేడు. అప్పుడా కార్యదర్శి తన సీట్లో నుంచి లేచివెళ్లి వినయంగా విశ్వం ముందు నించుని ఏదో చెప్పేడు. తన పక్కనే బాంబేదో పేలినట్టు ఉలిక్కిపడి ఎడంవేపు చూసేడు విశ్వం.

అప్పుడు పశుపతి రెండుచేతులూ జోడించి వెకిలిగా నవ్వేశాడు. ఆనక విశ్వాని రెండుచేతులూ పుచ్చుకున్నాడు. ఈలోగా కార్యదర్శి విశ్వానికి కుడిపక్కన కూర్చున్న జలగని అక్కడినించి లేవవలసిందిగా అభ్యర్థించి, అతనికి తను లేచొచ్చిన కుర్చీ చూపించేడు. జలగ లేచి కార్యదర్శి ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుంది.

ఈ జలగ మొన్నామధ్య ఒక చిన్ని పరిషత్తులో ఉత్తమనటుడి బహుమతి పుచ్చుకున్న వైనం నా పక్క సీట్లో మనిషి చెప్పగా విని ఆశ్చర్యపోయేను.

విశ్వాన్ని జలగ విడిచి పెట్టినా పశుపతి విడిచి పెట్టలేదు. నవ్వేస్తూ, కుర్చీని కుడి

సెమ్మో రిదొ వళ్లించి చెబుతున్నాడు. విశ్వాం తన పూలదండని వాసన చూస్తూ విని విన నట్లు వింటున్నాడు.

"మరో అయిదు నిమిషాల్లో 'మధురా నగరికి' ప్రారంభమవుతుంది. కుమారి శకుంతలా పశుపతి తమ నాట్యకౌశలాన్ని సహృదయులైన ప్రేక్షక మహాశయులకు

పరిచయం చేస్తారు." అని ఎవరో కాగిత మ్మీద రాసి చదివినట్టు మైకులో చెప్పేరు.

ఈ హెచ్చరిక విన్న జనాభా కెలావున్నదో గానీ నేనదిరి చచ్చేను. పశుపతిగారి వ్యూహాన్ని మెచ్చుకోక తప్పిందికాదు.

నా పక్క కుర్చీలోని మూర్తి బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నవాడిని చేత్తో కుదిపేను. కదిలి అన్నాడు.

"శకుంతలంటె సైకిలువాలా కదూ గురూ!"

"ఎక్జాక్ట్లీ. కొంచెం నీ ముందు చూడు. అసలైన నాట్యం యిక్కడే జరుగుతోంది" అన్నాను పశుపతిని చూపిస్తూ.

మూర్తి అటువేపు చూచి మెల్లిగా నవ్వే శాడు. నాట్యం ప్రారంభమయ్యే ముందు ఓ మనిషి ముందు వరస కుర్చీల దగ్గిర అటూ యిటూ నాలుగైదుసార్లు తిరగడం గమనించేను. ఇంటర్వెల్లో చేగోడి, బజ్జీ, టీ అమ్ముకునే కుర్రాళ్లని మరిపించే డతను. అతను చాలాసార్లు విశ్వం దృష్టి నాక ర్షించుకునేందుకు ప్రయత్నం చేసేడుకానీ, ఫలించలేదు. చివరికి విసుగెత్తి వెనక వరస కుర్చీల్లోకి చేరుకున్నాడు.

"ఫలానా థియేటరు ప్రొప్రయిటరు" అన్నాడు మూర్తి.

"సినిమాలో వేషం కోసమా వొచ్చేడు?"

"అయ్యేవుంటుంది. మొన్నామధ్య ఒక డొక్కు సినిమాలో రెండు నిమిషాలపాటు వీపు వాయించుకున్నాడు. ఇప్పుడు మరో ఛాన్సు కోసం చూస్తున్నాడు. ఈ తడవ గూడా ఏ వింజామరం లాటిది పుచ్చుకోడమో మోహన్ని కొడతారంతే!"

అయిదు నిమిషాలు గడిచినా నాట్యం ప్రారంభం కానేలేదు. ఉన్నట్టుండి పశుపతి గ్రీన్‌రూం వేపు పరుగెత్తేడు. కాసేపట్లో పశుపతి శకుంతలని వెంటబెట్టుకొచ్చేడు మొదటి వరస కుర్చీల దగ్గిరికి. ఆ అమ్మాయి తండ్రితో వొస్తున్నప్పుడు కెమేరాల్లో ఫ్లాష్‌లు గబగబా వెలిగేయి.

ఆ అమ్మాయి యింటి దగ్గిర కంటె యిక్కడంత అందంగాలేదు. సైకిలు తొక్కు తున్నప్పుడు చాలా అందంగా వుండేది. ఇప్పుడు అందంగా లేకపోయినా బరువుగా వున్నది. ఏవో చాలా అలంకారాలు చేసేరు. నేను నాట్యాలు చాలా చూసేను. ఇన్ని అలంకారా లతో మెరిసిపోతూ "వల్లలమ్మ బోదు—" అన్నెవ్వరూ ఎప్పుడూ ఎక్కడా నాట్యం చేయ లేదు. మీదు మిక్కిలి ఆ అలంకారాలన్నీ గూడా కలిపి పెద్ద సైజు వికృతాల్ని అక్కడ ప్రదర్శిస్తున్నట్టు నా కనిపించింది. అందు చేత శకుంతల నా స్థితిలో చూచినప్పుడు నేను చాలా సిగ్గుపడిపోయేను.

తండ్రి కోరినట్టు శకుంతల విశ్వానికి పాదాభివందనం చేసింది. రెండు ఫ్లాష్‌లు చిటిక్ చిటిక్ మని మెరిసేయి. అంతవరకూ బాగానే వున్నది. రెండునెలలు (సరిగ్గా నేను లెక్కవేయలేదు. ఉజ్జాయింపుగా అన్నాను.) శిక్షణతో మొదటిసారి కాలికి అందెలు కట్టి వేదిక ఎక్కి నాట్యం చేయడమనే గొప్ప విద్యకి ఒక ప్రఖ్యాత దర్శకుని ఆశీస్సు లందుకోడంలో అనౌచిత్యం కన్పించదు. కానీ, పశుపతి ఓ వెండి కప్పు విశ్వం చేతి కిచ్చి, ఆ కప్పుని శకుంతల కివ్వమని చెప్పి, వెనువెంటనే ఫ్లాష్‌లు మెరిపింపజేసే ప్రయ త్నంలో వ్యాపారం దాగి వుంటుంది. ఇదే నాకు నచ్చలేదు. నాట్యం చూడక మునుపే బహుమతీ ప్రదానమని (అదీ శకుంతల వాళ్ల సొమ్మే!) సంప్రదాయాన్ని వ్యాపార రహస్యమని నేనంటాను. ఈ కార్యక్రమాన్ని యావత్తూ ఫోటోల్లో నింపడం దారుణ మనీ అంటాను.

దాంతో విశ్వమ్మీద నాకు కించిత్తు కోపమూ వొచ్చింది. కానీ, అతను పశుపతి గారడిలో మునిగిపోయిన కుర్ర దర్శకుడు. సినిమాల్లో పాత్రలనైతే తనిష్టం వొచ్చి నట్టు మార్చుకోగలడుగానీ జీవితంలో పశుపతుల నేం చేయలేడు.

శకుంతల వెళ్లిపోయింది. పశుపతి విశ్వం పక్కనే జాగ్రత్తగా కూర్చుని సిగ రెట్టు ముట్టించేడు. విశ్వంతో కాసేపేదో మాట్లాడేడు. తెర తొలగడంతో మాటలాపే శాడు.

'మధురానగరి' ప్రారంభమయ్యింది.

నాట్యాలు చూడటమైతే జరిగింది కానీ వాటిని విమర్శించేంత స్తోమతు నాకులేదు. అయినా సరే శకుంతల చేస్తున్నది ఏ వన్ డాన్సంటె నేనొప్పుకోను. సోమయాజులు తలూపుతూ పాడుతున్నదానికీ, శకుంతల ఆంగికాభినయానికీ పొత్తేలేదు. ఎవరిష్ట మొచ్చినట్టు వారు పాడుతున్నారు, చేస్తు న్నారు. శకుంతల నేర్చుకున్న విద్య యింకా ప్రారంభదశలోనే ఉన్నదని చెప్పాలి.

ఇక నేను లేచి వెళ్లిపోడానికి సిద్ధపడ్డాను. మూర్తి బలవంతం చేసి కూర్చోపెట్టేడు. ప్రముఖులంటూ వొచ్చింతర్వాత వారి యొక్క 'ప్రేవాలు' కోసం అనేకవుంది

సామాన్యమైన మనుషులు తహతహ లాడటం మామూలే. అప్పుడా నాడు అయిదారుగురు కాలేజీ విద్యార్థులు ముందు వరసకి వొచ్చేరు. ఆటోగ్రాఫ్ పుస్తకాలు పుచ్చుకుని. విశ్వానికి ఇలాటి అభిమానులే ముఖ్యమని నా ఉద్దేశం. పశుపతి మొహంలో రంగులు మారుతున్నట్టు పసిగట్టాను. విశ్వం వాళ్లకి సంతకాలు చేస్తూండగా పశుపతి వెర్రెత్తిన మనిషిలా ఖంగారుగా అటూయిటూచూసేడు. నాట్యం మధ్యలో ఇలా అనవసరంగా, వొచ్చిన ప్రతివాడికీ సంతకాలు పెట్టడం అతనికి నచ్చలేదు. నాట్యకళలో చేయించిన రెండు వేలల 'కృషి' వృధా అవడం మతరామూ యిష్టంలేదు. అందుచేత వొచ్చిన మనుషులకి సంతకాలైన పిదప పశుపతి లేచి వెళ్లి గేటు దగ్గిరున్న పోలీసుతో ఎదో చెప్పి వొచ్చి కూర్చున్నాడు. మరంతే. అట్నుంచి ఓ పిట్ట గూడా సంతకాలు నిమిత్తం ఇటు రానివ్వ లేదా పోలీసు.

'మధురానగరి' చాలాసేపటికిగాని పూర్తి కాలేదు! తర్వాత ఎదో జానపద నృత్యమని మైకులో 'చదివేరు.'

పశుపతి డ్రింకులు తెప్పించేడు. ముందుగా విశ్వానికో డ్రింకు యిచ్చేడు.

ఇక్కడ విశ్వం విజృంభించేడు. కుర్రవాళ్లంత తెలివి గలవాళ్లో చేతల్లో నిరూపించేడు. తనకిచ్చిన డ్రింకుని గబిక్కిన, వెనక్కి తిరిగి మూర్తికిచ్చేడు. మూర్తీ, నేనూ యిద్దరమూ తెల్లబోయేము. అంత వరకూ విశ్వం మమ్మల్ని గమనించలేదేమోనన్న మా భ్రమ పటాపంచలయ్యింది.

"తాగరా! మనం పదినిమిషాల్లో బయలుదేరి వెళ్లిపోదాం. పిన్నివాళ్లు ఎదురు చూస్తూంటారు కాబోలు. వీడు మూర్తని మా తమ్ముడండి"

పశుపతిగారి చేతిలోని రెండో డ్రింకు తీసుకుని నాకిస్తూ నన్నూ పరిచయం చేశాడు.

"రావుగారని కథలు రాస్తూంటారు."

పశుపతి చేతిలో వున్న మూడో డ్రింకు తాను పుచ్చుకున్నాడు! పశుపతిలో గొప్ప చలనం కలిగింది. నాలిక్కరుచుకుని తల బాదుకుంటూ అన్నాడు.

"అయ్యయ్యో! రావుగారు! రావుగారు, నాకు తెలీపోవడ మేమిటండి బాబోయ్!, వార్నాకు బాగా తెలుసు. మీరు ఆయన్నాకు పరిచయం చేస్తుంటే నాతల కొట్టేసినంత పనయింది. వారేమిటీ. నాకు తెలీకపోవడ మేమిటి? బలే వారేనే మీరు. (పునరుక్తి గమనించలేదు) వెనగ్గా కూర్చున్నారే స్వామీ! ఇలారండి. వొచ్చిక్కడ కూర్చోండి ముందు". అంటూ తను లేచి నించున్నాడు.

పశుపతి మీద జాలి కలిగింది. కానీ మేము ముందు వరసలోకి వెళ్లలేదు. పశుపతే వెనక్కి తిరిగి మాతో మాట్లాడేడు, ఆయన చాలా విషయాలు కొత్తగా చెబుతున్నట్టు చెప్పేడు. వాళ్లమ్మాయి నాట్యం, వాళ్లమ్మాయి నటన, వాళ్లమ్మాయి చదువు, వాళ్లమ్మాయి పెంకితనం— అల్లరీను. అయితే ఇవన్నీ విశ్వానికి చెప్పాలనే ప్రయత్నంలో మమ్మల్ని అడ్డుగా వాడుకున్న ఆయన చాతుర్యం గణనీయమే!

జానపద నృత్యం మధ్యలో మేం ముగ్గురం లేచి నించున్నాము. మమ్మల్ని బయట వరకూ సాగనంపేరు సెక్రటరీ, ప్రెసిడెంటూ, థియేటరు ఓనరూ, ఉత్తమ నటుడూ వగైరాలు. పశుపతి మాత్రం నన్ను కొంచెం అవతలగా తీసికెళ్లి అడిగేడు.

"రేపు విశ్వంగారు యిక్కడే వుంటారా?'

"ఇక్కడేమో తెలీదుగానీ వాళ్ల పల్లెటూర్లో వుంటారు."

"వెడదామంటా రేమిటి?"

"చూద్దాం."

"అమ్మమ్మ! మీరా మాటనకూడదు. నేను రేపుదయం ఎనిమిదంటే ఎనిమిది గంటలకి మీయింటి కొస్తాను."

"సర్లెండి."

"అన్నట్టు. అబ్బాయి పేరేమిటన్నారూ సంగమా, కుటుంబమా?"

"సంగమేశ్వరరావు!"

"ఆ! సంగమేశ్వరరావుని మీ యింటికి రమ్మనండి. ఉద్యోగం వేయించేద్దాం. అదిగో మిమ్మల్ని విశ్వంగారు పిలుస్తున్నారు. వొస్తానండి."


ఉదయం ఏడున్నరకే సంగమేశ్వరరావు మా యింటి కొచ్చేడు. నాముందు కూర్చున్నాడు. నేను విషయం చెప్పేను. అతను విని ఆనందంగా అన్నాడు.

"మీకు తెలీదుగానీండి. మీకు చాలా పరు వుంది. లేకపోతే ఆ పశుపతిగారు ఓ పట్టాన మీ మాట వినేవారనా?"

సంగమేశ్వరరావు లౌక్యాన్ని నేను మెచ్చుకోలేకపోయేను. ఈ సంగమేశ్వరరావు, వెంకట్రావు ఇద్దరూ కలిసి నా ప్రాణం తినేశారు. నాకప్పుడు కోడిపందేలు గుర్తు కొచ్చేయి. పందెపు కోడిలా నన్ను బరి మీదకి వొదిలేరు. ఎవర్నీ నమ్మకూడదు!

పశుపతిగారి కారు వారన్న టైముకి ఓ పావుగంట ముందే వొచ్చేసింది. ఆయనంత దూరాన్నుంచే నవ్వు మొహంతో గబగబా వొచ్చేశారు చేతులూపుకుంటూ.

మాయింట్లో చాలా అందమైన కుర్చీలు రెండే వున్నాయి. సంగమేశ్వరరావు కొకటీ, నేనొకటీ వాడుకుంటే పశుపతి గారెక్కడ కూర్చుంటారనే విషయం ఆలోచిస్తూ నించున్నాను. అప్పుడు నాకో పాత కుర్చీ గూడా వున్నట్టు జ్ఞాపకం వొచ్చింది. ఆజ్ఞాపకానికి వెంటనే నొచ్చుకున్నాను. ●



కాబోయే తల్లి తనకి కవలపిల్లలు పుట్టారని ఫొటోద్వారా తెలుసుకుంది.



గర్భంలోని శిశువుల ఛాయా చిత్రాలు

ఆమె త్వరలో తల్లి కాబోతోంది. ఆస్పత్రిలో మంచంమీద పడుకుని ఉంది. డాక్టర్లు ఆమెని తాము కనిపెట్టిన అత్యాధునిక యంత్రాల సహాయంతో పరిశీలిస్తున్నారు.

యంత్రాలలో ముఖ్యమయిన భాగం చిన్న మైక్రోఫోన్ అంత ఉండేది ఆమె దేహం మీద ఫొటో తీస్తున్నట్లు కదులుతూ ఉంది.

పేషంటుకి ఈ యంత్ర సాధనంలో దాగి ఉన్న శక్తి తెలియటం లేదు. కాని, ఆ మైక్రోఫోన్ పరిమాణాలు కల యంత్ర భాగంలోనుంచి కొన్ని లక్షల శబ్దతరంగాలు ఆమె గర్భ కోశాన్ని ప్రవేశిస్తాయి.

పది సెకండ్ల తర్వాత, డాక్టరు ఒక కెమరాలో నుంచి ఒక 'పోలారాయిడ్' ఫొటో ప్రింటు బయటికి తీస్తాడు. అదే పేషంటు గర్భంలో ఉన్న శిశువు ఫొటో! ఇంకా జన్మించని శిశువు ఫొటో!!

ఇది ఆధునిక వైజ్ఞానాభివృద్ధిలో ఒక పెద్ద ముందంజ. ఈ యంత్ర సాధన ప్రయోగం వల్ల గర్భంలో కవలలు ఉన్నదీ లేనిదీ తెలుసుకో వచ్చు.

ఈ యంత్ర సాధనం వెల సుమారు 10,000 పవున్లు (సుమారు రు. 210,000) దీనిని కొందరు స్కాట్లాండ్ డాక్టర్లు, యంత్ర నిపుణులు కనిపెట్టారు. మామూలు ఎక్స్—రే చెయ్యలేని పని ఇది చెయ్య గలదు. దేహంలోని పొరలని, జీవకణాలని, ద్రావకాలని ఫొటో తియ్య గలదు. దేహంలోని 'మెత్తని' భాగాలని— ఎక్స్—రేలు ఎముకలు కల భాగాలనే బాగా చిత్రీకరిస్తాయి — వివరంగా చూపించ గలవు.

అన్నిటికన్నా గమనించ తగ్గది ఈ యంత్ర సాధన ప్రయోగం వల్ల తల్లికి గాని, బిడ్డకి గాని ఏవిధమయిన హాని కలుగదు!


దీనిని ఇంకా ఇంకా అభివృద్ధి చెయ్యటంతో గర్భకోశపు బొమ్మలే కాక గుండెకాయ, కాలేయం వంటి ఇంద్రియాలని కూడా ఫొటో తియ్య వచ్చు. ఈ ఫొటోల సహాయంతో శస్త్ర వైద్యులు ఎన్ని ప్రాణాల నయినా రక్షించ గలరేమో!

గ్లాస్గో లోని క్వీన్ మదర్స్ ఆస్పత్రిలో నిర్మించిన ఈ యంత్ర సాధనాన్ని అక్కడి వారు సర్వ సామాన్యంగా వాడేస్తున్నారు. ప్రస్తుతానికి దీనిని గర్భకోశంలోని శిశువుల చిత్రాలకి వాడుతున్నారు.


బ్రిటిష్ ఆరోగ్య శాఖ వారు దీనిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీనిని లండన్, షెఫీల్డ్, బ్రిస్టల్ నగరాలలో వాడి చూస్తున్నారు.

ఇది ఎలా పని చేస్తుంది?

పేషంటు దేహంలోకి ఒక సెకండుకి



పేషంటు దేహంమీద ఫొటో తీస్తున్న కెమెరా.



కెమెరా క్లోసప్

ఆధునిక వైద్య విజ్ఞానశాస్త్రంలో పెద్ద ముందంజను సాధించి గర్భంలోని శిశువు ఛాయా చిత్రాలను తీసే యంత్రాన్ని గురించి ఈ వ్యాసాన్ని మనదేశంలోని ఏ పత్రికా యింతవరకూ ప్రచురించలేదు

20—25 లక్షల కంపనాల చొప్పున కదిలే శబ్ద తరంగాలని పంపిస్తుంది— చిన్న చిన్న మొత్తాలలో.

ఇవి (ఈ తరంగాలు) చర్మాన్ని దాటి గర్భకోశం ప్రవేశిస్తాయి. అక్కడ శిశువుకి తగిలి ప్రతి ధ్వనులుగా వెలువడుతాయి. యంత్ర సాధనం ఇటూ అటూ కదిలి నప్పుడు ఈ ప్రతి ధ్వనులు సెకండుకి 50 చొప్పున బయటికి వస్తూ ఉంటాయి. వీటిని పెద్దవి చేసి, శబ్ద శక్తిని కాంతి శక్తిగా మార్చి (కేథోడ్—రే— ట్యూబ్ సాయంతో) కెమెరా చేత రికార్డు చేయిస్తారు. చిన్న చిన్న చుక్కలు విడివిడిగా కెమెరా ప్లేటు (ఫిలిం) మీద పడినా అన్నీ కలిసి ఒక చిత్రాన్ని సృష్టిస్తాయి.'

ఈ యంత్రాన్ని మొదట వూహించి దాని నిర్మాణాన్ని సాధ్యం చేసిన డాక్టరు పేరు చెప్పటానికి వీలు లేదు. ఇది ఇక్కడి నియమాలని అనుసరించే పద్ధతి. కాని, ఆయన ఇలా అన్నారని మాత్రం చెప్ప గలను—

"ప్రస్తుతానికి రెండు పరిమాణాలు మాత్రమే ఉన్నాయి. 'లోతు' ఇంకా సాధించ లేదు. అయినా దీనినీ త్వరలోనే సాధించ గలమనే అనుకుంటున్నాను. అంతే కాక, చిత్రాల స్థాయినీ పెంచ గలము. ఇంకా స్పష్టంగా, ఇంకా తేలికగా తియ్య గలమని నా ఆశ."

ఇంత దాకా ఈ యంత్ర ప్రయోగానికి అంగీకరించిన స్త్రీ లందరూ సుఖప్రసవం ఎదురు చూడని వారే. అంటే, వారందరికీ ఏదో వైద్య సమస్య ఉందన్న మాట. అందుకనే వారిని ఇక్కడికి తీసుకొ వచ్చి దాని సాయంతో పరిశీలనలు జరుపుతున్నారు.


కాని— ముందు ముందు 'మామూలు' ప్రసవాలకీ దీనిని వాడి చూడ వచ్చు. ఎదురు చూడని విషయాలు చాలా బయట పడవచ్చు.

"అమెరికన్ డాక్టర్లు మా పద్ధతులనే అనుసరిస్తున్నారు. ఈ యంత్ర సాధనం కోసం ప్రపంచ మారుమూలల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి," అన్నాడు పైన చెప్పిన డాక్టరు.

(కాపీరైట్ వ్యాసం) ●

—జాన్ స్టీవెన్‌సన్

(ఆంధ్రసచిత్రవారపత్రికకు ప్రత్యేకం)



గర్భంలోని కవలల చిత్రం.

వారఫలం

9-9-1966 శుక్రవారం మొదలు 15-9-1966 గురువారం వరకు.

మేషం : ఇదివరకు మీరు కొన్ని వ్యవహారాలను నిర్లక్ష్యం చేయడంవలన యిప్పుడు యిబ్బంది కలుగుతుంది. వ్యాపారంలో కొత్తవారి పోటీని ఎదుర్కోవలసివస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

వృషభం : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి.

మిథునం : సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి రావడంవలన అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. వృత్తిలో మిత్రుల సహకారం లభించగలదు. సాంఘిక కార్యక్రమాలకు అనుకోని మార్పులు వస్తాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

కర్కాటకం : ఈవారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడంతగదు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీకృషి రాణిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పాటివారితో గౌరవం లభిస్తుంది.

సింహం . ఈవారం శుభా శుభ మిశ్రమంగా ఉంటుంది. వారం మధ్యలో అనుకోని వ్యయప్రయాసలకు గురికాగలరు. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. ఉద్యోగంలో మెప్పుకురాని బాధ్యతను వహించవలసి వస్తుంది. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—అనారోగ్య సూచనలు ఉన్నాయి. అధిక వ్యయం జరుగుతుంది.

కన్య : వృత్తి వ్యాపారాల్లో ఆదాయ వ్యయాలు రెండూ కూడా పెరుగుతాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. వారాంతంలో మీతాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో అనుకూల వార్తలను వింటారు. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు—సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

తుల : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాలవల్ల కేవలం తాత్కాలికమైన లాభమేకాకుండా మున్ముందు కూడా తగిన ప్రయోజనం ఉండగలదు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో పోటీవారి పోటీని ఎదుర్కొని అనుకూలతను సాధించగలరు. బంధువులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం : వారం ప్రారంభంలో వృత్తి వ్యాపారాల్లో ఆందోళన కలిగించే పరిస్థితులు ఏర్పడతాయి. నూతన వ్యాపారాలు శ్రమమీద ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో నూతన గౌరవాన్ని పొందగలరు. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. విలాస వస్తువులు కొంటారు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరుతాయి.

ధనుస్సు : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనిపించిన అనుకూలత ఆఖరువరకు నిలవదు. భారీ ఎత్తునచేసే వ్యాపారాలు ప్రారంభించడానికి యిది సమయంకాదు. వృత్తిలో పోటీవారితో మాటపట్టింపులు వస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది.

స్త్రీలకు— బంధుమిత్రులను కల్సుకొంటారు. దైవ కార్యాలు నెరవేరుతాయి.

మకరం వృత్తి వ్యాపారాల్లో చాలా శ్రమమీద స్వల్పాభివృద్ధిని సాధిస్తారు. కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని నమ్మించి మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. కోర్టు వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. విలాస వస్తువులు కొంటారు.

కుంభం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయంకంటే అడావుడి అధికంగా ఉంటుంది. సాహసముతోకూడిన వ్యవహారాల్లో యితరులజోక్యంవలన నష్టంవస్తుంది. ఉద్యోగంలో అకారణంగా అపోహలకు గురి కాగల ప్రమాదం ఉంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. సంతానానికి సౌఖ్యం సంతోషాలు లభిస్తాయి.

మీనం సలహాలు చెప్పేవారేకాని సహాయం చేసేవారు ఒక్కరూ ఉండరు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాల్లో ఆలస్యం జరుగుతుంది. కళాకారులకు మంచి సమయం.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది.

—మహేష్

మూలం: రామచంద్ర ఠాకూర్

ఆమ్రపాలి

అనువాదం: ఆకెళ్ల సీతారామం

జ రి గి న క థ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజు బింబిసారుడు ఆమె నెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో వైశాలీనగరంలో పుత్తళికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు. రేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశించి ఆమెదృష్టిని ఆకర్షిస్తాడు. బింబిసారుడు నేర్పుతో ఆనందుడినీ, పాలిని ఆపదనుంచి తప్పిస్తాడు. పాలి, బింబిసారుల హస్తాల్ని పరీక్షించి కోర్కెలు నెరవేరుతాయనిచెప్తాడువేదాంతి తననిగురించి అడిగిన పాలికి అప్పటికప్పుడు తానేమీ చెప్పలేనని సమాధాన మిస్తాడు బింబిసారుడు. పాలి భవిష్యం నిశ్చితం అయే ఆరోజు సంథాగారంలో సభాసదులంతా మహానాముని రాకకోసం ఎదురుచూస్తుంటారు. ప్రవేణి పుస్తకంలో పేర్కొన్న విధంగా పాలి భవిష్యాన్ని నిర్ణయం చేస్తాడు మహానాముడు. పాలీ, బింబిసారుల వివాహం అవుతుంది. మహానాముని నిర్ణయం, తాను వివాహ మాడింది మగధరాజునని విన్నతర్వాత బింబిసారుని అనుసరించడానికి నిరాకరిస్తుంది ఆమ్రపాలి.

15

వృద్ధ మహానాముని నాడులు లాగుకు పోతున్నాయి. అతని శయ్యకు సమీపంలో వైశాలిలోని ప్రసిద్ధ నాయకులు మహాజేట్టకుడు, నగరశ్రేష్ఠి కూర్చున్నారు. వైద్యశ్రేష్ఠుడు అతని కొక హిమాలయపు వేరు అరగదీసి త్రాగిస్తున్నాడు. ఔషధం సేవించగానే అతని శరీరంలో విద్యుత్తు ప్రవహించి నట్లయింది. క్రమంగా అతనికి శక్తి రాసాగింది. తక్షణం అతడు నగర శ్రేష్ఠిని దగ్గరకు పిలిచి అవసరమైన సూచన ఇవ్వసాగాడు.

ఆనందుని రథం ఆ సమయంలో మహానాముని ప్రాసాదం ఎదుటికి వచ్చి ఆగింది. ప్రాసాదం ముందు ఒక జనసమూహం నిల్చుంది. వాళ్ళు తమ నాయకుడైన లిచ్ఛవీయ వృద్ధుడు అస్వస్థుడుగ ఉన్నమాట విని అతని దర్శనార్థం పరుగెత్తి వచ్చారు. ప్రాసాదం ముందు అసంఖ్యాకంగా ప్రజలు నిలబడ్డం చూచి పాలి శంకించి భయ భీతయై ఆనందునితో తండ్రి దగ్గరకు పరుగెత్తుకొచ్చింది.

మహానాముడు కళ్ళు మూసుకొని పడుకున్నాడు. వైద్యరాజు చెప్పడం వల్ల నగర శ్రేష్ఠి తప్ప నాయకులంతా వెలుపలకు పోయారు. నగరశ్రేష్ఠి, మాత్రమే మహానాముని దగ్గర కూర్చుండి ప్రవేణి పుస్తకంలోని సూత్రాన్ని మెల్లగా చదువుతున్నాడు. పాలి వచ్చి మహానాముని పాదాల పై శిరస్సు ఉంచింది. మహానాముడు కళ్ళు తెరచాడు. పాలి తన శిరాన్ని మెల్లగా మహానాముని వక్షంలో పడవేసింది. వృద్ధుడు మందహాసం చేశాడు. తన దుర్బల హస్తాలతో పాలి తల నిమురుతూ అత్యంత ప్రేమతో అతడన్నాడు— 'వచ్చాతివా, అమ్మాయీ?' జవాబుగా పాలి తల ఊపింది. కంఠం ఎక్కిళ్ళతో నిండడం వల్ల ఆమె మాట్లాడలేక పోయింది. మహానాముడు ద్వారాన్ని మూయమని ఆనందునికి సైగ చేసి చెప్పాడు. అతడు వెంటనే ద్వారం మూసి తండ్రి దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. మహానాముడు పాలీ, వైద్యుల సహాయంతో, దిండు సహాయంతో కూర్చున్నాడు. పాలి ఒక చెయ్యి తండ్రి తలక్రింద ఉంచి రెండవ చేతితో అతని వక్షాన్ని రాయసాగింది. నగరశ్రేష్ఠి మంత్రోచ్చారణ మాని మహానాముని పాదాల చెంత కూర్చున్నాడు.

మహానాముడు మందస్వరంతో అన్నాడు. 'ప్రపంచంలో ఎన్నో విధాలైన పాపాలుంటాయి. నా జీవితంలో నేనొక పాపం చేశాను. కాని దానిని నా వెంట తీసుకొని చనిపోదలచడం లేదు. కుమారా, నీవు నమ్మినా లేకపోయినా, నేను జీవితంలో ఒక్కటే అసత్యం చెప్పాను. దానిని మన అభిరాముడొక్కడే ఎరుగును. పద్దెనిమిది ఏళ్లకు పూర్వం నేను మల్లులతో జరగబోయే యుద్ధాన్ని ఆపి, వైశాలికి తిరిగి వస్తున్నాను. అధిక శ్రమచేత అలసిపోవుట వల్ల నేను పెద్ద ఉద్యానంలో కూర్చున్నాను. ఆ సమయంలోనే నాకు ఒక బాల ఆక్రందనం వినిపించింది. ఆ రోజులలో మహోద్యాన రక్షకుడు అభిరాముడు. అతడు నాకు సేవ చేస్తున్నాడు. అతడా వైపునకు పరుగెత్తి తిరిగి వచ్చేటప్పుడు తనతో ఒక అప్సర వంటి బాలికను తీసుకొని వచ్చాడు. ఆమెను ఎవరో మహోద్యానంలో అన్నిటి కంటే పెద్దదైన ఆమ్రవృక్షం క్రింద విడిచి వెళ్ళారు. బాలిక ఏడవడం చూచి నా హృదయం కరిగింది. నాకు కుమార్తెలు కలుగుతున్నారు కాని, పుట్టగానే చచ్చిపోయేవారు. ఆనందా, నీ తల్లి పుత్రికలను ఎంతో కోరుతూండేది. నేను బాలిక నెత్తుకొని అభిరామునితో కూడా గుప్తద్వారం గుండా మహలులోకి తీసుకుపోయాను. ఆనందా, అప్పుడే మీ అమ్మ కూడా ఒక బాలికను నాకు చూపడానికి తెచ్చారు. నా చేతిలో ఉండగానే దాని ప్రాణాలు పోయాయి. దాని చావు వల్ల నీ తల్లికి గొప్ప ఆఘాతం కలుగుతుందని నేను భయపడ్డాను. కాబట్టి నేనా మృత పుత్రికను అభిరాముని చేతుల్లో ఉంచి జీవిత పుత్రికను అంతఃపురానికి పంపాను. ఆమెయే ఆమ్రపాలి! ఆశ్చర్యమేమంటే, ఎవరికీ కొంచెమైనా సందేహం కలగలేదు. నేనీ ఘటనను దైవ సంకేతంగా భావించాను. ఆమ్రవృక్షం క్రింద లభించడం వల్ల అభిరాముడు ఆమెకు ఆమ్రపాలి అని పేరు పెట్టాడు. నేను దాన్ని ఒప్పుకొన్నాను. అభిరాముడు నాకు చాలా పురాతన మిత్రుడు. ఈ రహస్యం ఎవరికీ చెప్పనని నేను అతని నుండి శపథం తీసుకున్నాను. కాబట్టి నేను చనిపోయిన తరవాత కూడా ఈ రహస్యం ప్రకటింపబడకుండానే ఉండిపోతుంది. మరే వికృత రూపంలోనో ప్రకటిత మవుతుంది. కాబట్టి నేనీ విషయాన్ని నా నోటితో చెప్పగోరుతున్నాను. కాని పాలీ, నీవు హృదయపూర్వకంగా నా పుత్రికవే, నేనూ, నీ తల్లీ పాలిని ఎక్కువగా ప్రేమిస్తున్నామని ఆనందుడెన్నో సార్లు నన్నాక్షేపించాడు. పాలీ, నా అర్ధసంపత్తికి ఆనందుడూ, తక్కిన అర్ధసంపత్తికి నీవూ అధికారులు. ఈ విషయాలన్నీ ఏర్పాటు చేయుదుని నేను నగరశ్రేష్ఠితో


చెప్పాను. ఇప్పటివరకు నీవు నా పుత్రికగా ఉన్నావు. ముందు కూడా నా కుమార్తెగానే ఉంటావు. అమ్మాయీ, నగరశ్రేష్ఠి, వైద్య రాజూ నాకు పరమ మిత్రులు. వారీ రహస్యాన్ని ఎన్నడూ వెల్లడి చేయరు. జీవిత పర్యంతం నీవు నాకు పుత్రికగా ఉంటానని మాటియ్యి. అమ్మాయీ, క్షమించు. కాని నాకు మాట..' మాట లాడుతూనే అతడు పాలి హస్తాన్ని తన వక్షం వైపు లాక్కున్నాడు. అతని నేత్రాలు విస్తరింప సాగాయి.

పాలి తల మీద కొండ విరిగిపడింది. మహానాముని ముఖం వైపు చూచి ఆమె కరుణార్ద్రయై కేకవేసింది. 'నాన్నగారూ, నాన్నగారూ.' కాని అదంతా వినక, నగర శ్రేష్ఠి పవిత్ర మంత్రోచ్చారణ మధ్య వృద్ధుడు దేహం చాలించాడు. ఆనందుడు కన్నీటితో మృతపిత పాద ప్రక్షాళనం చేసి, వివశమయ్యే మనస్సును వశపరచుకొని వెలుపలికి వచ్చాడు. గొప్ప జనసమూహాన్ని ఉద్దేశించి అన్నాడు. 'లిచ్ఛవీయులారా, వజ్జీయుల ఈ విశాల భూతలం నుండి బలవంతుడైన లిచ్ఛవీయ వృద్ధుడు. నాతండ్రి పితృభూమికి పయనించాడు.'

పాలి స్తబ్ధంగా కూర్చుంది. ఆమె ఏమీ తినలేదు, ఎవరితోనూ మాట్లాడలేదు మహానాముని మాటలు విని బహుశా ఆమె అన్యమనస్కురాలయింది. లేదా ఆ మాటలనే మరచిపోయింది. రేవా ఎంతో యత్నించింది. ఏడ్చి, భయపెట్టి, అభ్యంతర పెట్టి ఆమెను శయన గృహం నుండి వెలుపలికి రమ్మని చెప్పింది. కాని దినమంతా పాలి అక్కడే కూర్చుంది. శయనగృహం నుండి పాదం అవతల పెట్టలేదు. అలాగే ఉంటే, పాలి ఉన్మత్తురాలవుతుందేమో అని రేవా భయం.

మహానాముని అంత్యక్రియ పూర్తయింది వైశాలి అంతా శోకమగ్నమయింది. వందల కొలది స్త్రీ పురుషులు పరామర్శ కోసం మహానాముని మహలుకి వచ్చారు. కాని పాలి స్థితి మారలేదు. తండ్రి మృత్యువు వల్ల ఆమె కాఘాతం కలిగిందని స్త్రీలనుకున్నారు దేశనర్తకి అగుననే భయంచేత బుద్ధి తారుమారయిందని పురుషు లనుకున్నారు. ఏమనుకున్నా, ప్రతివ్యక్తికీ పాలి మీద సానుభూతి ఉంది. అందరి హృదయాలూ దయాపూరితమయ్యాయి. వాళ్ళ కత్యంత ప్రియుడైన దేశభక్తుని ఇంటిని విపదంబుదాలు చుట్టుముట్టాయి. ప్రతి లిచ్ఛవీయుడు, ఆబాల వృద్ధులూ, స్త్రీ పురుషులందరూ పరిషత్తు ఆజ్ఞను మాటాడక ఆమోదించినా, దేశ నర్తకిని చేసే ఈ ఆచారం అనేకుల హృదయాలలో అసంతోషం కలిగించింది. వారి అంతర్భావనా దృష్టిలో ఈ ఆచారం బలియే కాకుండా, భీషణ క్రౌర్యం కూడాను. అదొక ఘాతుక పద్ధతి. ఈ సమయంలో వాళ్ళ అసంతోషానికి కారణం గతించిన మహానాముని సౌజన్యం. దీనిని అభయుడు అంగీకరిస్తాడు. కాని లిచ్ఛవీయుల ఈ హృదయాల నన్నింటినీ శిక్షిత సైనికుల లాగ వివాదమేమీ లేకుండా మౌనంతో వహించి ఉన్నారు.'

అభిరాముడు ఏడుస్తూ వందిగ్రామం నుండి వచ్చాడు. అతడూ నగరశ్రేష్ఠి కలిసి మహానాముని మహలులోనూ, వెలుపలా, కట్టుబాటు చేయడానికి ప్రయత్నించారు. రాత్రి అయ్యాక నగరశ్రేష్ఠి ఆనందుని



దగ్గరకు వచ్చి కూర్చోగానే వృద్ధ అభిరాముడు పాలి దగ్గరకు వెళ్లాడు. అతడు రాగానే రేవా అవతలికి వెళ్లింది. వృద్ధుడు మెల్లగా పాలి దగ్గర కూర్చుని, ఆమె వీపు మీద చేతితో నిమిరి చెవిలో 'అమ్మాయీ' అన్నాడు. పాలి ఏమీ మాట్లాడలేదు. అలాగే క్రిందికి చూస్తూ ఉంది. వృద్ధుడు వీపు మీద నుండి చెయ్యి తీసి తలపై చేతితో నిమురుతూ అన్నాడు—'అమ్మాయీ, కన్నీరు నింపకు. వాటిని వెలపలికి ప్రవహించనీ..'

కాని అభిరాముని ప్రియమైన బాలిక నేడు అతణ్ణి కన్నెత్తియైనా చూడలేదు. అభిరామునకు పాలి హృదయంలోని కల వరం అవగతమయింది. అతడు అవతలకు వచ్చి, అంత్యక్రియ జరుగు సమయంలో స్మారక చిహ్నంగా అతడుంచిన మహానాముని మకుటాన్ని తీసుకొని పాలి దగ్గరకువచ్చాడు. పాలి మస్తకం అలాగే క్రిందికి వంగే ఉంది. అభిరాముడు ఆ కిరీటాన్ని మెల్లగా ఆమె ఒడిలో ఉంచాడు. పాలి అదరిపడింది. కొంచెముసేపు ఆగి ఆమె ఒక్కసారిగా మకుటాన్ని బలపూర్వకంగా హృదయానికి హత్తుకుంది. ఆమె నిజంగా మహానాముని మస్తకాన్ని హృదయానికి హత్తుకొనుచున్నదేమో అను భ్రమ అతని కలిగింది. ఇంతవరకు లోపలనే స్తంభించి ఉన్న అశ్రు ప్రవాహం నిండు వేగంతో ఇవతలకి వచ్చింది. 'కాదు, కాదు, మీరే నా తండ్రి, తండ్రీ, నాతండ్రీ.'

పాలి ఇంకేమీ మాట్లాడక వెక్కివెక్కి ఏడ్వసాగింది. అభిరాముడిదే కోరుతున్నాడు. పాలి ఇప్పుడు ఉన్మాదిని కాజాలదని అతనికి విశ్వాసం కలిగింది. పాలి ఈ యేడ్పు వల్ల అతని కళ్లు కూడా చెమ్మగిల్లాయి. మహానాముని యెడల పాలి హృదయంలో అంతులేని ప్రేమ కలదని అతడెరుగును. మళ్లీ పాలి మీద చేతితో నిమిరి అభిరాముడన్నాడు. 'పాలీ, వీరపురుషుని ఉత్తరాధికారులు కూడా వీరులే అవుతారు. నీవు కూడా ఒక వీర పురుషునకు ఉత్తరాధికారిణివనీ, వీరాంగనవనీ మరవకు. ఇప్పుడీ ఉత్తరాధికారాన్ని 'స్వ' ను వదలి 'పర' ను స్వీకరించడానికి ఉపయోగించాలి. నీ ప్రతి సంస్కారంలోనూ వేతృత్వం వ్యాప్తమైంది. నీవు సామాన్య లిచ్ఛవీయునికి ఉత్తరాధికారిణివి కావు, మహానాముని పుత్రివి. కాబట్టి నీ చేత కొన్ని మహాకార్యాలు జరుగుతాయి. జరిగి తీరుతాయి. అమ్మాయీ, లే. హృదయంలోని ఆగాయాన్ని దాచి నీ కర్తవ్యాన్ని పాలించు.' పాలి విలపిస్తూ వృద్ధుని వక్షంలో తన తల దాచుకుంది. వృద్ధుడామె శిరాన్ని సవరిస్తూ, రెండవ చేతితో పాలికి కన్పించకుండా అశ్రువులు తుడుచుకున్నాడు. క్రమంగా రాత్రి గాఢమయింది. రాత్రింబవళ్లు ఒకదాని వెనక ఒకటి గడవసాగాయి. పౌర్ణమికి ఒకరోజు తక్కువగా ఉంది. మహానాముని అంత్యక్రియలు ముగిశాయి.

ఇన్ని దినాల వరకూ ఆనందుడుపూర్తిగా మౌనంగా ఉన్నాడు. అత్యవసరమైనప్పుడు అతడెప్పుడైనా కొంత మాట్లాడినా, అది మాట్లాడనట్లే. మహానాముని రిక్తస్థానంలో ఏమి చేయాలో నగరశ్రేష్ఠి ఆనందునికి బోధిస్తున్నాడు. కాని ఆనందుని దృష్టి ఈ విషయాలన్నింటిపైనా లేకుండా వేరోవైపుంది. అతనిలోని ఆనందం అదృశ్యమై కేవలం సజీవమైన అతని శరీరం నిల్చి ఉందో అన్నట్లు, అతడు నానాటికీ సన్నగిల్లుతున్నాడు. అంత్యక్రియపూర్తయిన తరవాత అతడారోజంతా ఎవరితోనూ ఒక్కమాటయినా మాట్లాడలేదు. ఇది విని పాలి మరింత దుఃఖించింది. తండ్రి గతించాక ఆనందుడు మూడుసార్లు నందీగ్రామం వెళ్లి వచ్చాడు. మూడు నాలుగు దినాల నుండీ పాలి తండ్రి మరణ శోకాన్నంతా మరచి ప్రాణపణంతో ఆనందుని సేవలో లగ్నమయింది. కాని ఈ విషయాలన్నిటి యందూ ఆనందుడు నీటిలోని తామర వలె నిర్లిప్తుడై ఉన్నాడు. నేడు అంతిమక్రియలు పూర్తయ్యాక పాలి ధైర్యం సడలిపోయింది. సోదరుని ఒడిలో ముఖముంచి ఆమె జోరుగా ఏడ్వసాగింది.

అప్పుడే ఆనందుని మౌనం భగ్నమైంది. అతడు సోదరిని ప్రేమతో కూర్చోబెట్టి అన్నాడు— 'పాలీ, దుఃఖించకు, నిజంగా నీవే తండ్రిగారికి నిజమైన ఉత్తరాధికారిణివి. ఆయన ధైర్యస్థైర్యాలు నీలో అధికంగా ఉన్నాయి. నీవు ఇలా ఏడుస్తూ ఉంటే దినాన్ని కూడా రాత్రి అనవలసి వస్తుంది. పాలీ, నీకు వచ్చిన కష్టం మరొకరికి కూడా వచ్చి ఉంటుందని నేననుకోను.'

'నాకేమీ దుఃఖంలేదు. సోదరుని వంటి సోదరుడు, సమర్థుడైన సోదరుడు నా వెనక ఉన్నాడు. నాకు దుఃఖమెందుకు? నే నెంతమాత్రం విచారంగాలేను.'

'పాలీ, నీ దుఃఖాన్ని నే నెరుగుదును. సోదరుడు, తండ్రి అందరూ చెప్పడానికి మాత్రమే. నీ సర్వస్వం ఎవరికి నీ వర్పించావో, ఆ స్వామిని దేశం కోసం హృదయపూర్వకంగా శాశ్వతంగా నీవు విడవవలసి వచ్చింది. భాగ్యదేవత దీనితోనైనా సంతుష్టి పడలేదు. ఆమె నీకు మరణించడానికైనా అధికారం ఇవ్వలేదు. అడుగడుగునా అధఃపతనానికి ప్రలోభనం గల జీవితం నీకు మృత్యుపర్యంతమూ గడపవలసి ఉంటుంది. కాదు, కాదు, సోదరీ, ప్రపంచపు టంతం సమీపంలో ఉంది. ప్రకృతి మనుష్యుని మీద కోపించింది. ప్రపంచ వినాశ బీజం లిచ్ఛవీయులోనే నాటబడింది. చూడు, అది పుష్పించి ఫలించి ఏదో ఒక శుభదినంలో ఈ ప్రపంచంలో ఉన్నవాళ్ల నందర్నీ విషపూరితమైన శాఖాప్రశాఖలతో కప్పివేసి శ్వాస ఆపి ఆపి చంపివేస్తుంది. అప్పుడే ఈ ప్రపంచం అంతమవుతుంది, లేకపోతే కాదు. సోదరీ, ఇప్పుడీ ప్రపంచం అంతం కావలసిందే.'

'సోదరా, ఇంత ఏవగింపు, ఇంత విషాదం దేనికోసం? నీవు—నీవు లేవు. సోదరా.'

'అవును పాలీ, నే నెంతో యోచిస్తున్నాను. ఆలోచించిన కొలదీ, ఈ లిచ్ఛవీయులు లిచ్ఛవీయులవలె ఉండకుండా ఉంటే బాగుండును అనే విశ్వాసం నాకు కలుగుతోంది. లిచ్ఛవీయుని జీవితం జంబూద్వీపంలోని ఏ ఇతర సామాన్య మనుష్యుని జీవితంలా ఉండదు అతడు శస్త్రాలతో జన్మిస్తాడు, శస్త్రాలతో జీవిస్తాడు. చనిపోయినా శస్త్రాలతోటే చనిపోతాడు. సంథాగారాన్ని విడిచి అతడెక్కడా బుద్ధిలేక తెలివిని గురించిన విషయం చెప్పడు. సంథాగారానికి వెలుపల అతడు ప్రేమించడం, ప్రాణం తీయడంను గురించే ప్రసంగించగలడు. అతడన్ని సమయాల్లోనూ చంపడానికీ, చావడానికీ స్వతంత్రుడు. ఈ రెండు ఘాతుక కార్యాలలో ప్రవృత్తుడవడానికి అతని కెలాంటి సందేహమూ ఉండదు. పాలీ, నీవు లిచ్ఛవీయవు. ఒక శ్రేష్ఠ లిచ్ఛవీయునికి నిజమైన ఉత్తరాధికారిణివి. నీలో లిచ్ఛవీయుని గుణాలన్నీ ఉన్నాయి. కాని నాలో లేవు. ప్రతి లిచ్ఛవీయుడూ స్వాభావికంగా ఏ విషయం ఆలోచింపగలడో దాన్ని నేనాలోచింపలేను. నేను నేర్చింది నేడు నాకు వ్యర్థంగా తోస్తోంది. నేను చేసేది నిరర్థకంగా తోస్తోంది. నా ఆలోచనలూ వ్యర్థాలే... కాదు పాలీ, నేను లిచ్ఛవీయుణ్ణి కాను. నేను మహానామునికి ఉత్తరాధికారిని కాలేను. అతని గౌరవాన్ని నీవే కాపాడగలవు. ఈశ్వరుడు నిన్ను రక్షించుగాక!'

"ఈశ్వరుడా?"

ఆనందుడు నిలబడిపోయాడు. పాలి 'ఈశ్వర' నామాన్ని చెప్పి విస్మితమై అతన్ని చూడసాగింది. నిజంగా ఆనందుడు చేతి మండి జారిపోయాడు. పూర్ణిమ వచ్చింది.

నేడు సంథాగారం నిండిపోయింది. నేడు పాలి దేశనర్తకి కాలేదు. వైశాలిలో ఎందరో నాట్యకత్తెలున్నారు. కాని పరిషత్తు ఆజ్ఞానుసారం సర్వమాన్య సుందరి ఆమ్రపాలి నర్తకి ఎలా అవుతుందో చూడ్డానికి ప్రజలంతా ఆతురపడుతున్నారు.

ఆ రోజుల్లో వైశాలిలోని దేశనర్తకి దూరదేశాల్లోనూ ప్రసిద్ధి కెక్కింది. అనేక సార్లు వైశాలి ప్రతిష్ఠకు సంబంధించిన ప్రశ్న కూడా దేశనర్తకి నృత్యం మీదనే ఆధారపడుతూండేది. అప్పటి దేశ నర్తకి ఇప్పుడు వృద్ధురాలు కావచ్చు. అయినా, ఆమె వైశాలిలోని వారాంగన లందరిలో శ్రేష్ఠురాలు. నేడు ఆమ్రపాలి ఆమెకే అప్పగింపబడుతుంది. కాబట్టి, ఆమె తన దాసీలతో కూడా సమయానికి సంథాగారం వచ్చి చేరింది. అలాంటి రోజు ప్రతి సంవత్సరం రాదు.

అంచేత దాని మహత్యం కూడా సామాన్యమైంది కాదు. మహానాముని మరణాఘాతం ఇంకా క్రొత్తగా ఉంది. అయినా, నేడు శ్రోతలూ, ప్రేక్షకులూ అసాధారణంగా ఎందుకు గుమిగూడేరో తెలియదు. లిచ్ఛవీయ నాయకగణం రాజులు, రాజ ప్రతినిధులు, ప్రతి ప్రాంతంలోని నాయకులు కూడా వచ్చారు. మహానాముని మరణానంతరం సభాపతియై నేడు అభయుడు గిరిరాజు లాగ శాంతి ధారణ చేసి కూర్చున్నాడు. అతడు అతినేర్పుతో సభను వశపరచుకుంటున్నాడు.

సరియైన వేళకు ఆనందుడు సోదరి చెయ్యిపట్టుకొని సంథాగారంలో ప్రవేశించాడు. సభ వీరిరువురి గౌరవార్థం నిల్చుంది. శోకం చేత దుర్బలులైనా, ఆనందుడూ, పాలి కాషాయ వస్త్రాలలో అందంగా కనిపిస్తున్నారు. సభాపతి అభయరాజు ముందుకు వెళ్ళి కృత్రిమ వాత్సల్యంతో నిండిన కళ్ళతో ఇద్దరినీ సత్కరించాడు.

ప్రస్తావం ఉంచబడింది. ఆనందుడు 'వృద్ధులారా, వందనీయులగు సభ్యులారా, నా తండ్రి మరణం వల్ల ఆయన స్థానంలో నేను నేడు నా సోదరిని పరిషత్తునకు అప్పగించడానికై వచ్చాను. పూజనీయమైన పరిషత్తు ఈమెను స్వీకరించుగాక!'

నగరశ్రేష్ఠి, వైద్యరాజు, అంబలక జేట్టకుడు, ఇతర శ్రేణులకు చెందిన మహాజేట్టకులు, దాదాపు ప్రౌఢ, వృద్ధ పురుషులందరూ కళ్ళు వాల్చి కూర్చున్నారు. మహానాముని మైత్రినీ, ప్రేమనూ ప్రతిధ్వనింపజేసే వాళ్ళ హృదయాలు కలవర పడుతున్నాయి. చివరకు సభాపతి అభయుడు నిలబడి అన్నాడు-- 'పూజ్య సభాసదులారా, స్వర్గీయుడైన లిచ్ఛవీయ వీరుని పుత్రిక మీ యెదుట ఉంది. ఆమె లిచ్ఛవీయ పరిషత్తు స్వాతంత్ర్య చిహ్నం. స్త్రీ అయినా, పురుషుడైనా లిచ్ఛవీయుడైతే అతడు లిచ్ఛవీయ గణం యొక్క, తన యొక్క గౌరవాన్ని ప్రాణం కంటె ఎక్కువగా ఎంచుతాడు. ఈమే ఈ విషయానికి ఉజ్వలమైన ఉదాహరణం. లిచ్ఛవీయకు వందనం. ఆత్మ బలి ఇచ్చే నేటి లిచవీయ కుమారికి వందనం.' ఇలా అని అభయుడు వ్యాసపీఠం నుండి కిందికి దిగి పాలి దగ్గరికి వెళ్ళాడు. నగర శ్రేష్ఠి ఆర్ద్రనేత్రాలతో, నవ్వు ముఖంతో విధి పూర్వకంగా మాట్లాడ్డానికి కొన్ని, సూత్రాలు చదివాడు. కాని అంతకంటె అధికంగా మాట్లాడలేదు. అప్పుడు తుది వాక్యం అభయుడన్నాడు-- 'పాలీ, నీ మనస్సు ఇంకా చంచలంగా ఉంటే వైశాలి విడిచి వనవాసం చేయవచ్చని పరిషత్తు ప్రశ్నిస్తోంది.'

'విచలిత మనస్కుడైన లిచ్ఛవీయుడు మన్నింపబడడని ప్రవేణి పుస్తకం విధిస్తోంది. నేను లిచ్ఛవీయను' అని పాలి శాంతంగా అంది.

'మార్పునకు ముందు ఏదైనా కోరిక అసంపూర్ణంగా ఉంటే పరిషత్తు దాన్ని పూర్తి చేసుకోనివ్వడానికి సిద్ధంగా ఉంది' అని గాయపడ్డట్టు అవమాన భావాన్ననుభవించి అభయుడు మళ్ళీ అన్నాడు.

పాలి కొంచెం ఆగి, కొంచెం ఆలోచించి అంది—


'నాకు ఏ కోరికా అసంపూర్ణంగా లేదు.'

'పరిషత్తు నిర్ణయాన్ని నీవు ప్రసన్నతతో స్వీకరిస్తావా లేక అప్రసన్నురాలవై స్వీకరిస్తావా?'

'ప్రతి లిచ్ఛవీయుడూ పరిషత్తు నిర్ణయాన్ని అనుకరించడం నేనెరుగుదును. ఇందులో ఆంతరిక సుఖదుఃఖాల ప్రశ్నేలేదు.'

చివరికి అభయుడు ఇటూ అటూ దృష్టి సారించి రాజులు, రాజ ప్రతినిధులు, అనుభవనీయులు అయిన యోధుల వేపు చూచి అడిగాడు— 'పరిషత్తు ఈ విషయంలో ఇంకా ఏమైనా చెప్పగోరుతుందా? పరిషత్తుకు సంతోషమేనా?'

పై ప్రశ్న అభయుడు మూడుసార్లు



అడిగాడు. పరిషత్తు మాట్లాడకపోవడం, చూచి ఆమ్రపాలిని దేశనర్తకిగా ప్రకటించాడు. శంఖా నాదమైంది. పరిషత్తు నిలబడి పాలిని సత్కరించింది.

అభయుడు తిరిగి వ్యాసపీఠం దిగి పాలి దగ్గరికి వచ్చాడు. ఆమె చెయ్యిపట్టుకొని రేణుకను పిలిచి అన్నాడు. 'వైశాలీ నగరపు శ్రేష్ఠ వారాంగనా, పవిత్ర ప్రవేణి పుస్తకం ఆజ్ఞానుసారంపూజనీయయునూ,వందనీయయునూ, అయిన పరిషత్తు నేటి నుండి ఆమ్రపాలిని నీ కప్పగిస్తుంది. నీ తరవాత వైశాలీ దేశ నర్తకి పదవి ఈమెకు లభించుగాక! ఈమె లిచ్ఛవీయ యోధులకు ప్రేరణామూర్తి అయి, స్వదేశ సేవ చేస్తూ, అంతానికి పిత్రులోకంలో విలీనమయ్యే లాగ నీవు ఈమెను సమస్త కళలందూ నిపుణురాలిని చెయ్యి.'

ఇలా అని అభయుడు ఆమ్రపాలి హస్తాన్ని రేణుక హస్తంలో ఉంచాడు. రేణుక పాలిని తన వైపుకు లాక్కుంది. సభలో నిశ్శబ్దం ఆవరించింది. అప్పుడు ఇటూ అటూ చూశాక ఆనందుడు అక్కడ లేడని పాలికి తెలిసింది.

సభను రంజింప జేయడానికి వృద్ధ రేణుక నృత్యానికై నిల్చుంది. ప్రేక్షకులందరూ ఏమి జరిగిందో విచారించడానికి బదులు ఏమి జరుగుతూన్నదో చూడ్డానికి ఉత్సాహం చూపారు.

సభ ముగియగానే పాలి రేణుకను తీసుకొని తన ప్రాసాదానికి వచ్చింది. అప్పుడు రాత్రి అయింది. ద్వారంలో ప్రవేశించగానే వ్యాకులపడిన దానిలా రేవా నడిగింది. 'సోదరు డెక్కడున్నాడు రేవా? శయన గృహము లోనా?' ఇలా అని రేణుక చెయ్యి వదలి పాలి శయనగృహం వేపు పరుగెత్తింది. శయనాగారంలో నగరశ్రేష్ఠి, అభిరాముడూ నిలబడ్డారు.

'తాతా, సోదరు డెక్కడ?'

'ధైర్యంగా ఉండు, అమ్మాయీ.'

'తాతా, సోదరు డెక్కడి కెళ్ళాడు?, ఏమైంది? త్వరగా చెప్పు, తాతా.'

'నీ సోదరుడు ఇక్కడలేడు. తిరిగి ఎన్నడూ రాడు.'

'ఎందుచేత?... నేనీ మహాలునకు వచ్చినందుకా?...తాతా, నేను అతనినుండీ, మీ అందరి నుండీ ఆశీర్వచనం పొందడానికి, వచ్చాను. తరవాత నేనొక్క క్షణమైనా ఇక్కడ నిలవను... కాని, అతడెక్కడికి పోయాడు?'

ఆమ్రపాలి

'అమ్మాయీ.' నగరశ్రేష్ఠి కష్టంతో అన్నాడు. 'ఆనందుడు తన స్థిరచరాస్తి నంతా నీ వశం చేశాడు. ఈ మహలిప్పుడు నీది.'

'తాతా, నాకేమీ అర్థ మవడంలేదు. నేను మూర్ఖురాల్ని. దుఃఖితను. నాకు నిజం చెప్పు.'

'పుత్రీ, ఆనందుడు సంసారాన్ని త్యజించాడు.'

'తాతా' అని పాలి కరుణార్ద్రమై కేక వేసింది. ఆమె నిలవ లేకపోయింది. అభిరాముడు ఆమె దగ్గర కూర్చుండి చెప్ప సాగాడు. 'అమ్మాయీ, అతడు వేదాంతితో గౌతమబుద్ధుని సంఘంలో శ్రమణు డవడానికి వెళ్ళిపోయాడు. అతణ్ణి వెన్నంటడం గాని, ఆపడంగాని నిరర్థకం. ఈ భోజ పత్రం చదువు.'

పాలి వృద్ధుని హస్తం నుంచి భోజ పత్రం తీసుకొని చదవసాగింది. అందులో పాలి కోసం అంతిమ ఆశీర్వాదముంది. ఆమె కళ్ళ నుండి అశ్రుధార ప్రవహింప సాగింది.

అభిరాముడూ, నగరశ్రేష్ఠి వెలుపలికి వెళ్ళారు. రేవా మాత్రం పాలి పాదాల దగ్గరకు వెళ్ళి కూర్చుంది. నేడు ఆమె కూడా విలపిస్తోంది. అక్కడ ఏడవకుండా ఉన్న వ్యక్తి ఒక్కతే, ఆమె దాసీ భద్ర.

* * *

మహారాజు కిలకిల నవ్వాడు. 'సంజయా, నీవు చెప్తే ఆమె మీద ఒట్టు పెట్టుకుంటాను అని మహారాజు బిగ్గరగా నవ్వాడు. అతనికి మతిపోయిందేమో అని నాకు భయం వేసింది. కాని లేదు. అతని కేమాత్రం మతి చెడలేదు. అతడెప్పటి లాగే ఉన్నాడు...సంజయా మహారాజు స్వస్థుడయ్యాడు.'

'మహారాజుకి నిజంగా మతి చెడితే బాగుండును' అని సంజయుడు బ్రహ్మదత్తుని వైపు చూడకుండానే అన్నాడు.

'సంజయా, నీవూ పిచ్చివాడవైనట్లు తోస్తూంది. మహామంత్రి పదవి నీకు లభింప గానే నీకు బుద్ధి జాడ్యం తప్పకుండా కలుగుతుందని నాకు మొదటి నుండీ నమ్మకముంది. అట్లే జరిగింది కూడాను. నీ బుద్ధి సరిగా లేదు.'

'బ్రహ్మదత్తా, నీ దొకమాట నిజం.'

'నా మాటలన్నీ నిజమే అవుతాయి. కాని మీరంతా నన్ను ఎగతాళి చేస్తారు.'

'మహారాజింకా అలాగే ఉండడం చూచి నాకు భయం వేస్తోంది. బ్రహ్మదత్తా, ఆమ్రపాలిని జయించడానికి వెళ్ళి అతడే స్వయంగా ఓడిపోయాడు. ఇప్పుడా ఓటమే అతని ఈర్ష్యకు కారణమవుతోంది.'

'సంజయా, ఒకటీ ఒకటీ రెండు అవుతుందన్న స్పష్టమైన లెక్క మాత్రమే నే నెరుగుదును. మహారాజిక్కడికి వచ్చి రెండు నెలలైంది. ఈ రెండు మాసములూ అతడు త్రాగిన మత్తులో గడిపాడు. రాణులూ, నర్తకురాండ్రూ అతన్ని ఆనందపరచడాని కెంతో యత్నించారు. కాని అతడు తన పవి మానలేదు. అతని ధర్మగురువు గౌతమముని కూడా అతని మనస్సును ఆమ్రపాలి నుండి మరల్చ లేకపోయాడు. కాని, ఈ బ్రహ్మదత్తుడు— ఎవని ప్రతిమాటలోనూ నీకు వ్యర్థప్రలాపమూ, భీతి అనే గంధమూ పొడకడతాయో— ఈ రోజు ఒక్కటే మాట చేత మహారాజును నవ్వించాడు. విన్నావా సంజయా? రెండు నెలలైన తరవాత మొదటిసారిగ నేను అతని దుఃఖాన్నీ, క్లేశాన్నీ, నీరసాన్నీ, శోకాన్నీ పొగొట్టి నవ్వించాను. ఎలాగ అని అడుగు.'

'ఎప్పటిలాగ నేడు కూడా రేవా ప్రసంగం చేసి ఉంటావు.'

'చనిపోయేటప్పుడు స్వర్గస్థుడైన మహామంత్రి తన సర్వజ్ఞతను నీకు వశపరచాడని నేనెరుగుదును. ఏమైనాగానీ, నేనతణ్ణి నవ్వించాను గదా!'

'బ్రహ్మదత్తా, మహారాజు నవ్వు మనకు సంతోషదాయకంకాదు, భయంకరం. అతని ఆహాసం వెనక గంభీరాఘాతం దాగి ఉంది. అది నశింపబడదు.'

'రాత్రింబగళ్ళు అతడు 'వైశాలి', 'లిచ్ఛవీయులు', 'ఆమ్రపాలి' అను నామాలు ఉచ్చరించడంలో తగుల్కొన్నాడు. ఆ ఆఘాతం క్రోధరూపం ధరిస్తే బాగుండును. కాని ఇప్పుడది ఈర్ష్యగా మారింది. శత్రుత్వం ఈర్ష్యగా మారి అంతిమ స్థితికి చేరింది. నేను మహారాజును చక్కగా గుర్తిస్తాను. బ్రహ్మదత్తా, అతడు స్వస్థుడవడం కష్టం.'

'సంజయా, నన్నొక విషయం ఎప్పుడూ విస్మితుణ్ణి చేస్తుంది. పాలిలో రూపం కాక మరేముందని నా ప్రశ్న. ఏమీ లేదు. నీ వడిగితే రాజగృహం నుండే ఆమె కంటె బుద్ధిమంతురాలైన స్త్రీని కావలసి వచ్చినప్పుడు తీసుకోరాగలను.'


'నీవు దీన్ని ఒప్పుకుంటావా?'

'నేను ఒప్పుకుంటూనే ఉన్నాను. కాని

ఇప్పుడు ప్రెస్టీజ్
హై-డోమ్ మరియు మోడల్ '77'
ఎక్కువ సౌకర్యాలతో లభిస్తూంది

Prestige

మలభంగా చేతికి పరివడి పట్టుకొనుటకు ఒకదానిలో మరొకటి అమర్చబడిన బాడీ పిడులు త్రుప్పు పట్టకుండా క్రొత్తవిగా ఉండే అల్యూమినియం స్క్రూలు.




ఇదివరకుండే ముక్కోణాకారపు గిన్నెల దొంతరకు బదులుగా హై-డోమ్‌లో 3, మోడల్ '77'లో 2 చదునైన గుండ్రని గిన్నెలు ఏర్పాటయ్యాయి. ఇది ఒక పెద్ద క్రొత్త సౌకర్యము.


ఎత్తడానికి, ఉపయోగించడానికి సౌలభ్యంగా అనువైన పిడి. వేడి వెక్కదు. పట్టు సౌలభ్యంగా ఉంటుంది.

ప్రెస్టీజ్

అన్ని విషయాలా, ప్రెస్టీజ్ మిమ్మల్ని తృప్తిపరుస్తుంది ఎప్పటికంటె అధికంగా ప్రెస్టీజ్‌నే వాడుతారు, జీవితాంతం ఉపయోగ పడుతుంది.



'సీనియర్'



మోడల్ 77

తయారుచేయువారు: టి. టి.(ప్రైవేట్)లిమిటెడ్ బెంగళూరు-16. ప్రెస్టీజ్ గ్రూప్ లిమిటెడ్, లండన్ వారి లైసెన్సుతో

JWT/TTP 3063

ఒక్కనాడు నా యీమాట మీరంతా ఒప్పుకోవలసి వస్తుంది. కొంచె మాలోచిస్తే తేలిపోతుంది. ఒకవైపు చక్రవర్తిని పదవి, వరశ్రేష్ఠుడైన భర్త, సమస్త దేశోద్ధరణం మరోవైపు, లిచ్ఛవీయ సంఘ నికృష్ట నిబంధనాలు, నికృష్టమైన ఇచ్ఛకం, అన్యాయం కబళింపబడ్డ జీవనం ఐనా పాలి రెండవ విషయాన్నే అధికంగా ప్రేమించిందంటే ఏం తెలుస్తోంది? నేను ఒకటి ఒకటి రెండు అన్న లెక్కప్రకారం అడుగుతున్నాను.'

'నేనూ రెండు నెలల నుండి ఈ ప్రశ్నే అడుగుతున్నాను. కాని జవాబు లభించడం లేదు.'

'ఎలా లభిస్తుంది? నన్నడిగితే కదా? బాబూ.

ఒక్కవిషయం ఎప్పుడూ జ్ఞాపకముంచుకో. ప్రకృతి సౌందర్యం ఎక్కడ నుండి ప్రకటంగా తోస్తోందో, అక్కడ నుండి బుద్ధిని చాలాదూరం ఉంచింది. ఇందువల్లనే ప్రపంచంలోని అందమైన వస్తువులన్నీ మౌఢ్యం, ఈర్ష్యతో కూడి ఉన్నట్లు అగుపిస్తున్నాయి. సంజయా, పాలి సుందరియైనా బుద్ధిమంతురాలు కాదు. దీని అర్థం ఆమె అసూయగలదనే... పాలి చేపట్టిన మార్గం దీన్నే చెప్తోంది.''

'నా మనసీ విషయం ఒప్పుకోడంలేదు.'

'నీ మనస్సు నా మాట లన్నింటినీ నిషేధిస్తుంది.

ఏ మాలోచిస్తున్నావు? ...నిజం చెప్తున్నాను, పాలి బుద్ధిమంతురాలు కాదు.'

'ఆమె విదుషి కాకున్నా, యోచన కలది. కాని ఆమె అద్భుతాన్ని కలిగించేదన్న దని మాత్రం చెప్పక తప్పదు. కాదామె వీరాంగన.'

'వైశాలిలోని ప్రతివస్తువుపై నీకెంతో ప్రేమ. అక్కడి నల్లకుక్క కూడా నీకు అందంగా ఉంటుంది. పాలి వీరాంగనా? మునిగి చావడానికి ఆమెకు నుయ్యి దొరకలేదా? గంగ కన్పించలేదా? శస్త్రాస్త్ర పారంగత ఐ కూడా ఆ వీరాంగన చేత ఆత్మవధ చేయబడలేదు. చేసేది లేక ఆమె నర్తకి అయిందా?... కాని మహామంత్రీ, నిజమేమంటే, ఈ లిచ్ఛవీయ గణాలు అధర్మమైనవి. ఈ అధర్మపరులలో జన్మించు కన్య ఎన్నటికీ అద్భుతవీరాంగన కాలేదు. తెలిసిందా?'


'కాదు, బ్రహ్మదత్తా కాదు. నా మనస్సు ఈ మాట ఒప్పుకోలేదు.'

అవును . మహాశయా, నే నెప్పుడు కాదన్నాను. నీ మనస్సు ఎప్పుడైనా నా మాట నంగీకరించడానికి సిద్ధపడిందా?..కాని విను. నేడు రాజు నవ్వడం చేత నాకు శాంతి కలిగింది. అతడు పాలితో పాటు వైశాలిని కూడా మరచే డన్నమాట. నిశ్చితమయింది. రేపు మహారాజు స్వయంగా జీవన కుమార భృత్యునితో కూడా గౌతమ ముని ఆశ్రమానికి అతణ్ణి చూడడానికి వెడతాడు. ఇప్పుడు నమ్మకమయిందా?'

'లేదు' అని సంజయు డన్నాడు.

బ్రహ్మదత్తుడు కోపగించి అక్కడనుండి పోసాగాడు. సంజయుడేదో ఆలోచిస్తూ అతణ్ణి చూస్తున్నాడు.

(సశేషం)





వైజ్ఞానిక గాథావళి - 74

జ్వరకారకాపరాధ పరిశోధన

- రాజ్‌శేఖర్ -

రోజు విడిచి రోజు మధ్యాహ్నము తీవ్రమైన జ్వరం. తరవాత చెమట పట్టుతుంది. మర్నాటి ఉదయానికి జ్వరం ఉండదు, నీరసముతప్ప. మధ్యాహ్నానికి మళ్లీ తయారు జ్వరం. జ్వరమున్నప్పుడు విపరీతమైన వణుకు, పొరలు, పొరలు, తెరలు, తెరలుగా. దుప్పటులు కప్పి పట్టుకున్నా ఆగదు. ఈ జ్వరాన్ని కలిగించేది ఎవరు? అని రోనల్డ్ రాస్ పరిశోధించాడు. కొండలూ, అడవులూ కిక్కిరిసి వున్నచోటికి వెళ్లి కొన్నాళ్లుంటే వచ్చేది ఈ జ్వరం కనక దీనిని 'మన్యపు' జ్వరమన్నారూ అక్కడి చలి గాలీ, నిలవ నీరూ ఈ జ్వరానికి కారణమన్నారు కాని మేన్సన్ అనే డాక్టరు ఫార్మోజా దీవిలో పని చేస్తూ బోదకాలూ బోద జ్వరమూతో బాధపడుతున్న రోగిని కుట్టిన దోమలను కోసిచూసి, ''దోమల నెత్తురులో బోద జ్వర రోగి నెత్తురులోవున్న సూక్ష్మ క్రిములున్నాయి'' అని ప్రకటించగా చూసిన ఫ్రెంచి డాక్టరు ఈ చలి జ్వరమునూ దోమల వల్లనే వ్యాపిస్తోందన్నాడు. కాని ('నీలాంబరి') నవలలో మొబారకువీధి అనుమానంలాంటిదే ఇది. అరిందముడైతే కథ వినగానే చీటీమీదనే హంతకుడి పేరు వ్రాసిపెట్టి తాళము వేశాడుగాని దేవేంద్రుడికి సాక్ష్యము కావద్దా? ఈ చలి జ్వరము కేసులో రోనాల్డు రాసు పరిస్థితీ అంతే అయింది లండను వెళ్లినప్పుడు మేన్సనును చూచాడూ ఆయన చెప్పినది విని భారతదేశము చేరినతర్వాత సికింద్రాబాదులో పరిశోధన ప్రారంభించాడు.


మొదట చేయగలిగినది మేన్సను సాధించినట్టిది. చలి జ్వర రోగులను కుట్టిన దోమలను పరిశోధించడము. కుట్టిన కొన్ని దినాలవరకూనైనా, ఆ దోమల నెత్తురులో జీవించివున్న ఈ మలేరియా క్రిములు ఉండాలిగదా? వందలాది దోమలనుపట్టి చీల్చి పరిశోధించినా ఆ క్రిమి వాటి శరీరములో బ్రతికి వృద్ధిపొంది కనబడలేదు. మేన్సను, ఈ 'మలేరియా' దోమలు నివాసముండే నీటిని త్రాగినవారికి మలేరియా వస్తుందని అనుమానపడ్డాడు. పశ్చిమ గోదావరి అచంట వాసులకు బోదకాలు ఆ వూరి నీటివల్లనే అనీ, విజయనగరము వారికి నరుక్కాయలు వల్ల అని నమ్మకాలు నేటికీ ఉన్నాయే! నాటి నమ్మకాలకు ఆశ్చర్యమేల?

రోనాల్డు, మలేరియా రోగిని కుట్టిన దోమల్ని కొంచెము నీరుపోసిన గాజు సీసాలలోబంధించివుంచాడు. ఆ దోమలు గుడ్లుపెట్టేయీ, కొంతకాలానికి చచ్చిపోయాయి. వాటిని తీసేసి ఆ గుడ్లతో పాటు ఆ నీటిని ముగ్గురు యువకులకు త్రాగబెట్టాడు ఒక్కతను కొంచెం జ్వరపడ్డాడుగాని ఆస్థితిలో అతని నెత్తురులో మలేరియా క్రిములు లేవూ, తక్కిన ఇద్దరికీ జ్వరమురానేలేదు!

''ఏ దోమవల్ల వ్యాపిస్తుందీ జ్వరమూ?'' అన్న ప్రశ్నతట్టింది రోనాల్డుకి. రక రకాల దోమల్ని పట్టి తేవడానికి మనుష్యుల్ని పెట్టాడు. ఒకనాడు రెక్కమీద మూడు నల్లగీతలూ గుండ్రని చుక్కలూవున్న బూడిదరంగు దోమల్నితెచ్చాడు ఒక మనిషి. వాటిచేత మలేరియా రోగినికుట్టించి, వాటిని ఆ తరవాత ఛేదించి మైక్రాస్కోపుకిందచూచాడు. సికింద్రాబాదు వేడి, తుప్పుపట్టిన స్క్రూళ్ల మైక్రాస్కోపు, బీటవారిన భూతఅద్దాలు, చూసిచూసి నొప్పులెత్తిన కళ్ళు, నానా అవస్థలూ పడ్డాడు రాస్.

16–8–1897 నాడు మలేరియా రోగిని కుట్టించిన దోమల్ని 20 వ తారీఖున చీల్చిచూశాడు రాస్. కొన్నిటిలో ఆ క్రిమి కనబడలేదు. ఇంకొకదోమ అవయవాలన్నిటినీ వెతికి అలసి చివ్వర దాని కడుపు ఛేదించి వెతకడము ఆరంభించాడు. చిన్న వర్తులాకార జీవకణాలు—కొత్త!—కనబడ్డాయి. వాటిలో మలేరియా క్రిములవంటి కణాలు గోచరించాయి. ఒకటే రెండూకాదు. ఆ జీవకణాలు డజనుండు! మలేరియారోగి నెత్తురును పీల్చిన దోమ కడుపులో వృద్ధి అవుతూన్న మలేరియా క్రిముల్ని చూచాడు రోనాల్డురాస్. మర్నాడు మిగిలివున్న ఒక్క దోమనీ చీల్చి పరిశీలించాడు. దాని కడుపులోనూ వుండినాయి మలేరియాక్రిములూ మునపటి వాటికంటే పెద్దవి! ఇంకా పెరిగేయి అన్నమాట. మలేరియా క్రిమిని నెత్తురుతోపాటు పీల్చేదోమ ఎనాఫలీసు దోమ. దాని కడుపులో పెరుగుతుంది మలేరియా క్రిమి.

తరవాత కలకత్తా చేరి, కాటుక పిట్టల్నిపట్టించి వాటికి రోగము కలిగించి వాటిని ఎనాఫలీసు దోమ లచే కుట్టించి, వీటిద్వారా రోగ కారకక్రిముల్ని అనేకంగా సృష్టించాడు రాస్. తాను కనుక్కున్న సంగతులన్నీ మేన్సన్‌కి వ్రాశాడు. మలేరియా క్రిములు ఆ రోగమువల్ల బాధపడే రోగి రక్తముద్వారా ఎనాఫలీసు దోమ కడుపులోకి వెళ్లి, అక్కడ వృద్ధిఅయి దాని నోటికడనుండే 'ఒట్టేసూదుల' ద్వారా ఆరోగ్యవంతుని నెత్తురులో ప్రవేశించి, సంఖ్య పెరిగి, అక్కడ ఆరోగాన్ని కలిగిస్తాయని రోనాల్డ్‌రాస్ నిరూపించాడు. మేన్సన్ కొడుకూ, ఇంకొక యువకుడూ ఆ దోమలకాట్లకు గురియై, మలేరియా తెచ్చుకుని, ఈ అపరాధ పరిశోధనలో చివ్వరిదశని పూర్తిచేశారు. ఈ శోధనలో 'హంతకుడు' తన నేరాన్ని ఒప్పుకోలేడు. పూర్తి సాక్ష్యాలతో ప్రతి అడుగూ నిరూపించాలి పరిశోధకుడూ. అలాగ నిరూపించాడని, రోనాల్డు రాస్‌కి 1902 లో నోబెలు బహుమానము ఇచ్చారు. ఈయన అడుగుజాడలోనే పసుపు జ్వరముకూడా దోమకాటువల్లనే వ్యాపిస్తుందని తెలుసుకున్నారు. ●





ఊరు సముద్రపుటొడ్డున, చీకటి కేకలు పెడుతున్నట్లుంది. గాలి కేకలు పెడుతుంది. చలికాలమైతే—ఇక వాతావరణ మంతా రొదపెడుతున్నట్లుంటుంది. పెద్ద పెద్ద ధైర్యవంతులే—ఇల్లు కదలటానికి భయ పడతారు.

రంగయ్య ధైర్యవంతుడు కాదు. ఆయన్ని ఎరిగినవాళ్ళు, పిరికివాడనే అనుకునేవాళ్ళు. బలిష్ఠమైన శరీరమైనాలేదు—కనీసం ధైర్యవంతుడుగా కనిపించటానికైనా. సన్నని చిన్నమనిషిమాత్రం. నల్లని సిరా రంగులో, చీకట్లో కలిసిపోయేలా ఉంటాడు. నడక కూడా, పిల్లిలా చడీ చప్పుడూ లేకుండా నడుస్తాడు.

వూరికి ఒక చివర అతని గుడిసెఉంది. దగ్గరగా చెట్లగుంపు. ఒకపక్కన సముద్రపు ఇసుక, రెండోవైపున గట్లమధ్య ప్రవహించే కాలువ. ఆ కాలువనే పైకి పోయినకొద్దీ—నది అంటారు—దానికిఅటు వైపున ఒక పెంకుటిల్లు—చిన్న స్కూలు బిల్డింగు. ఉప్పు, మత్స్య శాఖల వాళ్ళ ఒకటి రెండు బిల్డింగులు. నిర్మానుష్యమైన బీడు ప్రదేశం.

రాత్రి బాగా పొద్దుపోయింది. రెండు మూడుగంటల్లో దూరాన సముద్రముపైని ఆకాశంలో ఎర్రటి రేఖలు పొడచూపవచ్చు. వూరంతా నిద్ర పోతున్నది. రంగయ్య తన గుడిసె వెనకాల హో కోడిని చంపి, దాని ఈకలు అవీ పీకివేసి, ఒక గిన్నెలోవేసి, గుడిసెలోకి వస్తుంటే అతనిభార్య లేచింది.

"ఎక్కడినుంచి వస్తున్నావ్?" అన్నది ఆమె.

"ఎక్కడినుంచి వస్తున్నానేమిటి—అలా ఒకటికివెళ్ళి వస్తున్నాను"

"నాతోకూడా అబద్ధమేనా. వెళ్ళి గంటో రెండు గంటలో అయింది....

"అంటే నీ ఉద్దేశ్యం నేనే అడదాని వెనకో పడ్డాననా?"

"అదీ అయితే వూరుకునే దానినేమో! కాని ఈ దొంగతనాలుమటుకు నేను సహించ లేను. కోళ్ళో, చేపలో, బియ్యమో, గిన్నెలో ఏవో ఒకటి దొంగిలించటం జరుగుతుంది ఒకొకప్పుడు."

"లేకపోతే ఏం చేయను? ఈ ఊళ్ళో బాంకుగాని ఉందా—దోచటానికి. నోరు మూసుకో పిల్లలు లేస్తారు. నువ్వు అర్థం చేసుకోకపోతే, అడ్డంలేచి జాగ్రత్తగా ఉండు. ఈతడవ కనుక ఆ గిన్నెలో కోడిని బయట పారేసావంటే చర్మం వలుస్తాను" అని రంగయ్య భార్యను వో పక్కకునెట్టి లోపలికి వెళ్ళాడు. మూలమంచం వాల్చి, పాత చీర కప్పుకుని పడుకున్నాడు. లోని భార్య పక్క కొచ్చి కూర్చున్నది. పిల్లలు పక్కనే పడుకుని కలల ప్రపంచంలో తిరుగు తున్నారు. "ఉద్యోగం లేకపోతే—దొంగతనం

"చేయాలేమిటి?" అతని భార్య అంటున్నది.

"దొంగతనం చెయ్యకపోతే గాలి తిని నీళ్ళు తాగి బతుకుతామా? కడుపు నిండిన వాళ్ళు చెప్పొచ్చు ఎన్ని నీతులైనా—నువ్వూ వేసూనా? చెప్పినట్టు విని నిద్రపో. పొద్దున్నే లేచి కోడిని వండు. పిల్లలు తీసుకు వెళ్తారు స్కూలుకు. బియ్యం ఉన్నాయ్‌గా"

"నువ్వే చూడరాదూ — నన్నడుగుతా వెందుకు?"

"అర్థం చేసుకో—కోపగించి నందువల్ల లాభమేమీలేదు."

రంగయ్య కాళ్ళు సరిగా చాచుకు నిద్ర పోవటానికి ప్రయత్నం చేయటం మొదలు పెట్టాడు. నిద్ర రాలేదు. అలా అని దేన్ని గురించో ఆలోచించటమూ లేదు. ఉండి ఉండి తన పిల్లలవంక చూస్తున్నాడు—ఎవరైనా కోళ్ళను ఎత్తుకెళ్ళినట్టు వాళ్ళని ఎత్తుకెళతారేమో అన్నట్లు.

తెల్లవారినా, రంగయ్య ఆలస్యంగా లేచాడు. రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. ముఖం కడుక్కోవ టానికి బయటికివచ్చాడో లేదో—కాలవకట్టపక్కన చాలా మంది గుమికూడి ఉన్నారు. ఎంతమందో వూరంతా తనని చుట్టేసినట్లనిపించింది రంగయ్యకు. వూరి చౌధురి ఉన్నాడు వాళ్ళల్లో. ఏ కోటయ్య ఇంట్లో తను కోడిని దొంగతనం చేశాడో ఆ కోటయ్య కూడా ఉన్నాడు.

రంగయ్య తల తిరిగింది. పారి పోవా లనుకున్నాడు. అతను ఇంటివైపుకు తిరక్క ముందే కోటయ్య తాటాకుల దడిని నెట్టి వేసి రంగయ్యను గట్టిగా పట్టుకున్నాడు. అతను వణికిపోతున్నాడు. నోట మాటరావటం లేదు. గిన్నెలో పెట్టిన కోడి 'కూ కూ' అని సంతోషన్ని ప్రకటిస్తున్నట్లు అరవ సాగింది.

కోటయ్య రంగయ్యచేతిని చౌధురి చేతి పట్టుకిచ్చి, గిన్నె అడుగునుంచి కోడిని తియ్యటం మొదలెట్టాడు. కోడియీకలు లేవు. చూడటానికి ఎవరూ తమది అనే ట్లుగాలేదు. కాని దానికాలికున్న ఉంగరం చూస్తూనే కోటయ్య ముఖం సంతోషంతో వికసించింది! 'చూడండి చౌధురిగారూ ఇది నా కోడే—నే చెప్పలేదా? దానికాళ్ళకు ఉంగ రాలున్నై. ఉంగరాలమీద నా పేరు కూడా ఉంది. కావాలంటే మీరు చూడండి!'

రంగయ్యను కోస్తే నెత్తురు లేనట్లుగా ఉంది. ఈకలు పీకాక ఆ కోడి తనదవి చెప్పవచ్చనుకున్నాడు. రాత్రి చీకటిలో కోడి కాళ్ళకున్న ఉంగరాలు అతను చూడనే లేదు. ఇదొక కొత్త ఆపద—

కోటయ్యా, చౌధురి అతన్ని వేపచెట్టు దగ్గరకు లాక్కుపోయారు. ఎలా తెలి సిందో ఏమో వూరంతా అక్కడే చేరింది. ఆడా మగా, పిల్లా పాపా, ముసలీ ముతకా అందరూ. కోటయ్య రంగయ్యను ఒకసారి చెంపదెబ్బ కొడితే—ఒకసారి తన్నే వాడు. వూరు పోలీసు స్టేషనుమంచి చాలా దూరానవుంది. న్యాయపరిష్కారం జరగా లంటే—ఆ వూరివాళ్ళే తగిన శిక్ష విధిం చటం రివాజు. కొందరు ఆశ్చర్యపడితే మరికొందరు జాలిపడ్డారు. మరికొందరు నిప్పులు కక్కటం మొదలెట్టారు. "మా కోళ్ళన్నీ ఏమైనయ్యో అనుకున్నాం ఇప్పుడు తెలిసింది. గిన్నెలు కూడా వీడే కాజేసి ఉంటాడు. కొట్టండి వెధవను—" అనేవాళ్ళే ఎక్కువమంది ఉన్నారు.

రంగయ్య ఇంత ఘోరంగా ఎప్పుడూ ఎవ్వరినీ కొట్టలేదు. ఏ పిల్లవాడినీ కొట్ట లేదు.కొట్టటమైతే చాలామందిని కొట్టాడు. మా గట్టిగా దెబ్బలు మటుకుతిన్నాడు. బాగా బాధగాఉన్నా సిగ్గువల్ల ఏడవలేదు.

ఇంకా బాగా దెబ్బలు తగిలాక కొందరు స్త్రీ లన్నారు. "వదిలిపెట్టండి పాపం! కొట్టినంతమాత్రాన చచ్చిన కోళ్ళు తిరిగి రావుకదా?"

చౌధురి అన్నాడు. "పో! ఈ తడవకు వదిలిపెడుతున్నా. మళ్ళీ ఇలాటి దొంగతనం చేశావంటే వూళ్ళో ఇక బతకవు. చావ కొట్టి చెవులు మూస్తాం" అని రంగ య్యను ఒక తోపుతోసాడు. రంగయ్య కింద పడి మట్టి కరిచాడు. లేచి దుమ్ము దులుపు కుని కుంటుకుంటూ తన ఇంటివైపు నడిచాడు. అతని భార్య మొఖాన గుడ్డ కప్పు కుని అతనికి సాయంచేసి లోపలికి తీసుకు వెళ్ళసాగింది. అతని పిల్లలు నలుగురు అటూ యిటూ చూస్తూ, కాళ్ళు తొక్కు కుంటూ నడవసాగారు. తమ తండ్రినిర్దోషి అని వాళ్ళు అనుకోవటంలేదు. తండ్రాయె— మరి ఏమంటారు?

రంగయ్య ఇంటికి వెళ్ళి ఒకమూల పడుకున్నాడు. భార్య బయట తాటి చెట్టు చాటున కూర్చుని ఏడవడం మొదలు పెట్టింది. ఏ ముఖం పెట్టుకొని వూరి ఆడ వాళ్ళ ముందుకు వెళుతుంది?

రంగయ్య మటుకు సిగ్గు పడటం లేదు. కాని దెబ్బల బాధవల్ల మూలుగు తున్నాడు. దొంగతవాలకు దిగినప్పుడే ఈ రోజు ఎప్పుడో ఒకప్పుడు వొస్తుందని తెలిసిందే. తన భార్యా పిల్లలు ఏడ వటం— అతనికి గొంతు బిగిసినట్లని పించింది.

రంగయ్య వూళ్ళో పేరు ప్రతిష్ఠలతో చాలాకాలం నుంచి ఉన్న వ్యక్తి. దొంగ అని ఎవరూ ఎప్పుడూ అనుకోలేదు. ఏ వూళ్ళో ఐతే చాలా మంది విరుద్యో గులో అక్కడ సర్కారు నౌకరు రంగయ్య. వూరి చౌధురికే లేని గౌరవం ఒకొక్కప్పుడు రంగయ్యకు దొరికేది. ఇప్పుడదంతా గతించిన విషయం.

ఒకప్పుడు మత్స్యశాఖలో చౌకీదారు గౌరవమూ, విశ్రాంతులతో జీవితం గడుపుతుండే వాడు. అదృష్ట దేవతకు ఇదంతా నచ్చినట్లు లేదు. ఉద్యోగం పోవట మొకటి, పైపెచ్చు యీ దొంగ తన మొకటి. రంగయ్య మత్స్యశాఖలో చౌకీదారు. అంతకు ముందు అతని తండ్రి కూడా చౌకీదారే. బెస్తవాళ్ళల్లో, చౌకీదారు ఉద్యోగమైనా— మత్స్యశాఖలో ఉద్యోగం సంపాదించటం గొప్ప విషయం కింద లెక్క. రంగయ్య తన చుట్టాల చేత గౌరవంగా చూడబడే వాడు. ఉద్యోగం పోవటంతో వాళ్ళుకూడా రంగయ్యను చూస్తూనే ముఖం తిప్పేను కోవటం మొదలెట్టారు. ఇప్పుడు వాడు పాడా పుడిగా తిరగటం మొదలెట్టాడు.

ఈ నూరు మూల ప్రశాంతమైన ప్రదేశానికికూడా— ప్రశాంతంగా ఉండటం వల్ల ఆకర్షణ ఉండనే వుంది. సముద్రపు టొడ్డున ఉండటం వల్ల ఆకర్షణీయంగా కూడా ఉంటుంది. ఒక చిన్న బంగాళా ఏకాంతమైన ప్రదేశంలో ఉంది. చాటుగా మాటుగా సుఖం పొందాలంటే ఇంతకన్న మంచి ప్రదేశం ఎక్కడ దొరుకుతుంది?

ఈ ఏకాంతమైన ప్రదేశంలో లేకపోతే రంగయ్య ఇంకా ఉద్యోగంలోనే ఉండే వాడేమో. నమ్మకంగా తన పిల్లల పోషణ చేసు కుంటుండే వాడే.

ముందు కూడా ఎందరో పెద్ద పెద్ద ఆఫీసర్లు వచ్చి వెళుతుండే వాళ్ళు. వాళ్ళతోబాటు వాళ్ళ సామాన్లు వచ్చేవి, వంటవాడూ వచ్చేవాడు. రంగయ్యకు ఏవిధమైన కష్టమూ ఉండేది కాదు. వాళ్ళసేవలో రాత్రింబగళ్ళు పడుండే వాడు. ప్రభుత్వపు నౌకరి అంటే— ప్రభుత్వాధికారుల సేవే అనుకున్నట్లు.

* * *

గంజి-అన్నం

మూడు సంవత్సరాల క్రితం ఒక ఆఫీసరు వచ్చాడు: అంతే రంగయ్యకు ఆపత్తు వచ్చి పడింది. ఇప్పుడు కూడా అతని ఆలోచన రాగానే వణికి పోయే వాడు. పొట్టిగా నల్లగా, వికారంగా, కురూపంతో ఉండేవాడు. ఎంతో కురూపి, లేకివాడు, పిసినిగొట్టు— వయసు మధ్య వయసు—45 —46. ఇక ఎన్ని రకాల కోర్కెలనీ— చేష్టలనీ— భగవంతుడికే తెలియాలి.

ఒకరోజున జీపులో వచ్చాడు, సొంతంగా డ్రయివు చేసుకుంటూ. వింతైన ఆఫీసరు అనుకున్నాడు రంగయ్య. పకడ్ బందయిన మనిషి. అందువల్లే— వేళాపాళా లేకుండా ఒంటరిగా ఇన్స్పెక్షన్‌కు వస్తున్నాడు. తనలోనూ కొద్దో గొప్పో లోపాలుండటం వల్ల పరదా తెగి పోతే తనూ ఉపవాసాలు చెయ్య వలసి వస్తుంది గనుక అతన్ని సంతోషపెట్టటానికి రంగయ్య ప్రయత్నం ప్రారంభించాడు. ఆఫీసరు చిన్నవాడే అయినా అతని ధాటికి రంగయ్య చేతులు జోడించాల్సిందే.

ఆఫీసరు కోసం బంగళా ఖాళీగానే ఉంది. కొంచెంసేపు విశ్రాంతి తీసుకుని, నావలో షికారుకు బయలు దేరాడు. చూడటానికి ఎలా ఉన్నా మనిషి మటుకు పరదా పురుషుడల్లేనే ఉంది. అలాటి వాళ్లని సంతోషపెట్టటం తేలికని రంగయ్యకు తెలుసు. అందుకని రంగయ్యకు ధైర్యం కలిగింది. రంగయ్య నావలో కూర్చుని తెడ్డు వేస్తున్నాడు. ఆఫీసరుతోబాటు తానొక్కడే ఉండటంవల్ల అతనికి సంతోషమనిపించింది.

ఆఫీసరు చాలాసేపు నిశ్శబ్దంగానే ఉన్నాడు. నావ వడ్డుకు దగ్గరగా వస్తుండగా "ఇక్కడ తాగటానికి ఏమీ దొరకదా?" అన్నాడు.

రంగయ్యకు అర్థమైంది! "దొరుకు తుంది కాని— నాటుసరుకు."

"అయితే సరే— తెప్పించు— మరి..."

ఆఫీసరు ఎందుకో సంకోచించాడు.

రంగయ్య ఆఫీసరును సంతోషపెట్టాలనే ఉత్సుకతతో అన్నాడు "చేపలు అవీ తినటానికి అభ్యంతరం లేదుగా?"

"అబ్బే అదేం లేదయ్యా, అన్నీ తింటాను. చేపలూ, మాంసమూ— మరి...." నావను కడుతూ వెనక ఉండక పోతే ఆయన మాటల ఆంతర్యం రంగయ్య గ్రహించే వాడే.

నావ కట్టివేసి తన గుడిసెలోకి వెళ్లాడు. నాటుసారా సీసా ఒకటి తీసుకుని వినమ్రతతో ఆఫీసరుకి అందించి చేతులు నలుపు కుంటూ ఉండి పోయాడు. ఆ సీసా అతను ఆఫీసర్ల సంతోషం కోసమే అట్టే పెట్టాడు. సీసా యిచ్చి, అతను వంట వండటంలో మునిగి పోయాడు. ఎప్పుడైనా ఆఫీసర్లు వచ్చినప్పుడు వాళ్ల మంచి చెడ్డలు చూస్తుండే వాడు. వాళ్లు వెళ్లేటప్పుడు బోలెడు బక్షీష్ ఇచ్చి వెళ్లే వాళ్లు. అందువల్ల అతని సొంత డబ్బు ఖర్చు అయ్యేది కాదు.

సారా నిషా పూది, షికారు కోసమో, ప్రకృతిని పరికించటానికో సముద్రపు టొడ్డున పూళ్లో నడవటం మొదలు పెట్టాడు. ఆఫీసరు చేతులు వెనక్కి కట్టుకుని చురుకైన చూపులతో అటూ యిటూ చూస్తూ, మెల్లి మెల్లిగా అడుగులు వేస్తున్నాడు. చిరుత పులి వేటకు వెళుతున్నట్లు.

తిరిగి తిరిగి వచ్చి భోజనాలు పూర్తి చేసుకుని పొట్ట రుద్దుకుంటూ "నీ పేరేమిటి?" అన్నాడు.

"నాపేరాండీ?— రంగయ్య"

"సారా యిచ్చావు భోజనమూ పెట్టావు. మరి నాకు నిద్ర తేలిగ్గారాదు."

"విసనకర్రపెట్టి విసరనా? కాళ్లు పట్టనా?"

"నీ కన్నీ తెలుసనుకున్నాను. ఇంతేనా?"

"అయ్యా—"

"ఇక్కడ ఆటా పాటా చూపే ఆడ వాళ్లు లేరా?"

"లేరండీ—ఇది బెస్తల బస్తీ. చీకటి పడగానే ప్రజలు పడుకుంటారు. తెల్లవారు జామునేలేచి పనుల్లోకి వెళ్తారు. బీద వాళ్లం—మేము డాన్సూ గీన్సు మొదలెడితే రెండు రోజాలు తింటే ఎనిమిది రోజులు పస్తుండాలి."

ఇదివరకెవరూ రంగయ్యను ఇలాటి కోరిక కోరలేదు. పూళ్లో ముగ్గురు నలుగురు పిల్లలున్నారుకాని వాళ్ల తంటాలో పడితే పూళ్లో సంసారం గడపటం కష్టం. పైపెచ్చు యీ ఆఫీసర్లకేమైనా అయితే పైపెచ్చు అదొక తంటా—" రంగయ్య ఆలోచనలో పడ్డాడు. "సరే—అయితేవెళ్లు" ఆఫీసరు అన్నాడు. రంగయ్య వెళుతుండగానే ఆఫీసరు మళ్లీ పిలిచాడు.

"ఇదుగో—ఆ రావి చెట్టుకింది యింట్లో అందులో ఒక......" అని పెదవులు తడుపుకోసాగాడు.

"అదాండీ! అది చౌధురిగారిల్లు. ఆయన కో కూతురుంది. మంచిపిల్ల. చౌధురి జోలికి పోవటమే!—ఆయన కూతురి జోలికిపోయి—బ్రతికి బయట పడటం అనేదిలేదు." రంగయ్య ఉన్నది ఉన్నట్లుగా చెప్పాడు.

"అరే! నేనే మడిగాను? ఆ యిల్లెవరిదన్నా నంతే....." అని ఆఫీసరు రంగయ్యను పంపించివేశాడు.

రంగయ్యకు ఈ ఆఫీసరు వ్యవహారమేమీ అర్థం కావటంలేదు. ఇంతకుముందు ఎంతమంది ఆఫీసర్లకో సేవ చేశాడుగాని ఇది కొత్త అనుభవమైంది. ఆఫీసరు కోరికను తీర్చలేకపోయాననే అనే దుఃఖం అతనికి కలుగసాగింది. ఏం రాస్తాడో, ఈ వంశ పారంపర్యంగా వస్తున్న ఉద్యోగం పోతుందేమోనన్న భయం కూడా పట్టుకుంది.

ఆఫీసరు నిద్రపోయాడో లేదో తెలీదు. పొద్దున్నే రంగయ్య వెళ్లేటప్పటికి గదిలో లేడు. జీపు కూడాలేదు. ఎక్కడికివెళ్లాడో తెలీదు. ఎందుకు వెళ్లాడో తెలీదు. కోపం వచ్చిందేమో? రాత్రిపూట నిద్రపోతున్నావని తన మీద రిపోర్టు రాయడుకదా? చౌధురిగాని చంపించ లేదు కదా విషాలో మనిషి ఏం చేయడు గనుక? భగవంతుడా!" అనుకుని రంగయ్య తల గోక్కో సాగాడు.

పగలల్లా అతను ఆలోచనలో పడ్డాడు. ఏదో పోగొట్టుకున్నట్లు తిరగ సాగాడు. కొంతసేపు సముద్రపు టొడ్డుకు వెళితే, కొంతసేపు రోడ్డు మీద చాలా దూరం వరకూ నడిచి వెళ్లేవాడు. అయినా ఎక్కడా ఆఫీసరు కనుపించనేలేదు. అతని జీపు కనిపించనే లేదు. నిశ్శబ్దంగా ఉన్న ప్రదేశము, ఎవరైనా హత్య చేసినా పోలీసులకు తెలిసేటప్పటికి వారం పడుతుంది.

రంగయ్య ఆలోచన తెగేది కాదు కాని— సాయంత్రం జీపు తిరిగి వచ్చింది. దాన్ని చూస్తూనే రంగయ్య గట్టిగా గాలి పీల్చుకున్నాడు. ఆఫీసరు బతికే ఉన్నాడు. తనవల్ల నేరం ఏమీ జరగ లేదు. ఇక ఏమైనా కానీ —అనుకున్నాడు.

వావల్ల తప్పేమీ లేదు—లేకపోతే—ఆయన ఎందుకు తిరిగి వస్తాడు? నేనేం తప్పు చేసాను? ఎవతనీ పంపలేదని కోపగించుకోలేదు గదా? ఎంత సంతోషపెట్టినా— కొద్ది లోపమున్నా ఆఫీసర్లు కోపగించుకుంటారు. ఎంతైనా ఆఫీసర్లు."

ఆ ఆలోచన రంగయ్యను కాల్చివేస్తుండగానే జీప్ వచ్చి రెస్ట్ హవుస్ ముందు ఆగింది. రంగయ్య సమస్కరిస్తూ నిల్చుండి పోయాడు. బాణంలా వంగి పోయాడు, నమ్రతతో. సంతోషకరమైన విషయమేమిటంటే ఆ వచ్చినది ఆ ఆఫీసరే. ఇంకా సంతోషకరమైన విషయమేమిటంటే ఆయన తనతోబాటు వో పిల్లను కూడా తీసుకొచ్చాడు. ఆపిల్లకు పెద్ద వయసుండదు చక్కగా అలంకరించుకుని, అందంగా ఉంది. రంగయ్య ఆయన ఉద్దేశ్యం గ్రహించ గలడు.

"ఏం వావ తయారుగా ఉందా?" ఆఫీసరు అడిగాడు.

"అయ్యా!"

"వూ—!" ఆ ఆఫీసరు ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని చిరునవ్వు నవ్వుతూ, పెద్ద పెద్ద అడుగులతో నావ వైపు వెళ్లసాగాడు. రంగయ్య వాళ్లకన్నా ముందు పరుగెత్తాడు. వాళ్లు రాక ముందే నావను ఒడ్డుదగ్గరకు లాగాడు.

"నువ్వు రావాల్సిన అవసరం లేదు. నువ్విక్కడే ఉండు" ఆఫీసరు నావలో అడుగు పెడుతూ అన్నాడు. వాళ్లు విశ్రాంతిగా నావలో కూర్చున్నాక "మేము రెండు మూడు గంటల్లో తిరిగి వస్తాం" అప్పటికి భోజనానికి ఏర్పాట్లు చేసి ఉంచు. కోళ్లూ అవీ దొరుకుతాయ్‌గా వూళ్లో— ఏం?"

అతనే కనుక ఆఫీసరు కాకపోతే "ఇక్కడ దొరకని వస్తువును పట్నం నుంచి తెచ్చుకున్నారుగా?" అనే వాడే రంగయ్య.

"అలాగే సాబ్"— అన్నాడు రంగయ్య.

ఆఫీసరు తెడ్డు వేస్తూ వావను పోనిచ్చాడు.

నిన్న ఏర్పాటు చేసిన భోజనానికే రంగయ్యకు డబ్బులు దొరక లేదు. ఈ చిన్న నౌకరీ వల్లే తన పెద్ద కుటుంబం గడుస్తున్నది. వూళ్లో కోళ్లయితే ఉన్నై కాని వాటి నెవరూ వూరికే యివ్వరు. అతని దగ్గర పైకం లేదు. ఆఫీసరు ఇవ్వనూ లేదు. ఆయన కోసం భోజనం తయారు చేయకుండానూ ఉండ లేడు. ఈ చిన్న విషయమైనా అతనికి పెద్ద సమస్య అయి కూర్చుంది.

చివరకు చౌధురి దగ్గరకు వెళ్లాడు. ఆఫీసరు కోసమని ఒక కోడిని తెచ్చాడు. ఇంటి నుంచి మసాలా, బియ్యమూను. ఆఫీసరు కోసం వంట వండటం మొదలు పెట్టాడు. ఇంట్లో ఉప్పయినా నూరని రంగయ్య వంట వండ సాగాడు. ఆఫీసరు కమ్మంటే స్త్రీగా మారటానికైనా తయారుగా ఉన్నాడు.

షికారు చేసి ఆఫీసరు ఆపిల్లతో సహా వచ్చాడు. భోజనం తయారుగానే ఉంది. తిని హాయిగా రెస్ట్ హవుస్ ముందు కుర్చీలు వేసుకు వాళ్లుమాటల్లో పడ్డారు. ఇంకేం కావాలో అని రంగయ్య ఇంకా నిల్చునే ఉన్నాడు.

"సరే, ఇక నువ్వెళ్లు. మేముండనే ఉన్నాం. నువ్వుండాల్సిన అవసరం లేదు." అన్నాడు ఆఫీసరు.

రంగయ్య దణ్ణం పెట్టి బయలు దేరాడు ఇంటికి వచ్చేటప్పటికి భార్య పిల్లల మీద విరుచుకు పడింది— తనూ ఆఫీసరు మాదిరిగా ఎవరి మీదో ఒకరి మీద అధికారం చలాయించగల దన్నట్లు. భార్య వడ్డించింది. రంగయ్య తిని సుఖంగా నిద్ర పోయాడు. పొద్దున్నే రెస్ట్‌హవుస్ దగ్గరకు వెళ్లేటప్పటికి జీప్ లేదు. కాని రంగయ్య నిశ్చింతగానే ఉన్నాడు. ఆఫీసరు పద్ధతి ఇప్పుడిప్పుడే అతను అర్థం చేసుకోవటం మొదలెట్టాడు తిరిగి వెళ్ళుంటారు. కాని కోడికీ— గీడికీ డబ్బెవరిస్తారు? రెస్ట్ హవుస్ అద్దె ఇచ్చినా ఇవ్వక పోయినా ఆఫీసర్లాయె! రిజిష్టరులో పేరే రాయక పోతేసరి. అద్దె సంగతే రాదు. కాని డబ్బో? మంచి ఆఫీసరే— తింటున్నాడు తిరుగుతున్నాడు" మనసులోనే రంగయ్య అతన్ని తిట్ట సాగాడు.

ఎవరితోటన్నా అన్నా — అది మళ్లీ ఆఫీసరుకు తెలిస్తే అదొక ప్రమాదం రెస్ట్‌హవుస్ వరండాలోంచి వూరివైపు చూస్తూ ఉండి పోయాడు.

"ఇవాళ తిరిగి రాకపోతే! ఇంట్లో బియ్యం కూడా లేవు. నెలలో ఆఖరి వారం కూడాను. చౌధురి దగ్గర తప్పించి ఎవరి దగ్గర అంత డబ్బుంది, ఇంకొకళ్లకు అప్పు యివ్వటానికి. అడగటం ఎలా? తన పెళ్లాం ఎలాగో— పిల్లలకు అక్కడో ఇక్కడో తీసుకు తినిపిస్తుంది అని అతనికి తెలుసు. తనూ, భార్యా మటుకు పస్తుండాల్సొస్తుంది మరి. ఆఫీసరుకు అన్నం పెడితేచాలు, మాకు గంజి చాలు. తాము ఉపోషమున్నా— ఆఫీసరు సంతోష పడితే చాలు. ఎప్పుడో ఒక రోజు గడిచిన రోజుల్లో ఉన్న ఉపోషాలు మరిచి పోయేలాగా యిస్తారు. అని వూరట చెందాడు.

రెండు మూడు రోజుల తరువాత జీప్ దుమ్ము రేపుతూ మళ్లీ రావటం



"రాత్రి వర్షం ఏదీ పడ్లేదుగా— మరి ఏమిటీ ఈ నీళ్ళు??"

"ఈ సినిమా గొప్ప ట్రాజెడీనట. రాత్రి ఆటకు వచ్చిన జనం కన్నీళ్లని బక్కెట్లతో బయటికి తోడిపోస్తున్నారు!"

రంగయ్య చూశాడు. కొంచెం భయపడ్డాడు. రెండు మూడురోజుల క్రిందటేగా ఇన్‌స్పెక్షన్ అయింది. ఇప్పుడు మళ్ళీ ఆఫీసరు తిరిగి వస్తున్నాడు. ఎంతో ఆలోచించ గలిగాడు కాని ఆఫీసరుకు యీ ఏకాంత ప్రదేశము నచ్చిందని మటుకు గ్రహించలేక పోయాడు.

జీపు వచ్చింది. రంగయ్య చేతులు జోడించుకు నిల్చున్నాడు. అదే ఆఫీసరు, కాని వెంట వేరొక పిల్ల ఉంది. ఎవరిని తీసుకొస్తే నాకేం? అని జీపు వెనక వైపు చూడసాగాడు.

తినటానికీ తాగటానికి తీసుకొచ్చుకుంటే చాలు— కాని రంగయ్యకు అక్కడేమీ దొరక లేదు. రంగయ్యకు కష్టమని పించింది. తన ఆకలి తీరే రోజు యింకా రాలేదన్న మాట.

"ఇవాళ నాకు అక్కర్లేదు." ఆఫీసరు అన్నాడు.

"అయ్యా!"

"మేము సముద్రపు టొడ్డునె కూర్చుంటాం. ఇవాళ పౌర్ణమి కదూ?" అని ఆపిల్లను చూపిస్తూ చెప్పాడు ఆఫీసరు.

"అయ్యా!"

"నువ్వు భోజనానికి ఏర్పాట్లుచెయ్యి." ఆఫీసర్ అన్నాడు.

"అలాగే అయ్యా!" రంగయ్య కూడా అన్నాడు.

డబ్బు అడగటానికి అతనికి ధైర్యం చాల లేదు. అక్కడ నిల్చోనూ లేక పోయాడు. బయలు దేరాడు. కాని ఎక్కడి నుంచి భోజనం తెస్తాడు? చౌధురి కూడా రెండు సార్లు రెండు కోళ్ళిచ్చాడు— ఎంతవరకు ఇస్తాడు? అసలెందు కివ్వాలి? ఆయనకు ఇతగాడేమీ ఆఫీసరు కాడు. ఎవరినీ అడగనూ లేడు. తన కోడినే తెచ్చాడు. ఇంకొకరింట్లో నుంచి కొంచెం బియ్యమూను. భోజనం తయారు చేశాడు. వాళ్ళిద్దరూ సంతోషంగా భోజనం చేశారు.


"వెన్నెలగా ఉంది కదా— ఎవరొస్తారు ఇంటికి పోయి మజా చెయ్యి!" అని ఆఫీసరు అనగానే, ఎంత దయచూపించాడు ఆఫీసరు అనుకొన్నాడు రంగయ్య. ఆఫీసరుకు అక్కడికి రావటం ఒక అలవాటై పోయింది. సెలవు రోజైతే వచ్చేవాడు. ఒకొకప్పుడు ఇన్స్పెక్షన్

గంజి-అన్నం

పేరుతో వచ్చే వాడు. ఒకొకప్పుడు పూరికే షికారు కన్నట్లు వచ్చే వాడు. నెలకు పది పన్నెండు తడవలు వచ్చేవాడు— ఎప్పుడూ ఎవరో ఒక కొత్త పిల్లతో.

రంగయ్యకు ఇది కొత్త అనుభవం. ఎంతో కుతూహలం కలిగింది. ఒకసారి ఏదో పని మీద పట్నం వెళితే తెలిసింది ఆఫీసరుకు అంత మంచి పేరు లేదని, తిరుగు బోతు అని అందరూ అనుకుంటారని. ప్రపంచ మంతటీ ఖర్చూ— ఆయన నెత్తి నున్నదని. అతని చేతుల్లో డబ్బుల్లేక పోవటం. దానివల్ల ఇతరుల కొచ్చిన ఇక్కట్లు కూడా విన్నాడు. త్రాగుడూ, స్త్రీల మీద ఎంత డబ్బో ఖర్చయి పోతుందిట. ఇక ఒక్క పైసా మిగలదనీ విన్నాడు. అలవాటును వదుల్చుకోనూ లేడుట.

ఏమైనా కానీ రంగయ్య అతనివల్ల నాశనమై పోతున్నాడు. ఐదారు నెలల బట్టీ ఆయన వస్తూనే ఉన్నాడు. అప్పుడప్పుడు ఏదో పదో ఇస్తూనే ఉన్నాడు కాని ఖర్చు ఎప్పుడూ అంతకన్న ఎక్కువ గానే ఉండేది. అప్పుడప్పుడు తన డబ్బు పెడితే మరొకప్పుడు అప్పుతెచ్చేవాడు



కాని ఎంతకాలమని చేయ గలడు? ఆఫీసరుకు ఫిర్యాదు చెయ్యలేదు, ఉద్యోగమూ మాన లేదు. సరుకులు కొనటానికి డబ్బులు దొరకపోతే— రాత్రికి రాత్రి సరుకులు దొంగతనం చేయటం మొదలెట్టాడు. ఆఫీసరు తన దగ్గర మూరికే తీసుకుంటున్నాడు గనుక తనకూ వూళ్ళో వూరికే తీసుకొనే అధికారం ఉందన్నాడు. ప్రమాదకరమైన పనేకాని— చాలా తేలిక. రంగయ్య అలా దొంగ అయ్యాడు.

పట్నంలో పిల్లలు దొరకటం తగ్గిపోయుంటుందో, లేక ఆఫీసరు దగ్గర డబ్బులు పోయిందో, వూరి పిల్లతో రంగయ్య చూస్తుండగా మాటలు కలపబోయాడు. క్షణంలో వూళ్ళో వాళ్ళు వచ్చారు. అదృష్ట మేమంటే అప్పటికే ఆ పిల్ల వెళ్ళిపోయింది, కాని ఆఫీసరు రంగయ్యే వెళ్ళి వీళ్ళతో చెప్పాడని నమ్మాడు.

పది రోజుల్లో రంగయ్య ఉద్యోగం వూడి పోయినట్లు ఉత్తరం వచ్చింది. పట్నం ఆఫీసునుంచి చౌకీదారు పని సరిగా చేయటం లేదని ఆరోపణ కూడా ఉంది ఉత్తరంలో. బీదవాడికి కోపం వస్తే ఎవరి మీద చూపిస్తాడు? ఎంత చూపిస్తాడు. అతను పరుగెత్తి పట్నం వెళ్ళాడు. ఆఫీసరు కాళ్ళ మీదపడ్డాడు. కాని ఆయన గుండె కరుగ లేదు. తను అక్కడుండగానే రంగయ్య పని వదిలి ఇంటికి వెళ్ళాడని ఆఫీసరు అన్నాడు. తన పని మీదే రంగయ్య వెళ్ళాడని ఆయన మరిచి పోయి నట్లున్నాడు.

గంజి-అన్నం

అతన్ని సంతృప్తి పరచటానికి యింత ప్రయత్నం చేస్తే ఆఖరికి నౌకరీకి సైతం చేతులు కడుక్కోవలసి వచ్చింది. నౌకరీ ఉన్నా లేక పోయినా కుటుంబం గడవాలి కదా! రాబడి ఉన్నా లేక పోయినా పెళ్ళాం పిల్లలను పోషించాలిగా, మరి రంగయ్య దొంగతనం చేయటం నేర్చుకున్నాడు కదా! అతను దొంగతనంచేసి పెళ్ళాం— పిల్లలను పోషించ సాగాడు.

రంగయ్య మనసులో ముళ్ళలాగా యీ దృశ్యాలు లేవసాగినై. ఇక ఇప్పుడు ఏమౌతుందన్న ఆలోచన కూడా అతని మనసులో రేగింది. ఇక దొంగతనం చేసే మార్గం కూడా మూసివేయ బడింది. ఆ వూహా పోహల్లో బూచిలాగా ఆఫీసరు బొమ్మ కనుపించింది. అయనకు ఇంకా పెద్ద ఉద్యోగ మొచ్చిందిట. ఇంకాపెద్ద ఆఫీసరయ్యాడుట. నేను దొంగనయి కూడా ఇప్పుడు దొంగగా ఉండటానికి కూడా లేకుండా పోయింది. ఒకసారి దొంగగా నిర్ణయం జరిగాక యీ చిన్న పల్లెలో ఎవరిస్తారు యిక పని? మరి గడవటం ఎలా? అతను పడుకునే ఇదంతా ఆలోచిస్తున్నాడు ఇంతలో అతని భార్య వచ్చి లేపింది.

"ఎంకావాలో అద్దైంది. ఇక ఎంతసేపు పడుకుంటావు వేడి నీళ్ళు పెట్టాను. లేచి స్నానం చెయ్యి."

రంగయ్య ఆవలించి చెయ్యి పైకెత్తిన వాడు కాస్తా ఒక్కసారి వెనక్కిలాక్కున్నాడు. చెయ్యంతా నొప్పి పుట్టింది. నొప్పివల్ల ఆయాసపడసాగాడు. కన్నీళ్ళు ప్రవహించసాగినై. పక్కనే ఉన్న భార్య కూడా కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఏమంటుంది? అతనేం వింటాడు గనుకనా?

"చూశావా! ఇకనైనా తెలిసిందా? ఉపోషాలన్నా ఉందాం. వట్టు పెట్టుకో ఇక దొంగతనం చెయ్యనని.

బహుశ, త్వరలోనే యీ సంఘటన

"వట్టుపెట్టుకోవటం తేలికే— కాని మరేం తింటారు?"

"అయితే నువ్వు బాగుపడవా?" ఆమె కనుబొమ ఎగురవేసి అతనివంక దీర్ఘంగా చూస్తూ అన్నది. అతను పెదవులు తడుపుకుని తల అడ్డంగా తిప్పుతూ "ఉహూ" అన్నాడు. తడిసిన అతని పెదవులు, "నాకు గత్యంతరం లేదు. నా కింకే దారీతోచటం లేదు" అన్నట్లున్నై.

బహుశ, త్వరలోనే యీ సంఘటన మరిచిపోవటం జరిగింది. రంగయ్య తన వూళ్ళో మానేసి పొరుగూళ్ళల్లో దొంగతనం చెయ్యటం మొదలెట్టాడు. ఎప్పుడూ బియ్యమో, పప్పులో, పెరుగో, కోళ్ళో, అంతే ఎప్పుడూ పెద్ద దొంగతనం చెయ్యలేదు. అతను. దొంగని అందరికీ తెలుసు. చెడ్డపేరు ఏర్పడనే ఏర్పడింది. చెడ్డపేరు రావటం అతనికీ యిష్టంలేదు. కాని ఏం చేశేట్టు? పెళ్ళాం ఎన్నో చెప్పింది. కాని అతను బాగు పడడం మటుకు కనపడలేదు.

ఒకరోజు ఇంకో వూరునుంచి ఆలస్యంగావచ్చాడు. అప్పటికి పిల్లలు బడికి వెళ్ళిపోయారు. ఏమీ తినకుండా ఆకలి కడుపులతో. ఇంట్లో ఏమైనా ఉంటేగా తినటానికి? రంగయ్య తెచ్చాకనే బియ్యం ఉడికినై. పిల్లలు ఇంటికి రావటానికే వీలులేదు. రంగయ్య భార్య గిన్నెలో అన్నం పెట్టి పిల్లలకిచ్చి రమ్మని పంపింది. అతను చేతులు జాడించుకుంటూ స్కూలుకు వెళ్ళాడు. పిల్లలు అన్నాలు తింటున్నారు. తన పిల్లలుమటుకు స్తంభంపట్టుకు నిల్చుని ఎక్కడికో చూస్తున్నారు.

రంగయ్యను చూచి అతనిపిల్లలు దగ్గరకు రాలేదు. ఇతర పిల్లలు మటుకు తింటున్న అన్నాలు వదిలేసి "దొంగ, దొంగొచ్చాడు—లక్ష్మీ మీ నాన్న— మీ దొంగ నాన్న వచ్చాడు. రాము— మీ దొంగ నాన్న వచ్చాడు" పిల్లలందరూ కలిసి



అతని వెనుక గొడవ చేయసాగారు.

రంగయ్య వాళ్లను గద్దించనూలేడు. అతనేదైనా అంటే రాళ్లతో కొడతారు. అతను తన పిల్లల దగ్గరికి వెళ్లేటప్పటికి వాళ్ల వెనక చాలామంది పిల్లలుచేరారు. వాళ్లు అరవ సాగారు. అతని కూతురు నిల్చుని కన్నీళ్లు కారుస్తున్నది. అతని కొడుకు అతనికి కనపడకుండా వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అమాయకులైన ఆ పిల్లలు తనవల్ల అవమానం భరించవలసి వచ్చింది. రంగయ్యకు కూడా ఆసంగతి తెలుసు. తను వాళ్లకోసం దొంగతనం చేస్తుంటే—వాళ్లు తన వల్లబాధకు గురి కావలసి వస్తున్నది. పశ్చాత్తాపం కలిగి గిన్నె అక్కడేపెట్టి వెంటనే ఇంటికితిరిగివచ్చాడు.


సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చాక గిన్నెలోచూస్తే పొద్దునపెట్టిన అన్నం ఎలా పెట్టినది అలాగే ఉన్నది.

"ఎందుకు తినలేదు?" తల్లి అడిగింది.

"ఎలా తినం?" దొంగ వస్తువులు ఎలా తినం? అని చెప్పకుండానే రంగయ్య కూతురు చెప్పినట్లయింది. రంగయ్యకు ఆ పిల్లలను కొట్టాలనిపించింది. మరుక్షణం అతనికోపం చల్లబడింది. చౌధురి దెబ్బలు కొట్టి అతనిలో కలిగించలేనిది, భార్య ఎన్నో తడవలు పోరి పోరినా అతను ఏదైతే వదలలేదో, చెడ్డపేరు సైతం ఏ అలవాటును తప్పించలేకపోయిందో, అలాటిది నిశ్శబ్దంగా నిల్చున్న ఆ పిల్లలను చూచి ఆ అలవాటును అతను మానివేశాడు.

ఆ రాత్రి అతను విశ్రాంతిగా నిదురపోయాడు.

మర్నాడు యితర బెస్తవాళ్లతోబాటు సముద్రంలో చేపలు పట్టటానికి బయలుదేరాడు. ప్రక్కనున్నవాళ్లతో, "ఆ నౌకరీకి వెయ్యి దణ్ణాలులు. అది మనిషిని, కాకారాయుడిగానూ, నిలకడలేని కీలు బొమ్మగానూ చేస్తుంది. ఆ ఆఫీసరు, ఇతరుల డబ్బుతో మజా చేయటం నేర్పేవాడు. ఆ దొంగతనానికి వందనాలు. అది కడుపైతే నింపుతుందిగాని గుండెనూ, మనసునూ భగ భగమండుతున్న భట్టీ చేసి వేస్తుంది. వీటన్నిటికన్న యీ వృత్తే ఎంతో నయం. నేనిప్పుడు దొంగను కాదు బెస్తవాడిని.....బెస్తవాడిని" అతను భూవ్యాకాశాలను ఉద్దేశించి సంబోధిస్తున్నట్లు అన్నాడు. ●



MTP-1-P-1-65/66 TL

శాకాహారుల మిత్రుడు

'శ్రీ సత్యనారాయణబక్షీ' పేరు వినగానే —"ఏ వూరుమనిషి'? కాశ్మీరీయా, పంజాబీనా, లేక......' అని అడుగుతారు చాలా మంది. కాని ఈయనది విజయనగరం. అంతేకాదు ఆయన 'శ్రోత్రియమయిన బ్రాహ్మణ' కుటుంబంలో జన్మించినట్లు ఆయనే చెప్తారు. ఆయన తండ్రి శ్రీ సీతా



సత్యనారాయణ బక్షి

రామబక్షీ గొప్ప సంగీత విద్వాంసులు. చిత్రకారులు. ఆయన కుమారుడు శ్రీ సత్యనారాయణ బక్షీ బి. ఏ. దాకా విజయనగరంలో, మహారాష్ట్ర—బీహారు రాష్ట్రాలలో ఎం. ఎ. ఎల్. ఎల్. బి. దాకా చదివి పట్టభద్రులయ్యారు. చిన్నప్పటినుంచీ హాస్యం అంటే ఇష్టం కలవారు. ఎన్నో నాటకాల్లో 'హాస్య పాత్ర'లలో వేశారు. ఎందరినో నవ్వించారు. అయితే ఉద్యోగరీత్యా సుప్రసిద్ధ విమానసంస్థ 'ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్'లో 'శాకాహారశాఖ'లో ఒక ఉన్నతోద్యోగిగా ఉంటున్నారు. బొంబాయినుంచి మాస్కోదాకా, నైరోబీనుంచి న్యూయార్క్‌దాకా, నందీనుంచి లండన్‌దాకా, టోక్యోనుంచి కలకత్తాదాకా ఎయిర్ ఇండియా విమానాలలో ప్రయాణీకులకి శాకాహార భోజనంలోని రుచులని చవి చూపిస్తున్నారు. అంతేకాక, వివిధ దేశాలలో, వివిధ ప్రాంతాలలో భోజనం, వడ్డన పద్ధతులని అనుశీలించి వాటిని తదనుగుణంగా 'ఎయిర్ ఇండియా 'సర్విస్'లలో అమలు జరుపుతున్నారు. వీటన్నిటికన్నా, భారత పాకశాస్త్రాలలో, శాకాహారంలోఉన్న నైపుణ్యాన్ని లక్షలాది అంతర్జాతీయ ప్రయాణీకులకి తెలియజేస్తున్నారు.

ఏ కాలేజిలోనో అధ్యాపకుడు కావలసిన శ్రీ బక్షీకి వంటమీద దృష్టి ఎలాపోయింది.

"ఇదీ 64 కళలలో ఒకటికదా!" అంటారు ఆయన చిరునవ్వుతో.

వంట ఎక్కడ అభ్యసించారు?

"ఇదమిద్ధమని ఎక్కడా నేర్చుకోలేదు. అయితే, మంచి భోజనం సేవించటం, వాటిని ఎలా తయారు చేస్తారో తెలుసుకోవడం అంటే నాకు ఎప్పుడూ సరదా! పదేళ్ళ క్రితం మన పిండివంటలే మృష్టాన్న భోజనం అనుకునేవాడిని. కాని, మన దేశంలోనే ఉండే మహా నగరాలలోని పబ్లిక్ కేటరింగ్ శాఖలనిచూస్తే— ఈ ఆధునిక ప్రపంచంలో ఎన్ని సాంకేతిక యంత్ర సాధనాలు! ఎన్ని నాజూకయిన పదార్థాలు వండుతున్నారు!— అనిపించింది. అప్పటినుంచీ నేను తీరిక సమయాలలో ఇటువంటి కేటరింగ్ సంస్థలలోకి వెళ్లి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.'

1964లో భారతదేశంలో జరిగి 'నేషనల్ వెజిటేరియన్ కాంగ్రెస్'లో శ్రీ బక్షీ ఒక నిర్ణేతగా పని చేశారు. 1965లో రాష్ట్రపతి డా. రాధాకృష్ణన్‌గారి ప్రశంసలని అందుకున్నారు.

ఎవరయినా విదేశీయులు మీరు ఇండియాలో ఏ ప్రాంతంవారని అడిగితే, 'అయ్ కమ్ ఫ్రమ్ ఆంధ్రా' అంటారు శ్రీ సత్యనారాయణ బక్షీ.

(ఓ. వి.)

సరోజ

(12 వ పేజీ తరువాయి)

పోయినా పరవాలేదు చెప్పేద్దామనిపించి అనేశాను.

"యే కులమైతే యేంలే. యేం చదువు కుంది?" అన్నాడు నవ్వుతూ.

ఐతే ఈయనగారికి యేకులమైనా పర్వాలేదన్న మాట. సరోజను పెళ్ళి చేసుకోవద్దు నాకోసమైనా' గట్టిగాఅరచి చెప్పాలని వుంది కానీ మాట పెగల్లేదు.

"యేమి చదువుకుందో అడిగితే జవాబు చెప్పవేం?" అన్నయ్య ప్రశ్న

"స్కూల్ ఫైనల్‌తో ఆపేసింది" అన్నాను ఎలాగో.

"చూడ్డానికి చాలా బాగుంది."

నాకు వళ్ళు మండింది. ఆ బాగానే వుంది. చూసిన ఆడాళ్లందరూ బాగానే వుంటారు. యిందాకటి నుండి తనేది జరగకూడదనుకుందో అది జరగబోతుంది. అన్నయ్య తప్పక సరోజను పెళ్లి చేసు కుంటాడు. నా మాట యెవరు వింటారు? నాకు మంచి వదిన కావాలి భగవాన్ నేనేం చెయ్యాలి? నా బాధను దాచుకోలేక యేడ్చేశాను. అన్నయ్య గాబరాపడ్డాడు.


"యేమైంది పారూ.... ఎందుకలా యేడుస్తున్నావు?"

"వద్దన్నయ్యా. నీవు సరోజను పెళ్లి చేసుకోకు. నాకు మంచి వదిన కావాలి. నీలాటి మనసుగల వదిన కావాలి. నాకు యే ఆదరణ కరువైందో ఆ ఆదరణ చూపే వదిన కావాలి. నీచెల్లి నడుగు తున్నా నామాట మన్నించవూ.... ప్లీజ్ అన్నయ్యా నామాట విను....!." ఇక మాటాడలేక పోయాను.

"పిచ్చిపిల్లా, యిందుకా నీవు యేడుస్తున్నది. నేను సరోజను పెళ్లి చేసు కుంటానని యెలా అనుకున్నావు పారూ. నేను యిదంతా అడిగింది నా కోసం గాదు. మధు కోసం. మధూకి సరోజ నచ్చింది. యేమైనా సరోజనే పెళ్లి చేసుకోవాలి అటా.... అందుకని వాడు కనుక్కోమంటే వివరాలడిగా నంతే."

"ఎంత మంచి వాడ వన్నయ్యా" అన్నాను నేను ఆనందంతో. నిజానికి నాకు అన్నయ్య మంచి తన మేమిటో తెలీదు. ఒకవేళ మధు రాకపోయినట్టయితే కథ అడ్డం తిరిగేదేమో. అబ్బ యేమైతే నేం.... ప్రమాదం తప్పింది అనుకుంటూ న్నిదలోకి జారుకున్నాను. ●

కొత్తనటుడు కృష్ణ



గూఢచారి 116 లో

1963 జనవరి ఉదయంపూట పాండీ బజార్‌లోని భారత్ కేఫ్ ముందు వో పడుచు కుర్రాడూ, మధ్య వయసులో వున్న వో పెద్ద మనిషి— నిలుచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ దారినే కారులో జోరుగా వెళ్తున్న యువదర్శకు డొకాయన— మెరుపులాంటి యీ అబ్బాయిని చూసి కారు వెనక్కి తిప్పి, వారి దగ్గరకు వచ్చాడు. "సార్, ఈ అబ్బాయి తెలుగా, తమిళా?" అని అడిగాడు పెద్ద మనిషి నుద్దేశించి. ఆయన నవ్వి "అసలు సిసలయిన తెలుగు!" అన్నారు.

"సినిమాల్లో నటించాలనే ఉత్సాహం ఉందా?" అని మళ్లీ అడిగాడు ఆ దర్శకుడు.

"అందుకేగా యీ వూరొచ్చింది" అంటూ ఆయన— ఈ యువకుణ్ణి ఆ దర్శకుడికి పరిచయం చేశారు. రేపు మా ఆఫీసు కొచ్చి తనను కలుసుకోమని చెప్పి వెళ్లి పోయాడు యువ దర్శకుడు.

వాళ్ల ముగ్గురులోనూ ఒకరు కృష్ణ, మరొకరు శ్రీధర్, ఇంకొకరు ప్రఖ్యాత రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు.

ఆ మర్నాడు కృష్ణ, చిత్రాలయ వారి కార్యాలయానికి వెళ్లాడు. "తమిళం బాగా నేర్చుకోండి. నా 'కాదలిక్క నేరమిల్లై'లో వేషం యిస్తాను" అన్నారు శ్రీధర్. అక్కణ్ణించి వాళ్లే తమిళం నేర్పటం ప్రారంభించారు. ఒక నెల గడిచింది. కృష్ణకు తమిళ్ పట్టుబడలేదు. శ్రీధర్ "కాదలిక్క నేరమిల్లై" ఆరంభించేందుకు ఉపక్రమించాడు. "ఇంకా బాగా నేర్చుకోండి. నా తర్వాత చిత్రంలో యిస్తాను" అన్నాడాయన.

అంతకుముందు ఇండియన్ పీపుల్స్ థియేటర్ వారి నాటకాల్లో— స్వర్గీయ డాక్టర్ రాజారావుగారి నిర్వహణలో యిచ్చిన అనేక ప్రదర్శనల్లో పాల్గొన్నాడు. నాటి రంగస్థల అనుభవాలు అతన్ని ఉత్సాహపరిచి సినిమానటుడు కావాలనే కోరికను రేకెత్తించినవి. 1960 లో బి. యస్. సి. చదువుకునేటప్పుడు ఆ కోరిక పెరిగి పెద్దదయి కూచున్నది. అప్పుడు మద్రాసు వచ్చి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం సఫలం కాలేదు.

నిరుత్సాహంతో ఇంటికి వచ్చేసిన కృష్ణ ఒక యేడాదిపైబడి గడిచాక— వో రోజు పేపర్లో బాబూ మూవీస్ ప్రకటనకు అప్లైచేశాడు.


సినిమాకు సంబంధించిన నటన అంతా కృష్ణ బాబూ మూవీస్ వారి స్కూల్లో నేర్చుకున్నాడు. కారు డ్రైవింగ్, గుర్రపుస్వారి, ఫైట్స్, నృత్యాలు, స్కూటర్ నడపటం— యిలా ఒకటేమిటి— ఒక హీరోకి కావలసిన లక్షణాలన్నీ వాళ్లే నేర్పించారు. ఈ స్కూల్లో అతని గురువులు దర్శకులు శ్రీ ఆదుర్తి, శ్రీ కె. విశ్వనాథ్ లు.

కన్నె మనసులు చిత్రంలోని పతాకసన్ని వేశాలలో అపూర్వ మయిన నటన ప్రదర్శించాడు కృష్ణ. "గూఢచారి 116" చిత్రంలో అతనికి మంచి పేరు వచ్చింది. అన్ని తరగతులవారినీ ఆకర్షించి ఆకట్టుకున్నది కృష్ణ నటన — గూఢచారి 116 లో.

సినిమాలు చూడడం, స్నేహితులతో కబుర్లు చెప్పుకోవడం, నటనలో కొత్త సంగతులు తెలుసుకోవడం అతనికి సరదాలు.

బహు ప్రముఖ ప్రజ్ఞావంతుడయిన గొప్ప నటుడుగా రూపొందాలన్నది కృష్ణ వాంఛితం. అది ఫలించేవరకూ అతను నటనలో నిర్విరామ పరిశ్రమచేస్తూనే ఉంటాడు.

—మోహన్‌కుమార్ ●



కన్నెమనసులులో

చిత్రసమీక్ష:

శ్రీ కృష్ణతులాభారం

'విూరు జాలగలడా నా యానతి' అంటూ మిడిసి పడ్డ సత్యభామకు గర్వ భంగం అయి జ్ఞానోదయ మయి ప్రేమ కంటే భక్తి గొప్పదని, భగ వంతుడు భక్తజన సులభుడనీ నిరూ పిస్తుంది భారీ ఎత్తున సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'శ్రీ కృష్ణతులాభారం'.

కథ అందరికీ తెలిసిందే అయినా ప్రేక్షకునిలో ఉత్కంఠను పెంపొం దించేలా తెరకెక్కించడం అన్నది దర్శకుని ప్రతిభ మీద ఆధారపడి ఉంటుంది. ఎక్కడా ప్రేక్షకునికి విసుగెత్తించని రీతిలో దర్శకులు శ్రీ కమలాకర కామేశ్వర రావు ఈ పౌరాణిక చిత్రానికి సారథ్యం నెర పారు. ఛాయాగ్రహణం కూడా చక్కగా ఉంది.



"నవ్వులు—పువ్వులు"లో సుభాషిణి, రమ, సుధామాల, రాజబాబు.



'శ్రీకృష్ణతులాభారం'లో ఎల్. విజయలక్ష్మి

ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు కాంతారావు, రాజనాల, పద్మనాభం అంజలీదేవి, జమున, కృష్ణకుమారి, వాణిశ్రీ, ఎస్. వరలక్ష్మి, ఎల్. విజయ లక్ష్మి, జయంతి మొదలగు వారు ఉన్నారు.

శ్రీ కృష్ణుడుగా రామారావు అద్వి తీయమైన నటనను ప్రదర్శించారనటం అతిశయోక్తి కాదు. రుక్మిణిగా అంజలీ దేవి ప్రదర్శించిన నటన ప్రేక్షకుల హృదయాలను కదిలించేలా ఉంది. సత్య భామగా జమున చక్కని నటనను ప్రద ర్శించింది. నారదుడుగా కాంతారావు నటన ప్రసంశనీయంగా ఉంది. మిగిలిన వారు పాత్రోచితంగా నటించారు.

సంగీత దర్శకుడు పెండ్యాల శ్రావ్య మైన సంగీతాన్ని అందించారు.

—మాధవ్

చిత్రలహరి

ప్రేమలో ప్రమాదం

మాయను తన బావ మరిది భాస్కరే చంపేసి వుంటాడు. అలాంటి పనులు చేయడంలో వాడు సమర్థుడని భాస్కర్‌ని చూసినప్పుడల్లా అనిపిస్తూ ఉంటుంది. మాయ మీద పగ, డబ్బు మీద ప్రేమ— వాడికున్నంతగా మరెవరికీ ఉండవు. ఇది తప్పకుండా భాస్కర్ చేసిన పనేనని నిర్ధారించుకుని, ఎందుకో అనుమానం వచ్చి— తనగది కేసి నడిచాడు శాంతయ్య... బావ ఎంత అమాయకంగా కనిపిస్తాడో అంత ఘటికుడు. మహా తెలివయినవాడు. ఆయనకి తప్ప మాయను హత్యచేసే అవకాశం మరెవరికీ లేదు. నిశ్చయంగా ఆయనే చంపేశాడని నిర్ణయించుకొని భాస్కర్ బావగారి గదిలోకి వెళ్ళాడు. శాంతయ్య వచ్చిన మరు క్షణంలోనే భాస్కర్ కూడా ఆ గదిలోకి వచ్చాడు. చనిపోయిన మాయ వేనిటీ బాగ్ అక్కడ పడివుంది. భాస్కర్ దాన్ని పరిశీలనగా చూసి "అయ్య బాబోయ్, ఇది మాయది. ఇంకేం సందేహం లేదు. మాయను నువ్వే హత మార్చావ్!" అన్నాడు. శాంతయ్య అదిరి పోయాడు. "ఏడిశావ్, నేను చంపడ మేమిటీ, నువ్వేచేసి నా మీదకు నెట్టజూస్తున్నావ్. ఆ పప్పులు మన దగ్గరేం ఉడకవు!" బయటు చెప్పాడు. ఇంతలో గది బయట ఇన్స్‌పెక్టరు గొంతు



"పిడుగురాముడు"లో రామారావు, రాజశ్రీ.

చిత్రలహరి

వినిపించింది. "ఇన్స్పెక్టరు వస్తున్నాడే!" అంటూ భాస్కర్ బయటికి చూశాడు. ఈలోగా చటుక్కున అక్కడున్న వేనిటీ బాగ్ తీసి అలా విసిరాడు శాంతయ్య. అది వెళ్లి నెత్తిమీద ఉన్న ఫాన్ మీద పడింది. తనను తానే విసుక్కున్నాడు. ఇన్స్పెక్టరు— ఆ వేనిటీబాగ్ విషయం వాకబు చేద్దామనే యిపుడు ఆ గదిలోకి వచ్చాడు. "ఏమిటండీ బెల్లం కొట్టిన రాయిలా అలా యిద్దరూ మౌనంగా ఉన్నారు. ఏం జరిగిందీ!" అని అడిగాడు. శాంతయ్య తొట్రుపాటు పడి "అబ్బే ఏముందీ, ఏం లేదు" అన్నాడు. "ఇక్కడ గాలి రావటం లేదు. వెళ్లి కాస్త ఆ ఫాన్ స్విచ్ ఆన్ చేస్తారా?" అన్నాడు యిన్స్పెక్టర్ భాస్కర్‌తో. భాస్కర్ ఫాన్ స్విచ్ వేసేందుకు బయలు దేరాడు. శాంతయ్య గావుకేక పెట్టి "నెయ్యకోయ్, షాక్ కొడుతుందీ" అంటూ అరిచాడు. మాయ వేనిటీబాగ్ గురించి అడిగాడు యిన్స్పెక్టరు. తమకు తెలీదన్నాడు శాంతయ్య. వెళ్లిపోయాడు యిన్స్పెక్టర్. నిజంగా షాక్ కొడుతుందేమోనని భయ పడుతూ మెల్లగా స్విచ్ ఆన్ చేశాడు భాస్కర్. ఫాన్ తిరగడం వలన దాని మీదున్న వేనిటీబాగ్ వచ్చి శాంతయ్య కాళ్లముందు పడ్డది. భాస్కర్‌కు అర్థ మయి పోయింది బావగారి నాటకం. "ఇందుకా షాక్ కొడుతుందన్నావ్!" అంటూ శాంతయ్య కళ్లలోకి చూస్తూ గర్వంగా నవ్వాడు. వెళ్లిపోయాడనుకున్న యిన్స్పెక్టరు మళ్లీ వెనక్కి వచ్చి వాళ్లిద్దర్నీ చూస్తూ "ఏదీ, అది ఇలా యివ్వండి. ఊఁ, యివ్వండి!" అన్నాడు. హతాశులయి ప్రూన్పడి నిలబడి పోయారు ఇద్దరూ.— ఆసక్తి కరమైన యీ సన్నివేశం సిటాడల్ వారి "ప్రేమలో ప్రమాదం" చిత్రం లోనిది. భాస్కర్ రాజనాల, శాంతయ్య చదలవాడ కుటుంబ రావు, ఇన్స్పెక్టర్ రావికొండల రావు. కృష్ణకుమారి, రామకృష్ణ, చలం, రాజబాబు, సూర్యకాంతం, వాణిశ్రీ, జయంతి, రమాప్రభ, రాధ, జ్యోతి, విజయలలిత, పండరీబాయి, బేబీరోహిణి కూడా యీ చిత్రంతో వున్నారు. దర్శకుడు: జోసఫ్ తలియత్.

కొత్త చిత్రం ప్రారంభం!

ప్రకాష్ స్టూడియోలో గతనెల 21 న భాగ్యలక్ష్మి ఫిలిమ్స్‌వారి "భేతాళ మాంత్రికుడు" చిత్రానికి ఉదయం 10—30 గం. లకు ప్రారంభం జరిగింది. దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్య కెమెరా స్విచ్ ఆన్ చేయగా — ఈ చిత్రం లోని ప్రధాన పాత్రధారి శ్రీ యస్. వి. రంగారావు క్లాప్ కొట్టారు. ఆ రోజు చిత్రీకరణలో దగధగలు గా రేలంగి పాల్గొన్నారు. ప్రారంభానికి వచ్చిన వారిలో నటి కుమారి రాజశ్రీ, ఆమె సోదరి శ్రీమతి నిర్మల, గిరిజ, పత్రికాప్రతినిధులు ఉన్నారు. నిర్మాత డాక్టర్ మెంద్రెడ్డి రామచంద్రరావు తరఫున సంగీత దర్శకుడు శ్రీ ఎం. ఎస్. ప్రకాష్ ఆహూతులకు స్వాగతం చెప్పారు.



"భక్త పోతన"లో పద్మిని.

మనసే మందిరం

రాము నిద్ర పోతున్నాడు గదిలో. సీత బయట ఒంటరిగా నిలుచుని ఏమిటో ఆలోచిస్తున్నది. డాక్టర్ రఘు వచ్చాడు. అతడి మనసును తీరని సందేహం పెన వేసుకున్నది. అది సీతను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకుందుకే యిపుడు తను యిక్కడకు వచ్చాడు. సీతతో మాట్లాడడం— అందులోనూ ఒంటరిగా ఉన్నప్పుడు తప్పని తెలుసు. కాని, తప్పదు. తమ మధ్య ఏ కళంకమూ లేదని కూడా అతనికి తెలుసు. అయితేనేం, సీతకుండే భయం సీతకు ఉన్నది. ఏ పరిస్థితుల్లో అయినా, ఏ విధంగా అయినా రఘు ప్రేమించిన పడతి తానేనని తెలిస్తే—రాము ఏమవుతాడోనని అల్లల్లాడి పోతున్నది. నిలువెల్లా కంపించి పోతున్నది—సీత. నిత్య సుమంగళిగా నూరేళ్ళూ జీవించాలనీ, ఆమె అనవరతమూ సుఖ సౌఖ్యాలను అనుభవించాలనీ రఘు మనఃపూర్తిగా కోరుకుంటున్నాడు. అయితే తనను పీడిస్తున్న ఆ ఒకే ఒక్క సందేహాన్ని తీర్చుకొంటేగాని మనశ్శాంతి చేకూరదు. తన హృదయంలో హృదయంగా మసిలి, తను తప్ప వేరే ఆరాధ్య దైవం లేని సీత, తన రాకకోసం వేయి కళ్ళతో నిరీక్షించే సీత— ఆ



"మనసే మందిరం"లో సావిత్రి, నాగేశ్వరరావు.

రామును విందుకు పెళ్లి చేసుకున్నట్టు? ఇదీ డాక్టర్ రఘును వేధిస్తున్న సందేహం. మానసిక సంఘర్షణలను మనోజ్ఞంగా చిత్రించిన శ్రీ కృష్ణసాయి ఫిలిమ్స్ వారి "మనసే మందిరం" చిత్రంలోనిదీ దృశ్యం. సీత సావిత్రి, డాక్టర్ రఘు నాగేశ్వరరావు, రాము జగ్గయ్య. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం శ్రీధర్.

అడుగు జాడలు

సుదూరాన ఒక కొండ ఉన్నది. ఆ కొండ మీదకు మలుపులు తిరుగుతూ చిన్న మెట్లు సుందర తమ మయిన దేవాలయాన్ని చేరుకుంటున్నవి. గుడిగోపురం మీద సువర్ణ కలశాలు వింతకాంతులు వెదజల్లుతున్నవి. ఇదంతా విజయ్ బైనాక్యులర్స్ లోంచి చూస్తూ "ఎంత అద్భుతంగా ఉంది!" అన్నాడు. పక్కన పార్వతి ఉన్నది. "ఏమిటది?" అని అడిగింది. చెప్పాడతను "మనం అక్కడికి వెళదామండి!" అడిగింది పార్వతి. కనుచూపు మేరలో లేదు గనుక వెళ్లేందుకు సాధ్యపడదన్నాడు. "అలాగా" అని అతని దగ్గరి నుంచి బైనాక్యులర్స్ లాక్కుని చూస్తుంది. కాని, కళ్లు ఉంటేగా కనిపించడానికి. ఆమె అంధురాలు. మోటారు సైకిల్ మీద తొలిసారిగా తను విజయ్‌ను చూడడం జ్ఞాపకం వచ్చింది. ఏడుస్తూ "విజయ్!" అని అరిచింది. అతను ఆశ్చర్య పోయాడు బైనాక్యులర్స్ తీసు



'సత్యమేజయం'లో వాణిశ్రీ.




'సగాంయా' హిందీచిత్రంలో రాజశ్రీ

కున్నాడు పార్వతి కళ్లు నీళ్లతో నిండుకున్నవి. అతను కలవర పడుతూ "పార్వతీ, ఏం జరిగింది?" అని అడిగాడు. తన పక్కనున్నవాడే విజయ్ అని ఆమె అనుకోవడం లేదు. శేఖర్ అనే మరొకవ్యక్తిగా అతన్ని పార్వతి భావించుకుంటున్నది. "శేఖర్, తొలిసారిగా అతన్ని యీ బైనాక్యులర్స్ లోంచి చూశాను. ఆ రోజు మోటార్‌సైకిల్ రేస్‌లో— గాలిలో తేలిపోయే ఆ వేగం, అతడి హుందాతనం ఎంత ముచ్చట వేసింది. అతను ఎంతో స్పోర్ట్స్‌మన్ అనుకున్నాను గానీ..." అంటూ పార్వతి యింకా చెప్పబోతుంటే విజయ్ మధ్యలోనే అందుకుని "అవన్నీ యిప్పుడెందుకు జ్ఞాపకం చేసుకుంటావు" అన్నాడు. "నా మనసు ఇలాగైనా తేలిక పడుతుంది. మొదట నా తండ్రిని బలిగొన్నాడు. రెక్కలు విరిచి నన్ను దిక్కులేని దాన్ని చేశాడు. అతనికి కరుణ లేదు. హృదయం లేదు. అతని కసి తీరలేదు. నన్ను అంధురాల్ని చేశాడు. కిరాతకుడు. పరమ హంతకుడు" తూలనాడుతున్నది. విజయ్ పట్టలేక "పార్వతీ!" అరిచాడు. పార్వతి ఏడుస్తున్నది. "శేఖర్, నన్ను విజయ్ దగ్గరికి తీసుకెళ్లు! నా ప్రాణాలు తీసుకోమని వేడుకుంటాను" అని అడిగింది. నిజం ఎరిగించటం ఎలా? కళ్లు మూసుకొని బాధగా "పార్వతీ!" అన్నాడు. గొంతులోని మార్దవాన్ని, దుఃఖాన్ని ఆమె గుర్తించి "మీ గొంతు అలా వణుకుతుందేం?" అడిగింది. "లేదు పార్వతీ" తప్పించుకో బోయాడు. "అదిగో బరువుగా మాట్లాడుతున్నారు. బాధపడుతున్నారు కదూ? ఎప్పుడూ నేను విజయ్‌నే తలుచుకుంటున్నానని మీకు బాధగా ఉంది కదూ?" అన్నది.

యీ సన్నివేశం నవజ్యోతి ఫిలిమ్స్ వారి "అడుగు జాడలు" చిత్రం లోనిది. పార్వతి జమున, విజయ్ యన్.టి. రామా

సవరణ

2—9—66 సంచికలోని 53 వ పేజీలో సతీష్ జన్మదినోత్సవ సందర్భంగా వేసిన ఫొటోలో శ్రీ జెమినీ గణేశన్ ప్రక్కనున్నవారు మిసెస్ జెమినీ గణేశన్ అని పొరపాటున ప్రచురింపబడిందని తెలుపుటకు చింతిస్తున్నాము. సం.



"మనసే మందిరం"లో ఒక దృశ్యం.

రావు. దర్శకుడు: తాపీచాణక్య.

చిత్రలహరి

వాహినీలో 'కంచుకోట'

విశ్వశాంతి పిక్చర్స్ వారి "కంచుకోట" చిత్రానికి వాహినీ స్టూడియోలో గతనెల 20 వ తేదీ తెల్లవారు జామున గం. 3—11 ని. లకు శ్రీ సి. చక్రవర్తి అయ్యంగార్ పూజతో ప్రారంభమయింది. ఈ ముహూర్తంలోనే శ్రీ యస్. త్రివిక్రమరావు గారి ఆధ్వర్యంలో పి. లీల పాడిన ఒక శ్లోకాన్ని— కె. వి. మహదేవన్ సంగీత దర్శకత్వంలో రికార్డు చేశారు. ప్రీమియర్ ఫిలిమ్స్‌కు చెందిన శ్రీ కంచర్ల నారాయణరావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలిషాట్‌లో యన్.టి. రామారావు, సావిత్రి పాల్గొన్నారు.

ఈ చిత్రంలోని ముఖ్య భూమికలలో రామారావు, సావిత్రి, దేవిక, కాంతారావు, రాజనాల, పద్మనాభం, రమణారెడ్డి, ధూళిపాళ, ఉదయకుమార్, సత్యనారాయణ, కాంతకుమారి ఉన్నారు. రెండవ షూటింగు షెడ్యూలు సెప్టెంబరు 12 నుంచి ఆరంభమవుతుంది. భారీ యెత్తున నిర్మింపబడుతున్న యీ సాహసోపేత జానపద చిత్రానికి దర్శకుడు: సి. యస్. రావు.




'అడుగుజాడలు'లో జమున.

సతీసుమతి

మోహనాంగి శయన మందిరంలో కౌశికుడు సురాపానం సేవిస్తూ, ఆ మత్తులో తన్మయతను అనుభవిస్తున్నాడు. మోహనాంగి అందచందాలకు, శరీరపు ఒంపు సొంపులకు అమిత వ్యామోహితుడయి పోతున్నాడు. "సఖి మోవిలో సుధారసమూ, మధుపాత్రలో సుమాసవమూ, సరి సరిగ్రోల సురభోగాల— తేలి తేలి పోయే" అంటూండగా "హాయి వేరేది లేదోయి, అందే మగువ చిందే మధువు అందించే సౌఖ్యాల" అంటూ అభినయిస్తూ అతణ్ణి మరింత మత్తులో ముంచి వేస్తున్నది మోహనాంగి. ఈ క్షణాన అతనికి ఎవరూ ఏమీ కనిపించడంలేదు. సర్వమూ ఆమే అయినది. యుగయుగాలుగా తనకోసమే వేచివున్న ఒందంలా ఉన్నది. పట్టరాని తమకంలో పొదివి పట్టుకుంటున్నాడు మోహనాంగిని. అనుభవాల పారవశ్యంలో హద్దులు మరచి పోయి పతన మవుతున్నాడు కౌశికుడు— రసభరిత మయిన యీ సన్నివేశం చిన్ని బ్రదర్స్ వారు నిర్మిస్తున్న "సతీసుమతి" చిత్రం లోనిది. మోహనాంగి కాంచన, కౌశికుడు కాంతారావు. పై యుగళ గీతాన్ని రసికజన మనోభిరామంగా ఆలపించిన గొంతులు పి.బి. శ్రీనివాస్, యస్. జానకి లవి. చక్కని వాద్య గోష్ఠితో వీనులకు విందొనర్చే స్వరాన్ని సమకూర్చినది— మధుర బాణీలస్వరకర్త సంగీత దర్శకుడు ఆదినారాయణరావు. వేదాంతం రాఘవయ్య దర్శకత్వాన యీ చిత్రం వీనస్ స్టూడియోలో నిర్మించబడుతున్నది. అంజలీదేవి, యస్.వి. రంగారావు, రేలంగి, యల్. విజయ లక్ష్మి, వాసంతి, గిరిజ, హరనాథ్, సూర్యకాంతం, ధూళిపాళ, నాగరాజు కూడా తారాగణంలో వున్నారు.

—మోహన్ కుమార్ ●


మీ!
అభిమాన తారాగణంతో - సాంకేతిక ప్రవీణులతో
ప్రసన్న సంగీతంతో - రసోచితంగా మధుర
మధురంగా కథను మలచి - అపూర్వ శిల్పకళా
శోభలతో నిర్మించిన మహోజ్వల చిత్రరాజము....
Roopkala
సురేష్ ప్రొడక్షన్స్
శ్రీకృష్ణ తులాభారము
దర్శకత్వం: K. కామేశ్వరరావు, B.A.,... నిర్మాత: D. రామానాయుడు
రచన: సముద్రాల * సంగీతం: పెండ్యాల * కెమెరా: అన్నయ్య * కళ: రాజేంద్రకుమార్, B.A., * కూర్పు: మార్తాండ్ * నృత్యం: K. S. రెడ్డి
ఆంధ్ర-సీడెడ్: విజయ.... నైజాం: వాణి.... మైసూర్: విజయ సర్క్యూట్
VIJAYA

పుస్తకాలు

మాతృశ్రీ

జిల్లెళ్లమూడి అమ్మవారి ఆధ్యాత్మిక సందేశములను సామాన్య ప్రజానీకానికి అందించుటకు ప్రారంభింపబడిన 'మాతృశ్రీ' మాసపత్రిక ప్రారంభ (జూన్, 1966) సంచిక మా కార్యాలయం చేరినది. శ్రీ ఎ. శేషగిరిరావు సంపాదకత్వాన వెలువడుతున్న మాతృశ్రీ ఆంగ్లములోనూ, తెలుగులోనూ ప్రచురింపబడుతుంది. సంవత్సర చందా పదిరూపాయలు విడిప్రతి 80 పైసలు. వివరములకు: మాతృశ్రీ పబ్లికేషన్స్, జిల్లెళ్లమూడి పోస్టు, (వయా) బాపట్ల గుంటూరు జిల్లా.



మణిమాల అభినవ కౌముది

గేయ కావ్యము. రచన: శ్రీ కూచి సూర్య ప్రకాశశర్మ. ప్రతులకు: రమాబాలానంద సంఘము, శాఖవీధి, అనకాపల్లి. విశాఖజిల్లా. పుటలు: 56. వెల: రు. 1-00

మహాకవి శ్రీ పింగళి సూర్యనార్యుని 'కళాపూర్ణోదయము' అబ్బురంపు కతల నెలవు ఆంధ్ర పద్య నవల. ఆ మహాకావ్యము ఆధారముగా సులభశైలిలో శ్రీ సూర్యప్రకాశశర్మగారు రచించిన 'మణిమాల' మొదటిభాగము 'అభినవ కౌముది', "ముత్తెపుకత మణుల తోడ, మెత్తని పలుకుల పైడిని, సులభ గేయ తంత్రులతో, శ్రుతికింపను మెరుగుతోడ వ్రాయ నుత్సహించి" నట్లు పీఠికలో రచయిత ఉటంకించారు. 'ముత్తెపు కత మణులు' అపురూపపు కృతుల వ్రాసి పేరెన్నిక గన్నయట్టి పింగళి సూరనయే అభినందనీయుడు. అలఘువ్రత చరిత్రము, నారద గాంధర్వము మణిద్వయాలుగా శర్మగారు స్వీకరించారు. మెత్తని పలుకుల పైడి రచనయందంతటా గోచరిస్తున్నా, పైడికి పెద్దగా వాసన మాత్ర మబ్బినట్లు లేదు. శల్యాసురుని ఏదుపంది ముండ్లు బోలిన రోమరాజిని వర్ణించుచు 'ముండులు' అని పదప్రయోగం చేయడము, శ్రీశైల పర్వత వర్ణన సందర్భంలో సకల జీవ భరము మోసిన ధరణి 'చాల బద్ధకము' చేత ఒడలు విరిచిన దనడము, (భారము అలసటను గాని, బద్ధకమును కల్గించదను భావము) పైడి పై మెరుగును తగ్గిస్తున్నవి. కారడివి కౌముది మేను కాంతులు కారుమబ్బులోన మెరుపు కాంతులతో పోల్చి, ఆమెను పశ్యత్తోడు దీప కళికగా వర్ణించి, శల్యుడామెను వెంటాడుటను వెలుగు లోన నడచు నరుని వెన్నాడెడు నీడతో ఉపమించి ప్రకటించారు. సులభ గేయ తంత్రులు, కావ్యంలో ఎక్కడ మీటినా రస ప్రకంపనం చేస్తున్నాయి. సోము సోము నోము జాలు చక్కనైన ఫాలం, సంపెంగల నూవుపూల చాలనవ్వు నాసిక. ప్రశికారములను బోలెడి చెవుల జంట సొంపు వంటి మృదు ప్రభ బోలెడి చెవుల జంట సొంపు వంటి మృదు ప్రయోగములు పరమ రామణీయకతను కల్గిస్తున్నాయి. కానీ, అసురుని నోటి వెంట వచ్చినా, "ఏయ్ పిల్లా!" వంటి ప్రయోగము రసవాతావరణాన్ని కలుషితం చేస్తున్నది రచయిత, గేయమునకు మెరపు 'శ్రుతికి ఇంపు'గా ఉండడమే నని గ్రహించినందువల్ల, చాల చోట్ల అలతి అలతి పదములు, తేటతెనుగు మాటలు! వ్యవహారమునందున్న ప్రయోగములు, మాత్రాబద్ధ రచనమే కన్పిస్తాయి. వృత్తి రీత్యా ఆంధ్రోపాధ్యాయులైన శర్మగారి వ్యుత్పత్తి పటిమకు తోడు, ప్రతిభాశేముషికి కూడా అవకాశమిచ్చే రచనలనేకములు, సాగించవచ్చునని ఆంధ్ర సాహితీ లోక మాశింపవచ్చును. కానీ పుస్తకాన్ని 'నోట్‌బుక్' వలెగాక అందంగా ముద్రింపవలెనని కె. ఏ. యస్. పబ్లికేషన్స్ వారికి తోచకపోవడం శర్మగారి, వారి పాఠకుల దురదృష్టం. —శ్రీరామచంద్రమూర్తి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

